
# దేవదాసు

(నవల)



## శరత్

అది వైశాఖ మాసం. మిట్ట మధ్యాహ్నం. మండు టెండ మిటమిట లాడుతూ వుంది. వాతావరణంలో వేడి అపరిమితంగా వుంది. సరిగ్గా అదే సమయంలో ముఖోపాధ్యాయగారి వంశాంకురం దేవదాసు, పాఠశాలలోని ఒక గదిలో ఒక మూలన స్లేట్ చేతిలోకి తీసుకొని, కాళ్ళు ఆరజాపుకొని, అకస్మాత్తుగా ఒళ్ళు విరుచుకుంటూ అత్యంత ఉద్విగ్నుడై పోయాడు. ఇటు వంటి మనోహరమయిన సమయంలో మైదానం మీదికి వెళ్ళి గాలిపటాలు ఎగర వేసుకొనడానికి బదులు పాఠశాలలో బందీగా పడివుండటం అమిత మైన దఃఖాన్ని కలుగజేస్తుందని క్షణంలో అతడు నిశ్చయించుకున్నాడు. సారవంతమైన అతడి మస్తిష్కంలో నుంచి ఓ ఉపాయం కూడా బయట పడింది. అతడు స్లేట్ తీసుకొని, అలాగే లేచి నిలబడ్డాడు.

పాఠశాలలో ఇప్పుడే అల్పాహారానికి సెలవిచ్చారు. మగ పిల్లవాళ్ళ సమూహం రకరకాల ఆటపాటలతో, అల్లరి చేష్టలతో అక్కడే వున్న రావిచెట్టు క్రిందికి చేరి బిల్లగోడు ఆట ఆడుతూ వున్నారు. దేవదాసు ఒక్కసారి అటువైపు చూశాడు. అతడికి అల్పాహారపు సెలవు లభించదు. ఎంచేత నంటే ఒకసారి పాఠశాల విడిచి బయటికి వెళ్ళిన తరువాత మళ్ళీ తిరిగి రావడానికి దేవదాసు ఇష్టపడడు. అలా తిరిగి రాకపోవడం గోవింద్ పండితుడు అనేకసార్లు చూశాడు. దేవదాసు తండ్రి కూడా సెలవు ఇవ్వడానికి అనుమతించలేదు. అనేక కారణాల వలన ఇప్పటినుంచి అతణ్ని విద్యార్థి నాయకుడయిన (మానిటర్) భూలో పర్యవేక్షణలో వుంచేటట్లుగా నిశ్చయించారు.

ఒక గదిలో పండితులవారు మధ్యాహ్నపు బడలికను పోగొట్టుకొనడానికి కళ్ళు మూసుకొని నిద్రబోయాడు. విద్యార్థి నాయకుడు (monitor) భూలో ఒక మూలన కాళ్ళూ చేతులు చాపుకొని ఒక బెంచీ మీద కూర్చొని వున్నాడు. మధ్య మధ్యలో ఉపేక్షగా ఒకప్పుడు ఆ మగపిల్లల సమూహాన్ని మరొకప్పుడు పార్వతీ, దేవదాసులను చూస్తూ పోతున్నాడు. పార్వతి పండితులవారి ఆశ్రయంలోకి, పర్యవేక్షణలోకి వచ్చి ఇప్పుడే పూర్తిగా ఒక నెల మాత్రమే అయ్యింది. పండితులవారు యీ కొద్దికాలంలోనే ఆమె మనసుకు బాగా వినోదం కలిగించారు. అంచేత ఏకాగ్రతతో, ధైర్యంగా నిద్రిస్తున్న పండితులవారి చిత్రాన్ని "బోధోదయ" పుస్తకంలోని చివరి పేజీ మీద సిరాతో చిత్రిస్తూ వుంది. బాగా ఆరితేరిన చిత్రకారిణిలాగా వివిధ భావాలతో, ఎంతో ప్రయత్నంతో గీసిన ఆ చిత్రం ఆదర్శానికి ఎంత దగ్గరగా వుందో అని చూస్తూ వుంది. ఆ చిత్రంలో ఆయన పోలిక అంత ఎక్కువగా కన్పించకపోయినా, ఆ చిత్రించగలిగిన రూపం చూసి ఆమెకు అమితమైన ఆనందమూ, ఆత్మసంతృప్తి కలుగుతూ వున్నాయి.

ఇదే సమయంలో దేవదాసు స్లేట్ చేతిలోకి తీసికొని లేచి నిల్చున్నాడు. భూలోను ఉద్దేశిస్తూ- "ఈ లెక్క తెలియడంలేదు" అన్నాడు.

భూలో శాతంగా, గాంభీర్యంగా "ఏమిటా లెక్కా?" అన్నాడు

"వ్రాత లెక్క..."

"స్లేట్ చూడనివ్వు!"

అతడి పనులన్నీ స్లేట్ చేతిలోకి తీసుకోవడంతోనే అయిపోయేవి. దేవదాసు స్లేట్ అతడి చేతికిచ్చి దగ్గరగా నిలబడి వున్నాడు. భూలో ఇలా అంటూ వ్రాస్తున్నాడు-ఒక మణుగు నూనె ధర పదునాలుగు రూపాయల తొమ్మిది అణాల, మూడు దమ్మిడీలు అయితే....?

అదే సమయంలో ఓ సంఘటన జరిగింది. కాళ్ళూ చేతులూ లేని బెంచీ పైన విద్యార్థి నాయకుడు తన పదవికి గల గౌరవానికి తగినట్లుగా ఆసనాన్ని నిశ్చయించుకొని, నియమపూర్వకంగా ఇప్పటికి మూడు సంవత్సరాల నుంచీ కూర్చుంటూ వస్తున్నాడు. దాని వెనుక తెల్లని పొడి సున్నం ఒక గుట్టగా పోసి వుంది. దీన్ని ఎప్పుడో పండితులవారు చౌక ధరకు కొని వుంచాడు. మంచిరోజు మళ్ళీ తిరిగివస్తే పక్కా ఇల్లు కట్టించాలని అనుకొన్నాడు. ఆ మంచిరోజు యెప్పుడు తిరిగి వస్తుందో నాకు మాత్రం తెలియదు. కాని ఆ తెల్లని సున్నాన్ని మాత్రం చాలా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాడు. ప్రపంచంతో పరిచయం లేనటువంటి, దూరాలోచన లేనటువంటి ఏ దరిద్రపు అర్భకుడు కూడా అందులో ఒక్క కణాన్ని కూడా నష్టపరచలేకపోతున్నాడు. అంచేత ఆయన ప్రేమకు పాత్రుడయిన, వయసులో పిల్లలందరికన్న పెద్దవాడయిన భోలానాథ్ (భూలో)కు ఎంతో ప్రయత్నపూర్వకంగా కూడబెట్టిన వస్తువును జాగ్రత్తగా కాపాడే బాధ్యత లభించింది. అంచేతనే అతడు బెంచీ మీద కూర్చొని దానిని చూస్తూ వుంటాడు.

భోలానాథ్ వ్రాస్తూ వున్నాడు_ఒక మణుగు నూనె ధర పదునాలుగు రూపాయల, తొమ్మిది అణాల, మూడు దమ్మిడీలు అయితే...? "ఓరి బాబోయ్" అని కేక, ఆ తరువాత పెద్ద గందరగోళమయింది. పార్వతి పకపకా నవ్వుతూ, చప్పట్లు చరుస్తూ నేలమీద పడి దొర్లుతూ వుంది. నిద్రపోయిన గోవింద్ పండితుడు ఎర్రటి కళ్ళను మూసుకుంటూ గాభరాపడుతూ లేచి నిల్చున్నాడు. చెట్టు క్రింద పిల్లవాళ్ళ గుంపు బారుదీరి ఒక్కసారిగా "హో హో" అని అరుస్తూ పరుగెత్తుకొస్తూ వుండడం చూశాడు. ఆ సమయంలోనే ఆ విరిగిపోయిన బెంచీ పైన ఒక జత పాదాలు నర్తిస్తున్నాయి. ఆ సమయంలో ఆ సున్నపు రాశిలో అగ్నిపర్వతం బద్దలయిందా అన్నట్లు, బాంబు ప్రేలిందా అన్నట్లు పెద్ద ధ్వని వినిపించింది. అరుస్తూ "ఏమిటి, ఏమిటి _ఏమిటిరా?" అని అడిగాడు.

జవాబు చెప్పడానికి కేవలం పార్వతి మాత్రమే వుంది. కాని అప్పుడామె నేలమీద దొర్లుతూ చప్పట్లు చరుస్తూ వుంది. పండితులవారి విఫలమయిన ప్రశ్న క్రోధంగా మారిపోయింది__"ఏమిటీ__ఏమిటీ__ఏమిటిరా?

ఆ తరువాత శ్వేతమూర్తి భోజనాద్ సున్నం దులుపుకొని నిల్చున్నాడు పండితులవారు మరింతగా అరుస్తూ__

"ఓరి దుష్టుడా! నీవేనా, నీవేనా ఆ సున్నపు గుట్టలో పడివుందీ?" అన్నాడు.

ఆఁ__ఆఁ__ఆఁ

ఏమిటిరా ఇదంతా?"

"ఆ దేవదాసుగాడు__నన్ను నెట్టి__ఆఁ__ఆఁ__వాడి లెక్క _"

"మళ్ళీ మూర్ఖుడా?"

కాని క్షణంలో జరిగిన వ్యవహారమంతా తెలిసికొని, చాపమీద కూర్చొని అడిగాడు_దేవదాసు నిన్ను నెట్టి, పడగొట్టి వెళ్ళిపోయాడా?"

భూలో అన్నాడు__"ఆఁ__ఆఁ__ఆఁ__ఆఁ" తరువాత కొన్ని క్షణాలు సున్నం దులుపుకొన్నాడు. అయితే శ్వేతవర్ణం, శ్యామ వర్ణం కలిసిపోయిన కారణంగా విద్యార్థి నాయకుడు భూతంలాగా కన్పిస్తూ వున్నాడు. అప్పుడు కూడా అతడి ఏడ్పు ఆగలేదు.

"దేవా నిన్ను నెట్టి సున్నంలోకి పడగొట్టి వెళ్ళిపోయాడా, సరే!" అన్నాడు

"ఆఁ__ఆఁ__ఆ__" అన్నాడు భూలో.

"పిల్లలెక్కడున్నారు?" అడిగాడు పంతులవారు.

ఆ తరువాత పిల్లల సమూహం కందిపోయిన వదనాలతో రొప్పుకుంటూ రోజుకుంటూ తిరిగివచ్చి "దేవాను మేము పట్టుకోలేకపోయామండీ! అబ్బా! ఎంతో గురిగా రాయి విసురుతాడు!" అని చెప్పారు.

"పట్టుకోలేకపోయారా?"

మరో పిల్లవాడు మొదట చెప్పిన విషయాన్నే రిపీట్ చేస్తూ "అబ్బా! ఎంతో గురిగా....!"

"కొంచెం ఆగండి!"

అతడు నోరుమూసుకుని ప్రక్కనే కూర్చుండిపోయాడు. నిష్ఫలమయిన

క్రోధంతో మొదట పండితులవారు పార్వతిని బాగా బెదిరించారు. తరువాత భోలానాద్ చేయి పట్టుకొని "పద, ఒకసారి జమీందారుగా కచేరీలో చెప్పివద్దాం!" అన్నారు.

జమీందారయిన ముఖోపాధ్యాయగారి దగ్గర వారి పుత్రరత్నం యొక్క ప్రవర్తనను గురించి ఫిర్యాదు చేద్దామని దాని తాత్పర్యం.

అప్పుడు దాదాపు మూడు గంటల అవుతూ వుంది. నారాయణ ముఖోపాధ్యాయగారు బయట కూర్చొని హుక్కా త్రాగుతూ వున్నారు. ఒక నౌకరు పంఖా చేతబట్టుకొని విసురుతూ వున్నాడు. విద్యార్థితోపాటు ఆ కాలంలో పండితులవారి రాకతో విస్మితుడై "ఎవరూ, గోవిందా?" అన్నాడాయన.

గోవింద్ పండితుడు కాయస్థుడు. అంచేత వంగి నమస్కారం చేసాడు. భూలోను చూపించి విషయమంతా వివరంగా వర్ణించాడు. ముఖోపాధ్యాయగారు విరక్తి చెంది "అయితే దేవదాసు అదుపు తప్పిపోతున్నాడన్న మాట!" అన్నారు.

"ఏం చేసేది? ఇక మీరే సెలవియ్యండి!"

జమీందారు బాబు హుక్కా పైపు ప్రక్కనబెట్టి "వాడు ఎటువెళ్ళాడు?" అన్నాడు.

"ఏం తెలుసు? పట్టుకొనడానికి వెళ్ళిన వాళ్ళను, రాళ్ళు విసిరి తరిమేశాడు."

వాళ్ళిద్దరూ కొంచెం సేపు మౌనంగా వున్నారు. "ఇంటికి వచ్చినపుడు వాడి సంగతి చూస్తాలెండి." అన్నాడు నారాయణబాబు.

గోవింద్ పండితుడు విద్యార్థి చేయి పట్టుకొని పాఠశాలకు మామూలు వేళకన్నా కొంచెం ముందుగానే సెలవిచ్చేశారు. వెళుతూ, వెళుతూ పిల్లలు అనేక విమర్శలూ, ప్రతి విమర్శలూ చేసుకుంటూ వున్నారు.

"అబ్బా! దేవా ఎంత బలం గలవాడు!" అన్నాడు ఒకడు.

"భూలోను బెదరగొట్టి ఆశ్చర్యపరిచాడు" అన్నాడు మరొకడు.

"అబ్బా! ఎంత గురిగా రాయి విసురుతాడు!"

ఒకడు భూలో పక్షం వహిస్తూ "భూలో దీనికి బదులు తీర్చుకుంటాడు, చూసుకో" అన్నాడు.

"హిశ్! బదులు తీర్చుకొనడానికి అతడు ఇక పాఠశాలకు వస్తే గదా?"

ఈ చిన్న సమూహానికి ఓ ప్రక్కగా పార్వతి కూడా తన పుస్తకమూ, స్లేటూ తీసికొని ఇంటికొస్తూ వుంది. దగ్గరలోని ఒక బాలుడి చేయి పట్టుకొని "మణీ! దేవదాసును పండితులవారు నిజంగానే పాఠశాలకు రానివ్వరా?" అని అడిగింది.

రానివ్వరు, ఏ విధంగానూ రానివ్వరు" అన్నాడు మణి.

పార్వతి తప్పుకొని ముందుకు పోయింది. ఆమెకు యీ సంభాషణ బొత్తిగా నచ్చలేదు. పార్వతి తండ్రి పేరు నీలకంఠ చక్రవర్తి. చక్రవర్తి మహాశయుడు జమీందారుగారి పొరుగువాడు. ముఖోపాధ్యాయగారి భవంతి ప్రక్కనే ఆయన ఇల్లు వుంది. అది చాలా చిన్నది. పురాతన పద్ధతిలో కట్టిన కట్టడం. ఆయనకు పన్నెండు బీఘాల వ్యవసాయం వుంది. నాలుగిళ్ళ పౌరోహిత్యం వుంది. జమీందారుగారి ఇంటి నుంచి కూడా కొద్దీ గొప్పా లభిస్తూనే వుంటుంది. ఆయన కుటుంబం సుఖంగా వుంది. హాయిగా కాలం గడిచిపోతూ వుంది.

మొదట పార్వతికి ధర్మదాసు ఎదురయ్యాడు. అతడు దేవదాసు ఇంట్లో వుండే నౌకరు. సంవత్సరం వయసు దగ్గర నుంచి యెనిమిది సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ ఆమె అతడి వెంట వస్తూ, పోతూ వుండేది. పాఠశాలకు పంపించి పోతాడు. సెలవియ్యగానే ఇంటికి తీసుకుపోతాడు. అతడు యీ పని నియమ పూర్వకంగా ప్రతిరోజూ చేస్తాడు. ఈరోజు కూడా ఆ పని మీదే పాఠశాలకు వెళ్ళాడు. పార్వతిని చూసి అతడు "పత్తో, దేవదాదా ఎక్కడున్నాడు?" అన్నాడు.

"పారిపోయాడు."

"పారిపోయాడా? ఎందుకూ?" అన్నాడు ధర్మదాసు చాలా ఆశ్చర్యంగా.

తర్వాత పార్వతి భోలానాథ్ కు పట్టిన దుస్థితికి సంబంధించిన వృత్తాంతం కొత్త పద్ధతిలో జ్ఞప్తికి తెచ్చుకొని నవ్వుతూ వుంది__"చూడు ధర్మా దేవదాదా యెక్కడున్నాడు?" అన్నాడు.

"పారిపోయాడు."

"పారిపోయాడా? ఎందుకూ?" అన్నాడు ధర్మదాసు చాలా ఆశ్చర్యంగా.

తర్వాత పార్వతి భోలానాథ్ కు పట్టిన దుస్థితికి సంబంధించిన వృత్తాంతం కొత్త పద్ధతిలో జ్ఞప్తికి తెచ్చుకొని నవ్వుతూ వుంది__"చూడు ధర్మా దేవదాదా__హి__హి__హి__అమాంతంగా ఆ సున్నం గుట్టలో__హి__హి__

హూ__హూ__అమాంతంగా ధర్మా వెల్లికిలగా పడవేశాడు.

ధర్మాదాసుకు ఆ మాటలన్నీ అర్థం కాకపోయినా, ఆ నవ్వు చూసి కొద్దిగా నవ్వాడు. తరువాత నవ్వు ఆపుకొని "ఏం జరిగింది పత్తో? చెప్పవేమిటీ?"

అన్నాడు.

"దేవదాసు, భూలోను నెట్టి పొడి సున్నంలో పడ....హి_హి_హి_."

"ధర్మదాసు ఈసారి అంతా అర్ధం చేసుకున్నాడు. చాలా విచారిస్తూ "పత్తో, అతడు ఇప్పుడు యెక్కడున్నాడో నీకు తెలుసా?" అన్నాడు.

"నాకేం తెలుసు?"

"నీకు తెలుసు, చెప్పు. అమ్మో! అమ్మో! అతడికి ఆకలయి వుంటుంది."

"ఆకలయ్యే వుంటుంది. అయినా నేను చెప్పను."

"ఎందుకు చెప్పనూ?"

"చెపితే నన్ను చితకబాదుతాడు. నేను అన్నం ఇచ్చి వస్తాను."

ధర్మదాసు కొంచెం అసంతృప్తిగా__"అయితే ఇచ్చిరా. చీకటి పడకముందే మరపించి ఇంటికి తీసుకొని రా."

"తీసుకొస్తాను."

పార్వతి ఇంటికి వచ్చి చూసింది. ఆమె తల్లీ, దేవదాసు తల్లీ కథ అంతా వినే వున్నారు. ఆమెను కూడా విషయాలన్నీ అడిగారు. నవ్వుతూనూ, గంభీర్యంగానూ ఆమెకు చేతనయిన విధంగా చెప్పింది. తరువాత మొర్మొరాలు చిన్న గుడ్డలో మూటగా కట్టుకొని జమీందారుగారి తోటలోకి జొరబడిపోయింది. తోట వారి ఇళ్ళకు దగ్గరగానే వుంది. అందులోనే ఓ వైపు వెదుళ్ళ తోపు వుంది. దాగి వుండి పొగ త్రాగడానికి దేవదాసు యీ వెదుళ్ళ తోపు మధ్యలో ఒక చోటు శుభ్రం చేసికొని వుంచినట్లు ఆమెకు తెలుసు. పారిపోయి వచ్చినప్పుడల్లా దాగి వుండటానికి అదే అతడి రహస్య స్థావరం. పార్వతి లోపలికి వెళ్ళి చూసింది. వెదురు తోపు మధ్యలో దేవదాసు ఓ చిన్న హుక్కా పట్టుకొని కూర్చున్నాడు. పెద్దవాళ్ళలాగా ధూమపానం చేస్తూ వున్నాడు. ముఖం చాలా గాంభీర్యముగా వుంది. అతడి ముఖంలో ఎన్నో దుర్భావనల చిహ్నలు వ్యక్తమవుతూ వున్నాయి. అతడు పార్వతి రావడం చూసి చాలా సంతోషించాడు. కాని ఆ సంతోషాన్ని బయట పడనివ్వలేదు. పొగ త్రాగుతూనే 'రా' అన్నాడు.

పార్వతి దగ్గరకు వచ్చి కూర్చున్నది. ఆమె తెచ్చిన ఆ చిన్ని మూటమీద అతని దృష్టి పడింది. ఇంకేమీ అడగకుండా అతడు ముందు దానిని విప్పుకొని నములుతూ "పత్తో, పండితులవారు ఏం చేశారు?" అన్నాడు.

"పెదనాన్న గారితో చెప్పారు."

దేవదాసు కోపంతో "నాన్నగారితో చెప్పారా?" అన్నాడు.

"అవును."

"ఆ తరువాత?"

"నిన్ను ఇక నుంచి పాఠశాలకు రానివ్వరు."

"నేను కూడా చదవదలచుకోలేదు."

అదే సమయంలో ఆ తింటున్న మొర్మొరాలు అయిపోవచ్చాయి. దేవదాసు పార్వతి ముఖం వైపు చూస్తూ "ఏదయినా చిరుతిండి పెట్టు."

"చిరుతిండి ఏమీ తీసుకొని రాలేదు."

"అయితే మంచినీళ్ళు తీసుకొని రా!"

"మంచినీళ్ళు యెక్కడ తెచ్చేదీ?"

దేవదాసు విసుగుకొని "ఏమీ చేయలేకపోతే వచ్చింది యెందుకూ? వెళ్ళు, మంచినీళ్ళు తీసికొని రా."

కఠోరంగా వున్న అతడి స్వరం పార్వతికి నచ్చలేదు. "నేను వెళ్ళలేను. నీవు వెళ్ళి త్రాగిరా" అన్నది.

"నేను ఇప్పుడే వెళ్ళగలనా?"

"అయితే ఇక్కడే వుంటావా?"

"ఇక్కడే వుంటాను. తరువాత యెక్కడికైనా వెళ్ళిపోతాను."

ఇదంతా విని పార్వతికి చాలా దుఃఖం కలిగింది. దేవదాసు యొక్క యీ వైరాగ్యం చూసి, అతడి మాటలు విని ఆమె కళ్ళు చెమర్చాయి. "అయితే నేను కూడా వస్తాను" అన్నది.

"ఎక్కడికీ? నాతోపాటు వస్తావా? ఆహా! అది సాధ్యమయ్యే పనేనా?"

పార్వతి తల వూపి "వస్తాను" అన్నది.

"కాదు, వీలుకాదు కాని ముందు మంచినీళ్ళు తీసికొని రా!"

"నేను తీసికొని రాను, నీవు పారిపోతావు."

"పోను, పారిపోను!"

కాని పార్వతి ఆ మాటను విశ్వసించలేక పోయింది. అంచేత అక్కడే కూర్చొని వుంది. దేవదాసు మళ్ళీ ఆజ్ఞాపించాడు__"వెళ్ళు, నేను చెపుతున్నాను."

"నేను వెళ్ళలేను."

క్రోధంతో దేవదాసు, పార్వతి జుట్టులాగి బెదిరించాడు__"వెళ్ళు, నేను చెపుతున్నాను."

పార్వతి మౌనంగా వుంది. క్రోధంతో దేవదాసు ఆమె వీపు మీద ఓ గుద్దువేసి "వెళ్ళవా?" అన్నాడు.

పార్వతి ఏడుస్తూ "నేను వెళ్ళలేను" అన్నది.

దేవదాసు ఓ వైపుగా వెళ్ళిపోయాడు. పార్వతి కూడా ఏడుస్తూ తిన్నగా దేవదాసు తండ్రి ఎదటికి వచ్చి నిలబడింది. ముఖోపాధ్యాయ గారు, పార్వతిని చాలా ప్రేమతో చూస్తూ వుంటాడు. "పత్తో, ఏడుస్తున్నా వెందుకు?" అన్నాడు.

"దేవదాసు కొట్టాడు."

"అతడెక్కడున్నాడు?"

"ఈ వెదుళ్ళ తోపులో కూర్చొని పొగ త్రాగుతూ వున్నాడు."

పండితులవారు వచ్చి పోవడంతో అసలే కోపంతో వున్నాడు. ఇప్పుడు ఈ వార్త విని మరింత మండిపడ్డాడు. "దేవా పొగకూడా త్రాగుతున్నాడా?" అన్నాడు.

"అవును త్రాగుతాడు. చాలా రోజులనుంచి త్రాగుతూ వున్నాడు వెదుళ్ళతోపు మధ్యలో హుక్కా దాచిపెట్టి వుంచాడు."

"ఇన్ని రోజులనుంచి నాతో ఎందుకు చెప్పలేదు?"

"దేవదాదా కొడతానన్నాడు."

వాస్తవంగా ఈ మాట నిజంకాదు. చెపితే దేవదాసు దెబ్బలు తింటాడు. అంచేత ఆ మాట ఇదివరకు చెప్పలేదు. ఈ రోజు అదే మాట కేవలం క్రోధంతో చెప్పింది. ఇప్పుడు ఆమె వయస్సు కేవలం యెనిమిది సంవత్సరాలు. ఇప్పుడు క్రోధం ఎక్కువగానే వుంది. అయితే ఆమె పరిశీలనా శక్తి మాత్రం అల్పమైనదేమీ కాదు. ఇంటికి వెళ్ళి ఆమె ప్రక్కమీద పడుకొని చాలా సేపటివరకు ఏడ్చి ఏడ్చి ఆ తరువాత నిద్రపోయింది. ఆ రాత్రి ఆమె తిండికూడా తినలేదు.

## 2

మరుసటిరోజు దేవదాసు బాగా దెబ్బలు తిన్నాడు. అతణ్ని ఆ రోజంతా

ఇంట్లో బంధించి వుంచారు. తల్లి అదేపనిగా రోదిస్తూ వుంటే అప్పుడు విడిచిపెట్టారు. రెండో రోజు ఉదయం పరుగెత్తుకుంటూ పోయి పార్వతి వాళ్ళ ఇంటి కిటికి క్రింద నిలబడి "పత్తో__పత్తో" అంటూ ఆమెను పిలిచాడు.

పార్వతి కిటికీ తెరిచి "దేవదాదా" అన్నది.

ఇద్దరూ ఒకచోటకు చేరిన తరువాత "నేను పొగ త్రాగుతాననే సంగతి ఎందుకు చెప్పావు?" అన్నాడు దేవదాసు.

"నీవు ఎందుకు కొట్టావు?"

"నీవు మంచినీళ్ళు తీసికొని రావడానికి ఎందుకు వెళ్ళలేదు?"

పార్వతి మౌనం వహించింది. "నీవు వట్టి మూర్ఖురాలివి. ఇక ముందెప్పుడూ చెప్పవద్దు" అన్నాడు దేవదాసు.

పార్వతి తల ఊపుతూ "చెప్పను" అన్నది.

"అయితే పద, వెదుళ్ళ తోపులోనుంచి వెదురు కర్రలు కోసి తీసికొని వద్దాం. ఈ రోజు ఆనకట్ట దగ్గర చేపలు పట్టాలి."

వెదుళ్ళతోపు దగ్గరే ఒక సీతాఫలం చెట్టు వుంది. దేవదాసు దానిమీదికి ఎక్కాడు. చాలా కష్టంమీద ఒక వాసాన్ని వంచి, పార్వతికి పట్టుకోమని ఇచ్చి_ "చూడు దీన్ని వదిలిపెట్ట వద్దు, వదిలిపెడితే నేను పడిపోతాను" అని చెప్పాడు.

పార్వతి దానిని భద్రంగానే పట్టుకొని వుంది. దేవదాసు దాన్ని పట్టుకొని సీతాఫలం చెట్టు కొమ్మమీద కాలు వుంచి వెదురు వాసాన్ని నరుకుతూ వున్నాడు. పార్వతి క్రిందినుంచి "దేవదాదా! పాఠశాలకు రావా?" అన్నది.

"రాను."

"పెదనాన్న నిన్ను పంపిస్తే గదా?'

"నేను అక్కడ చదవనని నాన్నగారే స్వయంగా చెప్పారు. పండి తులవారే స్వయంగా ఇంటివద్దకు వస్తారు."

పార్వతి కొంచెం విచారపడింది. "రేపటి నుంచి వేసవి కారణంగా స్కూలు ఉదయం పూట జరుగుతున్నది. ఇక నేను వెళతాను" అన్నది.

దేవదాసు పైనుంచి కళ్ళెర్రజేస్తూ "వీలులేదు, అలా వెళ్ళడానికి వీలులేదు" అన్నాడు.

ఈ సమయంలో పార్వతి కొంచెం పరధ్యానంగా వుంది. సీతాఫలం

చెట్టుకొమ్మ పైకి లేచిపోయింది. వెంటనే దేవదాసు ఆ కొమ్మ మీదినుంచి క్రింద పడిపోయాడు. ఆ కొమ్మ అంత ఎత్తుగాలేదు. అంచేత పెద్ద దెబ్బ తగలలేదు. కాని శరీరం అనేక చోట్ల చీరుకుపోయింది. కోపం వచ్చి దేవదాసు ఎండిపోయిన బెత్తం ఒకటి తీసికొని పార్వతి వీపుమీద, చెంపలమీద, భుజాల మీద ఎక్కడబడితే అక్కడ బాదిపారేశాడు. పో, అవతలికి పో దూరంగా!" అన్నాడు.

ముందు పార్వతి స్వయంగానే సిగ్గుపడింది. కాని వరసగా బెత్తంతో దెబ్బమీద దెబ్బ పడుతూ వున్న కారణంగా క్రోధంతోనూ, అభిమానంతోనూ రెండు కళ్ళూ అగ్ని కణాల్లాగా ఎర్రబడ్డాయి. ఆమె రోదిస్తూ "నేను ఇప్పుడే పెదనాన్న దగ్గరకు పోతాను" అన్నది.

దేవదాసు కోపంతో మరోసారి బాదాడు. వెళ్ళు, ఇప్పుడే వెళ్ళి చెప్పు, నాకేమీ లెక్కలేదు" అన్నాడు.

పార్వతి వెళ్ళిపోయింది. ఆమె దూరంగా వెళ్ళిపోగానే దేవదాసు బిగ్గరగా "పత్తో" అని పిలిచాడు. పార్వతి వినిపించుకోలేదు. మరింత వేగంగా నడుస్తూ వుంది. "ఓ పత్తో, కొంచెం మాట విని పో" అని దేవదాసు మళ్ళీ పిలిచాడు.

పార్వతి జవాబివ్వలేదు. దేవదాసు విసుగుతో "వెళ్ళి చావనివ్వు" అని బిగ్గరగా తనలో తాను అనుకున్నాడు.

పార్వతి వెళ్ళిపోయింది. దేవదాసు ఏదో విధంగా ఒకటి రెండు వెదురు కర్రలు కోసుకున్నాడు. అతడి మనస్సు బాగాలేదు. ఏడుస్తూ పార్వతి ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె చెంపలమీద బెత్తం దెబ్బలు వాతలు గట్టాయి. బాగా పొంగి పైకి కనిపిస్తున్నాయి. ఆ వాతలు ముందుగా పార్వతి నాయనమ్మ కంట బడ్డాయి. ఆమె అదేపనిగా "బాబోయ్! బాబోయ్! ఇట్లా కొట్టారెవరే పత్తో?" అని కేకలు పెడుతూ అరిచింది.

కళ్ళు మూసుకుంటూ "పండితులవారు" అన్నది పార్వతి.

నాయనమ్మ ఆమెను దగ్గరకు తీసికొని అపరిమితమైన కోపంతో "పద, ఒకసారి నారాయణ వద్దకు వెళదాం. అతడు ఎలాంటి పండితుడో చూద్దాం! అమ్మో! అమ్మో! పిల్లదాన్ని అమాంతంగా చంపేశాడు!" అన్నది.

పార్వతి నాయనమ్మను కౌగిలించుకుని "పద" అన్నది.

ముఖోపాధ్యాయగారి దగ్గరకు వెళ్ళి పార్వతి నాయనమ్మ ఎప్పుడో చనిపోయిన పండితులవారి తాత, ముత్తాతలనూ, వారి పూర్వీకులనూ అనేక రకాలుగా తిట్టి, దూషించి, వారి పదునాలుగు తరాల వారినీ నరకంలో పడేసి, చివరకు గోవింద పండితుణ్ణి కూడా నానారకాలుగా నిందిస్తూ, తిట్టిపోస్తూ_

"చూడు నారాయణా అతగాడి సాహసం! శూద్రుడయి వుండి బ్రాహ్మణ కన్య ఒంటిమీద చేయి చేసుకుంటాడా? ఎలా కొట్టాడో ఒకసారి చూడు!" అని ఆ వృద్ధురాలు పార్వతి చెంపలమీద పడిన వాతలను అమితమైన వేదనతో చూపిస్తూ అంది.

"పత్తో, ఎవరు కొట్టారు?" అని అప్పుడు నారాయణబాబు పార్వతిని అడిగాడు.

పార్వతి మౌనంగా వుంది. అప్పుడు పార్వతి నాయనమ్మ మరోసారి అరిచి "ఇంకెవరు, కొడతారు మూర్ఖుడైన ఆ పండితుడు తప్ప?" అన్నది.

"ఎందుకు కొట్టాడు?"

పార్వతి ఈ సారి కూడా ఏమీ చెప్పలేదు. "ఏదో తప్పు చేస్తేనే కొట్టి వుంటాడు. అయినా ఈ విధంగా కొట్టడం అనుచితం అని భావించి ముఖోపాధ్యాయ మహాశయుడు పైకి కూడా అదే అన్నాడు. పార్వతి తన వీపు చూపుతూ "ఇక్కడ కూడా కొట్టాడు" అన్నది.

వీపు మీద బెత్తం వాతలు ఇంకా, స్పష్టంగా పొంగి వున్నాయి. అప్పుడు వాళ్ళిద్దరూ మరింత మండి పడ్డారు. పండితులవారిని పిలిపించి కారణం తెలుసుకుందాం" అని ముఖోపాధ్యాయ తన అభిప్రాయం వెల్లడించాడు. అటువంటి పండితుల వారివద్దకు బాల బాలికలను పంపించడం ఉచితమైన పని కాదని నిశ్చయించారు.

ఈ నిశ్చయం విని పార్వతి సంతోషంగా నాయనమ్మ చంకనెక్కి, ఇంటికి తిరిగి వచ్చింది. వచ్చిన తరువాత పార్వతి తల్లి ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వచ్చింది. ఆమె కూర్చొని "ఎందుకు కొట్టాడు?" అని అడిగింది.

"ఊరకనే కొట్టాడు" అన్నది పార్వతి.

తల్లి పార్వతి చెవులు గట్టిగా మెలేస్తూ "ఊరకనే ఎవరైనా కొట్టగలరా?" అన్నది.

అదే సమయంలో వరండాలోగుండా అత్తగారు వెళుతూ వున్నారు. ఆమె ఇంటి గడప దగ్గరకు వచ్చి "కోడలా, తల్లివయ్యుండి కూడా నీవు ఊరకనే కొట్టగలవు. అటువంటప్పుడు ఆ దౌర్భాగ్యుడు కొట్టలేడా?"

ఊరకనే ఎన్నడూ కొట్టలేదు. నీ మనుమరాలు చాలా మంచి అమ్మాయి గదూ! ఏమీ చేయలేదు, ఆయనే కొట్టాడు!" అన్నది కోడలు.

"సరే అలాగే అనుకో. కాని దీన్ని నేను పాఠశాలకు పోనివ్వను" అన్నది

అత్తగారు విరక్తి చెంది.

"చదువు నేర్చుకోదా?"

ఏం చేస్తుందే నేర్చుకొని? ఎంత చదువుకోవాలే కోడలా? ఇకటీ అరా ఉత్తరం ప్రత్యుత్తరాలు రాసుకోవడం, రామాయణం, మహాభారతం చదువుకోవడం చాలు! నీ పత్తో జడ్జీ అవుతుందా లేక వకీలు అవుతుందా?"

చివరకు కోడలు కూడా మౌనంగా వుండిపోయింది. ఆ దేవదాసు చాలా భయపడుతూ ఇంట్లోకి ప్రవేశించాడు. పార్వతి మొదటి నుంచి చివరి దాకా జరిగిన సంఘటనంతా తప్పకుండా చెప్పి వుంటుందనుకున్నాడు. అందులో అతడికేమీ సందేహంలేదు. కాని ఇంటికి వచ్చిచూస్తే లేశ మాత్రం కూడా దాని ప్రతిబింబం కనిపించలేదు. పైగా ఈ రోజు గోవింద్ పండితులవారు పార్వతిని బాగా కొట్టాడనీ అంచేత ఇప్పుడు ఆమె కూడా పాఠశాలకు వెళ్ళదనీ తల్లి చెప్పగా విన్నాడు. ఈ ఆనందాతి రేకంతో అతడు సరీగా భోజనం కూడా చేయలేకపోయాడు. ఏదో విధంగా గబగబా తిన్నాననిపించాడు. పరుగుతీస్తూ పార్వతి దగ్గరకు వచ్చాడు.రొప్పుతూ, రోజుతూ "నీవు ఇక పాఠశాలకు వెళ్ళవా?" అన్నాడు.

"వెళ్ళను!"

"ఎంచేత?"

"పండితులవారు కొడుతున్నాడు" అని నేను చెప్పాను.

దేవదాసు ఒక్కసారి బాగా నవ్వి, ఆమె వీపు చరిచి "ఆమె వంటి తెలివిగలది ఈ భూమిమీద మరొకరులేరు" అన్నాడు. తరువాత అతడు నెమ్మదిగా పార్వతి చెంపమీద పడిన నల్లని వాతల్ని యత్నపూర్వకంగా పరీక్షించి నిట్టూర్పు విడుస్తూ "ఆహా!" అన్నాడు.

పార్వతి కొంచెం నవ్వి అతడి ముఖం వైపు చూసి "ఏమిటీ" అన్నది.

"బాగా దెబ్బలు తగిలాయి గదూ పత్తో?"

"పార్వతి తలవూపి ఊఁ" అన్నది.

"నీవు యెందుకు అలా చేస్తావు? అందుకే నాకు కోపం వస్తుంది. అందుచేతనే కొడుతున్నాను కూడా."

పార్వతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏం చేయాలో అడగాలని మనసులో అనిపించింది. కాని అడగలేకపోయింది.

దేవదాసు ఆమె తలమీద చేయి ఉంచి "ఇక ఎప్పుడూ కూడా అలా చేయకు, సరేనా?" అన్నాడు.

దేవదాసు తలవూపి "చేయను" అన్నది.

దేవదాసు మరోసారి పార్వతి వీపుచరిచి, సరే ఇక నేను ఎన్నడూ నిన్ను కొట్టను" అన్నాడు.

3

రోజులకు రోజులే గడిచిపోతున్నాయి. ఈ ఇరువురు బాల బాలికల ఆనందానికి అవధిలేకుండా పోయింది. రోజంతా అటూ ఇటూ తిరుగుతూ వుండేవాళ్ళు. సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చి మందలింపులూ, దబాయింపులే కాకుండా దెబ్బలు కూడా బాగా పడేవి. మళ్ళీ తెల్లవారడంతోనే ఇంట్లో నుంచి పరుగుతీస్తూ పోయే వాళ్ళు. రాత్రికి వచ్చి దెబ్బలూ, చీవాట్లూ తినేవాళ్ళు. రాత్రిపూట హాయిగా నిద్రపోయేవాళ్ళు. మళ్ళీ తెల్లవారగానే పరుగుతీస్తూ పోయి ఆడుతూ, పాడుతూ, ఎగురుతూ, దుముకుతూ ఉండేవాళ్ళు. వీళ్ళకు వేరే మిత్రులెవరూలేరు. అవసరం కూడా లేదు. ఊళ్ళో  ఉపద్రవాలు సృష్టించడానికీ, అల్లరి చేయడానికీ వీళ్ళిద్దరే చాలు. ఆ రోజు ప్రొద్దు పొడవగానే ఇరువురూ చెరువులో దిగారు. మధ్యాహ్నందాకా కళ్ళు ఎర్రబడేటట్లుగా చెరువంతా చిలికి చిలికి పదిహేను చేపలు పట్టుకున్నారు. తమ తమ సామర్థ్యాన్ని బట్టి పరస్పరం వాటాలు తీసికొని ఇళ్ళకు తిరిగి వచ్చారు. పార్వతి తల్లి కూతురును చావబాది ఇంట్లో బంధించింది. దేవదాసు విషయం నాకు బాగా తెలియదు. అతడు ఇటువంటి విషయాలను ఏ విధంగానూ వెల్లడించడు. పార్వతి ఏడుస్తూ వుంది. అప్పటికి సమయం రెండూ, రెండున్నర గంటలవుతుంది. దేవదాసు వచ్చి ఒకసారి కిటికీ క్రిందగా మృదువుగా మధురంగా "పత్తో, పత్తో" అని పిలిచాడు. పార్వతి వినే వుంటుంది. కాని కోపంతో వుండడం చేత జవాబియ్యలేదు. అప్పుడతడు దగ్గరలో వున్న రావిచెట్టు మీద కూర్చొని ఆ పగలంతా అక్కడే గడిపేశాడు. సాయంకాలం పూట ధర్మదాసు వ వచ్చి, నచ్చ జెప్పి యెంతో కష్టంమీద అతణ్ని దించి ఇంటికి తీసికొని పోయాడు.

ఇది కేవలం ఆ రోజు మాత్రమే జరిగింది. మరుసటి రోజు తెల్లవారిన దగ్గర నుంచి పార్వతి, దేవదాసు కోసం అల్లాడిపోతూ వుంది. కాని దేవదాసు రాలేదు. అతడు తండ్రితోపాటు దగ్గరలో వున్న గ్రామానికి ఆహ్వానం రాగా వెళ్ళాడు. దేవదాసు రాకపోయేసరికి పార్వతి ఉదాసీనురాలై ఇంట్లో నుంచి బయటకు బయలుదేరింది. నిన్న చెరువులో దిగేటప్పుడు ఎక్కడైనా జారిపోతాయేమోనని దేవదాసు మూడు రూపాయలు పట్టుకోమని పార్వతికి ఇచ్చాడు. ఆ మూడు రూపాయలు పార్వతి కొంగున కట్టుకొన్నది. ఆమె ఆ మూడు రూపాయలు ఉన్న

మూటను అటూ ఇటూ త్రిప్పుతూ, తాను కూడా అటూ ఇటూ తిరుగుతూ అనేక క్షణాలు గడిపింది. ఎవ్వరూ తోడు దొరకలేదు. అప్పుడు పార్వతి ప్రక్కనే వున్న మరో గ్రామానికి వెళ్ళింది. ఆ గ్రామంలో మనోరమ ఇల్లు వుంది. ఆమె వయసులో కొంచెం పెద్దది. అయితే ఆమె పార్వతికి స్నేహితురాలు చాలా రోజులనుంచి ఒకరి నొకరు చూసుకోలేదు. ఈ రోజు, పార్వతి అవకాశం చూసుకొని ఆమె ఇంటికి వెళ్ళి "మనో ఇంట్లో వుందా?"అని అడిగింది.

"పత్తో!"

"అవును నేనే. మనో ఎక్కడున్నది అత్తయ్యా?"

"పాఠశాలకు వెళ్ళింది__నీవు వెళ్ళడం లేదా?"

"నేను పాఠశాలకు వెళ్ళడంలేదు. దేవదాదా కూడా వెళ్ళడం లేదు."

మనోరమ అత్త నవ్వుతూ__"అయితే మంచిదే! నీవూ పాఠ శాలకు వెళ్ళడంలేదు. దేవదాదా కూడా వెళ్ళడంలేదు" అన్నది.

"లేదు, మేము ఎవ్వరమూ వెళ్ళడంలేదు."

"మంచిదే, కాని మనో పాఠశాలకు వెళ్ళింది."

అత్త కూర్చోమన్నది. కాని ఆమె కూర్చోలేదు. తిరిగి వచ్చింది. దారిలో రసిక్ పాల్ దుకాణం వద్ద ముగ్గురు వైష్ణవ స్త్రీలు నుదుట తిలకం దిద్దుకుని, చేతిలో ఖంజరి (వాద్యం) తీసికొని బిచ్చం అడుగుతున్నారు. పార్వతి వాళ్ళను పిలిచి "మీకు పాటలు వచ్చునా?" అని అడిగింది.

ఒక వైష్ణవ స్త్రీ తిరిగి చూసింది "ఏమిటమ్మా, పాటలు వచ్చు" అన్నది.

"అయితే పాట పాడు!" ముగ్గురూ నిలబడిపోయారు!" ఇట్లా పాడమంటే ఎట్లా పాడతాము" అన్నది ఒక స్త్రీ.

"వద్దు, ఇక్కడే పాడండి!"

"పైసా ఇచ్చుకోవాలి!"

పార్వతి తన కొంగున ఉన్న ముడి చూపిస్తూ "పైసా కాదు, రూపాయి వున్నది."

కొంగు చివర ముడివేసిన రూపాయల మూట చూసి ఆ స్త్రీలు దుకాణం దగ్గర నుంచి కొంచెం దూరం వచ్చి కూర్చున్నారు. ఖంజరి వాయిస్తూ ముగ్గురూ గొంతులు కలుపుకొని పాట పాడారు. ఏమి పాడారు, దాని అర్థమేమిటీ, ఇదంతా

పార్వతి ఏమీ అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోవాలనుకున్నా చేసుకోలేదు. కాని అదే క్షణంలో ఆమె మనసులో దేవదాదా మెదిలాడు.

పాట పూర్తిచేసి ఒక వైష్ణవ స్త్రీ "ఇక భిక్ష వేస్తావా! అమ్మా!" అన్నది.

పార్వతి కొంగున ఉన్న రూపాయల మూట విప్పి వాళ్ళకు ఆ మూడు రూపాయలూ ఇచ్చేసింది. ముగ్గురూ అవాక్కయిపోయి ఆమె ముఖం వైపు కొన్ని క్షణాలు చూస్తూ వున్నారు.

"ఈ రూపాయలు ఎవరివమ్మా?" అన్నది ఒకామె.

"దేవదాదావి."

"ఆయన నిన్ను కొట్టడా?"

పార్వతి కొంచెం ఆలోచించి "కొట్టడు" అన్నది.

"వర్థిల్లు తల్లీ" అన్నది ఒకామె.

పార్వతి నవ్వుతూ "మీ ముగ్గురికీ సమానంగా బాగాలు కుదిరాయి గదా!" అన్నది.

ముగ్గురూ తల లూపారు. "అవును కుదిరాయి. రాధారాణి నీకు మేలు చేయుగాక!" అని ముగ్గురూ "దాతృత్వం కలిగినటువంటి ఈ చిన్న బాలిక ఏమీ శిక్ష అనుభవించవలసి రాకూడదని అంతరంగంలో అభిలషిస్తూ ఆశీర్వదించారు. పార్వతి ఆ రోజు త్వరగా ఇంటికి తిరిగి వచ్చింది. మరుసటి రోజు ఉదయమే దేవదాసును కలుసుకొన్నది. అతడి చేతిలో దారం చుట్టే గిలక ఒకటి వుంది. కాని గాలిపటం లేదు. అది కొనాలి. "పత్తో, రూపాయి ఇవ్వు." అన్నాడు.

పార్వతి తల వంచుకొని "రూపాయి లేదు" అన్నది.

"ఏమయింది?"

"వైష్ణవ స్త్రీలకు ఇచ్చేశాను. వాళ్ళు పాట పాడారు."

"అన్నీ ఇచ్చేశావా?"

"అవును, అన్ని మూడు రూపాయలే గదా వున్నది?"

"ఓసి పిచ్చిదానా, అన్నీ ఇచ్చుకుంటారా?"

"ఓహో! వాళ్ళు ముగ్గురు స్త్రీలున్నారు. మూడు రూపాయలు ఇవ్వకపోతే ముగ్గురూ సమానంగా ఎలా పంచుకుంటారు?"

దేవదాసు గాంభీర్యంగా "నేనయితే రెండు రూపాయలు కన్నా ఎక్కువ ఇచ్చేవాణ్ని కాదు-అన్నాడు. ఈ మాట అని అతడు ఆ గిలక పిడితో మట్టిమీద అంకెలు గీస్తూ ఇలా చేస్తే అందులో ప్రతి ఒక్కరికీ పది అణాలు రెండు డబ్బుల వాటా వచ్చేది.

పార్వతి ఆలోచించి "వాళ్ళకు నీలాగా లెక్కలు తెలుసా....?" అన్నది.

TOne Home TVNewsMovie NewsVideosRadioTelugu MoviesKidsoneComedyShoppingBhaktiGreetingsNRI CornerRomanceCharityMore...

HOMENOVELSPUBLICATIONS

Share|

దేవదాసు

Prev

Next

దేవదాసు గుణకారాలు భాగాహారాల వరకు లెక్కలు నేర్చుకొన్నాడు. పార్వతి అన్న ఈ మాట విని సంతోషించి "ఇది బాగానే వుంది" అన్నాడు.

పార్వతి, దేవదాసు చేయి పట్టుకొని "నీవు నన్ను కొడతావు అనుకున్నాను దేవదాదా!" అన్నది.

దేవదాసు విస్మితుడై "ఎందుకు కొడతాను?" అన్నాడు.

"నీవు కొడతావని వైష్ణవ స్త్రీలు అన్నారు."

ఈ మాట విని దేవదాసు చాలా సంతోషించి పార్వతి భుజాల మీద చేతులు వేసి "ఓసి పిచ్చిదానా! అపరాధం చేస్తే నేను కొడతానా?" అన్నాడు.

పార్వతి చేసిన యీ పని అతని పీనల్ కోడ్ లోపల లేదని దేవదాసు మనసులో అనుకొని వుండవచ్చు. ఎంచేత నంటే మూడు రూ.ముగ్గురు వ్యక్తుల

మధ్య సరిగానే విభజించింది. ముఖ్యంగా పాఠశాలలో గుణకారాలూ, భాగహారాలూ నేర్చుకోనటువంటి వైష్ణవ స్త్రీలకు మూడు రూపాయలకు బదులు రెండు రూపాయలు ఇవ్వడం వారిపట్ల అన్యాయం చేయడమే అవుతుంది. తరువాత అతడు పార్వతి చేయిపట్టుకుని చిన్న బజారు వైపుకు గాలిపటం కొనడానికి వెళ్ళిపోయాడు. గిలకను అక్కడే ఒక పొదలో దాచిపెట్టాడు.

## 4

ఇదే విధంగా ఓ సంవత్సరం గడిచిపోయింది. ఇక మాత్రం గడవదలచుకోలేదు. దేవదాసు తల్లి పోరుబడుతూ వుంది. "దేవా బొత్తిగా మూర్ఖుడై పోతున్నాడు. పూర్తిగా పశువుగా మారిపోతున్నాడు. వీణ్ని దారికి తీసుకొని రావడానికి ఏదైనా ఉపాయం ఆలోచించండి" అని భర్తను పిలిచి చెప్పింది.

ఆయన ఆలోచించి "దేవాను కలకత్తా వెళ్ళనివ్వు. నగేంద్రుని ఇంటివద్ద వుండి వాడు చక్కగా, చాలా బాగా చదువుకోగలడు...." అన్నాడు.

నగేంద్రబాబు దేవదాసు మేనమామ. ఈ విషయం అందరూ విన్నారు. ఇది విని పార్వతి చాలా చింతించింది. దేవదాసుని ఒంటరిగా చూసి అతడి చేయి పట్టుకుని వూపుతూ "దేవదాదా! ఇప్పుడు నీవు కలకత్తా వెళతావా?" అని అడిగింది.

"ఎవరు చెప్పారు?"

"పెదనాన్న అంటున్నారు."

"లేదు, నేను ఏ విధంగానూ వెళ్ళేది లేదు."

"మరి బలవంతంగా పంపిస్తే!"

"బలవంతంగానా?"

ఈ సమయంలో దేవదాసు ముఖంలో వ్యక్తపరచిన భావాన్ని చూసి అతడి చేత యీ భూమి మీద ఎవడూ బలవంతంగా పని చేయించలేడని పార్వతి బాగా అర్థం చేసుకున్నది. ఆమె అభిలషిస్తున్నది కూడా అదే. అంచేత చాలా ఆనందంగా మరోసారి అతడి చేయి పట్టుకొని అటూ ఇటూ ఊపింది. అతడి ముఖం వైపు చూసి "చూడుడి దేవదాదా! ఎన్నటికీ వెళ్ళవద్దు" అన్నది.

"ఎన్నటికీ వెళ్ళను."

కాని అతడు చేసిన యీ ప్రతిజ్ఞ నిలవలేదు. అతడి తల్లి దండ్రులు అతణ్ని

దబాయించి, గదమాయించి, కొట్టి, తిట్టి ధర్మదాసు వెంట కలకత్తాకు పంపించారు. వెళ్ళేరోజు దేవదాసుకు చాలా దుఃఖం కలిగింది. కొత్త ప్రదేశానికి వెళ్ళడానికి అతడికేమీ కుతూహలంగానీ, ఆనందంగానీ కలగలేదు. పార్వతి ఆ రోజు అతణ్ని ఏవిధంగానూ వదల దలచుకోలేదు. ఎంతగానో ఏడ్చింది. కాని వినేదెవరు? మొదట అభిమానంతో కొంత సేపటి వరకూ దేవదాసుతో మాట్లాడలేదు. అయితే చివరకు దేవదాసు పిలిచి _"పత్తో! నేను త్వరగానే తిరిగి వస్తాను. ఒకవేళ రానివ్వకపోతే పారిపోయి వస్తాను" అని చెప్పినపుడు పార్వతి స్థిమితపడి తన అంతరంగంలోని అనేక విషయాలు దేవదాసుకు చెప్పి వినిపించింది. ఆ తరువాత గుర్రం బండి మీద ఎక్కి, లగేజ్ బ్యాగ్ తీసుకుని, తల్లి ఆశీర్వాదాన్ని పొంది, కళ్ళ నుంచి రాలుతున్న అశ్రు బిందువులతో చెక్కిలి మీద బొట్టులాగా పెట్టుకొని అతను వెళ్ళిపోయాడు. ఆ సమయంలో పార్వతికి చాలా బాధకలిగింది. కళ్ళ నుంచి ఎన్నో అశ్రుధారలు బుగ్గల మీద ప్రవహించి క్రిందికి జారిపోయాయి. ఆమె హృదయం అభిమానంతో బ్రద్దలై పోతూ వుంది. మొదట ఎన్నో రోజులు ఈ విధంగా గడిచాయి. తరువాత ఒక రోజు ఉదయం ఆమె ఆలోచిస్తూ వుంది. రోజంతా చేసే పని యేదీ లేదు. ఇంతకు పూర్వం పాఠశాల వదిలిన తరువాత సాయంకాలం వరకు ఊరకనే ఆటపాటలతో గడిచిపోయేది. చేయడానికి ఎన్నో పనులు వుండేవి. కాని సమయమే దొరికితే కాదు. కాని ఇప్పుడు రోజంతా ఊరకనే పడి వుంటున్నది. ఎంత వెతికినా ఒక్క పని కూడా దొరకదు. ఒక రోజు ఉదయమే లేచి ఉత్తరం వ్రాయడానికి కూర్చున్నది. పది గంటలయ్యింది. తల్లి మండిపడింది. అది విని నాయనమ్మ "దాన్ని వ్రాసుకోనివ్వు. ప్రొద్దున్నే అటూ ఇటూ తిరగకుండా చదువుకుంటూ, వ్రాసుకుంటూ వుండటం మంచిది" అన్నది.

దేవదాసు ఉత్తరం వచ్చిన రోజు పార్వతికి చాలా సంతోషం కలిగించే రోజుగా వుంటుంది. మెట్లమీద కూర్చొని కాగితం చేతిలోకి తీసికొని ఆ రోజంతా చదువుతూనే వుంటుంది. ఈ రకంగానే రెండు మాసాలు గడిచిపోయాయి. ఉత్తరం వ్రాయడంగానీ, అందుకోవడంగానీ ఇప్పుడు అంత త్వరత్వరగా జరగడం లేదు. ఉత్సాహం కూడా కొంచెం తగ్గి పోయింది.

ఒక రోజు ఉదయం పార్వతి తల్లితో "అమ్మా! నేను మళ్ళీ పాఠశాలకు వెళతాను" అన్నది.

"ఎందుకు?"

పార్వతి మొదట కొంచెం ఆశ్చర్యపోయింది. తరువాత తల వూపుతూ "నేను తప్పకుండా వెళతాను" అన్నది.

"అయితే వెళ్ళు. పాఠశాలకు వెళ్ళకుండా నేను నిన్నెప్పుడూ ఆపలేదే?"

అదే రోజు మధ్యాహ్నం పార్వతి దాసీ చేయి పట్టుకుని, చాలా రోజుల క్రితం వదిలి పెట్టిన స్లేటూ, పెన్సిలూ వెతికి బయటికి తీసింది. ఆ పూర్వపు స్థానంలోనే శాంతంగా, గాంభీర్యంగా వెళ్ళి కూర్చున్నది.

"గురువుగారూ, పత్తోను ఎప్పుడూ కొట్టకండి. ఆమె తనంతట తానే కావాలని చదువుకొనడానికి వచ్చింది. వుండదలచుకున్నంత సేపు వుండి చదువుకుంటుంది. ఎప్పుడు వుండ బుద్ధి కాదో అప్పుడు ఇంటికి వెళ్ళిపోతుంది" అన్నది దాసీ.

గురువుగారు మనసులో  'తథాస్తు' అనుకున్నాడు. పైకి " అలాగే జరుగుతుంది" అన్నాడు.

'ఒకసారి పార్వతిని కలకత్తాకు ఎందుకు పంపించలేదూ?' అని అడగాలనే కోర్కె కలిగింది. కాని విషయం అడగలేదు. అదే స్థానంలో అదే బెంచీ మీద విద్యార్థి నాయకుడు భూలో కూర్చొని వుండటం పార్వతి చూసింది. అతణ్ని చూడగానే మొదట ఒకసారి నవ్వు వచ్చింది. కాని మరుక్షణమే ఆమె నయనాలు అశ్రుపూరితాలయ్యాయి. తరువాత ఆమెకు భూలో మీద కోపం వచ్చింది. కేవలం అతడే దేవదాసును ఇంటినుంచి బయటికి వెళ్ళిపోయేటట్లు చేశాడు అనుకొన్నది మనసులో. ఈ విధంగా చాలా రోజులు గడిచిపోయాయి.

చాలా రోజుల తరువాత దేవదాసు ఇంటికి తిరిగి వచ్చాడు. గబగబా పార్వతి దగ్గరకు వచ్చాడు. అనేకరకాల ముచ్చట్లు చెప్పుకున్నారు. ఆమె మాట్లాడవలసింది ఎక్కువగా లేదు. ఉన్నా మాట్లాడలేకపోయింది. కాని మాట్లాడవలసింది ఎక్కువగా లేదు. ఉన్నా మాట్లాడలేకపోయింది. కాని దేవదాసు చాలా విషయాలు చెప్పాడు. దాదాపు అన్నీ కలకత్తా విషయాలే. వేసవి సెలవులు గడిచిపోయాయి. దేవదాసు మళ్ళీ కలకత్తా వెళ్ళాడు. ఈ సారి కూడా ఏడ్పులూ, మొత్తుకోళ్ళూ! కాని అందులో పోయిన సారి వున్నంత గాంభీర్యం లేదు. ఈ రకంగా నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ అనేక సంవత్సరాల కాలంలో దేవదాసు స్వభావంలో వచ్చిన మార్పు చూసి పార్వతి అనేక సార్లు చాటుమాటుగా కన్నీళ్ళు కార్చింది. ఇంతకు పూర్వం దేవదాసులో వున్న గ్రామీణ దోషాలు పటణంలో వుంటున్న కారణంగా అమాంతంగా అదృశ్యమై పోయాయి. ఇప్పుడు వుంటున్న కారణంగా అమాంతంగా అదృశ్యమై పోయాయి. ఇప్పుడు అతడికి బూట్లూ, మంచి కోటూ, ఫ్యాంటూ, టై, బెత్తం, బంగారపు చైన్, వాచీ, గోల్డెన్ ఫ్రేముగల కళ్ళజోడూ మొదలైనవి లేకపోతే చాలా సిగ్గు పడతాడు. గ్రామం ప్రక్కనే వున్న నదీతీరాన తిరగడం ఇప్పుడు అతనికి నచ్చడంలేదు. దానికి బదులు చేతిలోకి తుపాకిని తీసుకొని వేటాడటంలో ప్రత్యేకమైన ఆనందం కలుగుతూ వుంది. చిన్న చిన్న చేపలను పట్టుకోవడం కన్న పెద్ద పెద్ద చేపలను

పట్టాలనే అభిలాష వున్నది. ఇంతేకాదు, సాంఘిక విషయాలూ, రాజకీయ చర్చలూ, సభలూ, సమితులూ, క్రికెట్, ఫుట్ బాల్ మొదలైన వాటిని గురించి పరామర్శిస్తూ వుండటం! ఆహా! పార్వతి ఎక్కడా! పల్లెటూరు ఎక్కడా! వాళ్ళిద్దరూ కలిసి తిరిగిన నీళ్ళ చెరువు ఎక్కడా! సోనాపూర్ గ్రామం ఎక్కడా! బాల్యం కాలంనాటి ఒకటి రెండు విషయాలు ఆనందం కలిగించేవి అతడికి జ్ఞాపకం రావడంలేదని కాదు. కాని అనేక విధాలుగా కార్య భారం పెరిగిపోయిన కారణంగా విషయాలు చాలా సేపటివరకూ హృదయంలో స్థానం పొందలేవు. మళ్ళీ వేసవి సెలవులు వచ్చాయి. గత సంవత్సరపు వేసవి సెలవుల్లో దేవదాసు కొత్త ప్రదేశాలు చూడటంకోసం విహార యాత్రకు వెళ్ళాడు. అంచేత ఇంటికి రాలేదు. ఈ సారి తల్లిదండ్రులు గట్టిగా ఇంటికి రావాలని పట్టుబట్టడం, అనేక ఉత్తరాలు వ్రాయడం వలన, తనకు రావాలనే అభిలాష లేకపోయినా కూడా దేవదాసు బెడ్ తోనూ, బ్యాగ్ తోనూ సోనాపూర్ రావడం కోసం హౌరా స్టేషన్ కు వచ్చాడు. అతడు ఇంటికి వచ్చినరోజు శారీరకంగా కొంచెం అస్వస్తుడుగా వున్నాడు. అందుచేత వచ్చిన దగ్గర నుంచీ బయటికి రాలేదు. మరుసటిరోజు పార్వతి ఇంటి కెళ్ళి "పిన్నీ!" అని పిలిచాడు

పార్వతి తల్లి ఎంతో గౌరవంగా "రా, నాయనా! ఇక్కడికి వచ్చి కూర్చో."

పిన్నితో కొన్ని క్షణాలు మాట్లాడిన తరువాత "పత్తో ఎక్కడున్నది పిన్నీ" అని అడిగాడు.

"అక్కడే పైన వున్న గదిలో వుంది."

దేవదాసు పైకి వెళ్ళి చూశాడు. పార్వతి సంద దీపం వెలిగిస్తూ వుంది.

"పత్తో!" అని పిలిచాడు.

మొదట పార్వతి ఆశ్చర్యపోయింది. తర్వాత నమస్కారం చేసి ప్రక్కనే కొంచెం ఎడంగా నిలబడింది.

"ఇదేమిటి ఇలా జరుగుతున్నది పత్తో?"

"ఈ విషయం చెప్పవలసిన అవసరం లేదు. అంచేతనే పార్వతి మౌనం వహించింది. తరువాత దేవదాసు సిగ్గుపడి "వెళ్తున్నాను. సాయంకాలమయింది. అందులో ఒంట్లో బాగాలేదు!" అన్నాడు.

దేవదాసు వెళ్ళిపోయాడు.

## 5

పార్వతి పదమూడో సంవత్సరం వచ్చిందని వాళ్ళ నాయనమ్మ చెప్పుతూ వుంది. ఈ వయసులో శారీరక సౌదర్యం అకస్మాత్తుగా ఎక్కడ నుంచో వచ్చి కిశోరావస్థలో వున్న బాలిక యొక్క శరీరాన్నంతటినీ ఆక్రమిస్తుంది. తమ చిన్న కన్య యిప్పుడు పెద్దదయిపోయిందని ఆత్మీయులైన బంధువులందరూ ఒకరోజు హఠాత్తుగా ఆశ్చర్యపోయి చూస్తూ వుంటారు. అప్పుడు ఆమె వివాహం కోసం ఆరాటపడుతూ వుంటారు, చక్రవర్తి-మహాశయుని ఇంట్లో అనేక రోజుల నుంచి ఈ విషయాలన్నింటిని గురించి చర్చ జరుగుతూనే వుంది. తల్లి ఇందుకోసం చాలా విచారపడుతూ వుంది. ఇప్పుడు పత్తోను ఎక్కువకాలం అవివాహితగా వుంచడం ఉచితం కాదని, ఆమె పదే పదే భర్తను హెచ్చరిస్తూనే వుంది. వాళ్ళు అంత గొప్ప వాళ్ళేమీ కారు. వాళ్ళకు ఒకే ఒక నమ్మకం వుంది. అదేమిటంటే కన్య అద్వితీయమైన సుందరి. ప్రపంచంలో రూపం అనే దానికి గౌరవం అనేది వున్నట్లయితే పార్వతి వివాహం కోసం ఎక్కువగా విచారించవలసిన పని వుండదు. మరో విషయం కూడా యిక్కడే చెప్పడం ఉచితంగా వుంటుంది. నీలకంఠ చక్రవర్తి కుటుంబంలో ఆడపిల్ల పెళ్ళికోసం ఈనాటి వరకూ ప్రత్యేకంగా విచారించవలసిన అవసరం యేమీ కలగలేదు. అయితే మగపిల్లాడి పెళ్ళి కోసం తప్పకుండా కొంత విచారించవలసిన శ్రమ కలుగుతుంది. కన్య వివాహంలో కన్యాపక్షం వాళ్ళే కట్నం తీసుకుంటారు. కొడుకు వివాహంలో కట్నం యిచ్చి కన్యను ఇంటికి తీసికొని వస్తుంటారు. ఇదీ వాళ్ళ సాంప్రదాయం. అయితే నీలకంఠ చక్రవర్తి స్వయంగా యీ ఆచారాన్ని చాలా అసహ్యించుకునేవారు. కన్యను అమ్మి ధనం సంపాదించాలనే కోరిక ఆయనకు ఏమాత్రమూ లేదు. పార్వతి తల్లికి యీ విషయం బాగా తెలుసు. అందుచేతనే కన్య వివాహం కోసం భర్త అప్పుడప్పుడూ హెచ్చరిస్తూ వుండేది. ఆరంభం నుంచీ పార్వతి తల్లి హృదయంలో ఏదో విధంగా దేవదాసుతో తన కన్య పార్వతి వివాహం జరగాలనే అభిలాష ఉండేది. తన ఆశ దురాశ మాత్రమేనని ఆమె కలలో గూడా విశ్వసించేది కాదు. దేవదాసు గట్టిగా పట్టుబడితే ఏదో ఒక మార్గం దొరుకుతుందని ఆమె ఆలోచిస్తూ వుండేది. ఈ విషయం ఆలోచించే కావచ్చు నీలకంఠ చక్రవర్తి తల్లి దేవదాసు తల్లితో ఈ విధంగా చర్చ ప్రారంభించింది_

"ఆహా! కోడలా, దేవదాసుకూ, నా పత్తోకూ ఉన్నటువంటి స్నేహం మరెక్కడా వెతికినా కన్పించదు."

"అవును, స్నేహం ఎందుకు వుండదు పిన్నీ? వాళ్ళిద్దరూ చిన్న తనం నుంచీ అన్నాచెల్లెళ్ళలాగా పెరిగి ఇంత పెద్దవాళ్ళయ్యారు." అన్నది దేవదాసు తల్లి.

"అవును కోడలా! అది నాకూ తెలుసు. చూడరాదూ, దేవదాసు కలకత్తా వెళ్ళినప్పుడు పత్తో ఎనిమిది సంవత్సరాల పిల్ల. కాని ఆ వయసులోనే అతణ్ణి గురించి దిగులు పడుతూ పడుతూ చిక్కి సగం అయిపోయింది. దేవదాసు ఉత్తరం

ఎప్పుడయినా ఒక్కటి వస్తే అది దానిని చాలా మక్కువతో రేయింబవళ్ళు అనేకసార్లు చదువుకుంటూ వుండేది. ఈ విషయం మాకు బాగా తెలుసు."

దేవదాసు తల్లి మనస్సులోనే అంతా అర్థం చేసుకొన్నది. కొద్దిగా చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వులో ఎన్నో దాగివున్న భావాలు కూర్చి వున్నాయి. అది నేను చెప్పలేను. అయితే వేదన చాలా వుంది. ఆమెకు అన్ని విషయాలూ తెలుసు. దానికి తోడు పార్వతిని ప్రేమిస్తున్నది కూడా. అయితే ఆమె కన్యలను అమ్ముకొనేవాళ్ళ, కొనుక్కొనేవాళ్ళ కుటుంబానికి చెందిన బాలిక. పైగా వారి కుటుంబం ఇంటి పక్కనే వుంది. అంచేత అటువంటి కుటుంబంతో వివాహ సంబంధం సరైనది కాదు. "పిన్నీ, ఆయనగారు ఇంత చిన్న వయసులో పిల్లవాడి పెళ్ళి చేయరు. ముఖ్యంగా చదువుకొనే రోజుల్లో. అందుకనే పెద్ద పిల్లవాడు ద్విజదాసుకు చిన్నతనంలో పెళ్ళి చేయడం వలన చాలా హాని జరిగిందనీ, అమాంతంగా చదువు ఆగిపోయిందనీ ఆయనగారు నాతో అంటూ వుంటారు" అన్నది.

ఈ మాట విని పార్వతి నాయనమ్మ ముఖంలో పూర్తిగా రంగుమారిపోయింది. అయినా అంటూ వుంది__

"ఇది నాకూ తెలుసు కోడలా! పత్తో ఇప్పుడు పెద్దదై పోయింది. నీకు మాత్రం తెలియదా! ఆమె శరీర నిర్మాణం గూడా పొడవుగా, దృడంగా వుంటుంది. ఇందువల్ల ఒకవేళ నారాయణ ఈ విషయాన్ని...."

దేవదాసు తల్లి మాటకు అడ్డం వచ్చి__"కాదు పిన్నీ, నేను ఈ విషయం ఆయనతో చెప్పలేను. నీవే చెప్పు! ఈ సమయంలో నేను ఏ ముఖం పెట్టుకొని ఆయనతో ఈ మాట చెప్పేది?" అన్నది.

ఈ విషయం ఇక్కడే సమాప్తమయ్యింది. అయితే ఆడవాళ్ల కడుపులో మాట దాగుతుందా? భర్త బోజనానికి వచ్చినప్పుడే దేవదాసు తల్లి ఆయనతో "పార్వతి నాయనమ్మ పార్వతి పెళ్ళి సంగతి మాట్లాడుతూ వుంది" అని చెప్పింది.

భర్త వంచిన ముఖం పైకెత్తి "అవును, ఇప్పుడు పార్వతికి పెళ్ళీడు వచ్చింది. ఇప్పుడు ఆమె పెళ్ళి చేయడమే ఉచితంగా వుంటుంది" అన్నాడు.

"ఈ సంగతే ఈ రోజు ముచ్చటిస్తూ వచ్చింది. దేవదాసుతో పార్వతి పెళ్ళి...."

"నీవు ఏమన్నావు?" అన్నాడు భర్త కనుబొమ్మలు విరుస్తూ.

"నేను ఏమంటాను? ఇద్దరిలో చాలా స్నేహం వుంది. అయితే అంత మాత్రంచేత కన్యలను అమ్ముకొని, కన్యలను కొనుక్కొనే నీలకంఠ చక్రవర్తి

వంశంలోని పిల్లను కోడలుగా తెచ్చుకుంటానా? పైగా ఇంటిప్రక్క ఇల్లు. ఛీ!ఛీ!"

భర్త సంతృప్తి పడి "బాగుంది, నేను మాత్రం వంశాన్ని నవ్వుల పాలు చేస్తానా? నీవు యిటువంటి మాటలు పట్టించుకోవద్దు" అన్నాడు.

"లేదు, నేను ఈ విషయాన్ని అసలు పట్టించుకోను. కానీ నీవు కూడా ఈ విషయం మరచిపోవద్దు" అన్నది గృహిణి పొడిగా నవ్వుతూ.

భర్త అన్నం ముద్ద చేతిలోకి తీసుకుంటూ గాంభీర్యంగా "ఇలా అయితే ఈ పెద్ద జమీందారీ అంతా ఎప్పుడో ఊడ్చుకుపోయేది" అన్నాడు.

పెళ్ళి ప్రస్తావనను అంగీకరించలేదన్న మాట నీలకంఠ చక్రవర్తి చెవిన పడగానే ఆయన తల్లిని పిలిచి తిరస్కార భావంతో " అమ్మా! నీవు ఎందుకు ఇటువంటి మాట చెప్పడానికి వెళ్ళావు?" అన్నాడు.

తల్లి మౌనం వహించింది! "కన్య వివాహం కోసం మనం ఎవడికాళ్ళమీదా పొడేది లేదు. ఎంతో మంది వచ్చి మన కాళ్ళమీదే పడతారు. నా కూతురు అందం లేనిది కాదు. చూడండి, ఒక వారం రోజుల లోపలే సంబంధం కుదుర్చుకొస్తాను. ఈ విషయం మీ అందరితో చెపుతున్నాను. పెళ్ళి కోసం ఆలోచించాలా ఏం?" అన్నాడు నీలకంఠ చక్రవర్తి.

అయితే తండ్రి ఏ కన్య కోసం ఈ మాటన్నాడో ఆ మాట వినగానే ఆ కన్య నెత్తిమీద పిడుగు పడినట్లయింది. దేవదాసు మీద తనకొక్కదానికే అధికారం వుంది అనే నిశ్చయం ఆమెకు బాల్యం నుంచీ వుంది. ఆ అధికారం ఆమె చేతికి ఎవరో ఒప్పగించింది కాదు. మొదట ఆమె కూడా దీనిని బాగా అర్థం చేసుకోలేకపోయింది. తెలియకుండా అస్థిరంగా వున్న ఆమె మనసులో రోజు రోజుకూ ఈ అధికారాన్ని నిశ్శబ్దంగా, దృఢంగా తనదిగా చేసుకొని నిలుపుకున్నది. ఇప్పటివరకూ దాని బాహ్యరూపం తన కళ్ళారా చూడలేకపోయింది. అయినా కూడా అది చేజారిపోవటం చూసి ఆమె హృదయం అంతటా ఓ గొప్ప తుఫాను చెలరేగింది.

కాని దేవదాసు విషయంలో ఈ మాట అనటం ఉచితంగా వుండదు. బాల్యంలో పార్వతిమీద పొందిన అధికారాన్ని పూర్తిగా వినియోగించుకున్నాడు. అయితే కలకత్తా వెళ్ళిన తరువాత కార్యకలాపాలు ఎక్కువ కావడం, ఇంకా ఇతర ఆనందంలోనూ, ఉల్లాసంలోనూ పడిపోవడం కారణంగా అతడు పార్వతిని చాలా భాగం మరచిపోయాడు. కాని పార్వతి పరివర్తన చెందనటువంటి ఆ పల్లెటూరి జీవితంలో రేయింబవళ్ళు కేవలం అతణ్ణే స్మరిస్తూ వున్నదని అతనికి తెలియదు. అంతేకాదు, బాల్యంలో ఎవరి నయితే అన్ని విధాలా తన వాణ్ణిగా భావించిందో, ఎవరికయితే సుఖదుఃఖాలలో తోడ్పడిందో అతణ్ని యౌవనావస్థలోని ప్రథమ

సోపానంమీద పాదం పెట్టగానే వదులుకొని జారిపోవలసి వస్తుందని ఆమె కలలో కూడా ఆలోచించలేదు. కాని ఆ సమయంలో వివాహం సంగతి యెవరు ఆలోచించేవాళ్ళు? కిశోరావస్థలోని బంధం వివాహ బంధం లేకుండా ఏ విధంగానూ స్థిరంగా వుండజాలదని ఎవరికి తెలుసు? 'కాబట్టి ఈ వివాహం అసంభవం' అనే సంభాషణ ఆమె ఆశనూ, అభిలాషనూ అంతటినీ చిందర వందర చేయడం కోసం ఆమె హృదయంతో పెనుగులాడుతూ వుంది. దేవదాసుకు ప్రాతఃకాలపు సమయం చదువు కొనడం,వ్రాసుకొనడంలోనూ గడచిపోతుంది. మధ్యాహ్నం చాలా వేడిగా వుంటుంది. కాబట్టి ఇంట్లో నుంచి బయటికి రావడం కష్టంగా వుంటుంది. కేవలం సాయంకాలం అదీ రావాలనిపిస్తే అతడు బయట స్వచ్ఛమైన గాలిలో విహరించడానికి వెళుతూ వుంటాడు. ఆ సమయంలో అతడు ఒక్కొక్కప్పుడు ధోవతి, చొక్కా ధరించి, మంచి చెప్పులు వేసుకొని, చేతిలో బెత్తం తీసికొని షికారు చేయడానికి బయలుదేరాడు. వెళ్ళేటప్పుడు అతడు చక్రవర్తి ఇంటి ముందుగా వెళ్ళేవాడు. పార్వతి పైన బంగళాలో కన్నీళ్ళు తుడుచుకుంటూ అతణ్ణి చూస్తూ వుండేది. ఆమె మనసులో ఎన్నో విషయాలు మెదులుతూ వుండేవి. ఇరువురమూ పెద్దవాళ్ళమయ్యాం అనే విషయం తలపు కొచ్చేది. చాలాకాలం ఇతర ప్రాంతంలో వున్న కారణంగా ఇద్దరూ ఒకరిని చూసి ఒకరు చాలా సిగ్గు పడుతున్నారు. దేవదాసు ఆ రోజు ఈ విధంగానే వెళ్ళి పోయాడు. లజ్జ కారణంగా అభిలాష వుండి కూడా ఆతడేమీ మాట్లాడలేక పోయాడు. ఈ విషయం పార్వతి కూడా గ్రహించకుండా లేదు.

దేవదాసు కూడా ఈ విధంగానే ఆలోచిస్తూ వుండేవాడు. మధ్య మధ్యలో ఆమెను చూడాలనీ, ఆమెతో మాట్లాడాలనీ అభిలాష కలుగుతూ వుండేది. కాని యిది సభ్యతగా వుంటుందా అనే విషయం గుర్తుకు వచ్చేది.

ఇక్కడ కలకత్తాలోని ఆ కోలాహలం లేదు. ఆ ఆనందం లేదు. ఆ ఉల్లాసం లేదు. ఆ థియేటర్లూ, ఆ గానా బజానాలు లేవు. అంచేత అతడికి కేవలం ఆ బాల్యకాలపు విషయాలు జ్ఞప్తికి వస్తున్నాయి. ఈ పార్వతి ఆ పార్వతేనా అనే ప్రశ్న అతడి మనసులో బయలుదేరుతుంది. ఈ దేవదాసు ఆ దేవదాసేనా అని పార్వతి తన మనసులో ఆలోచిస్తుంది. దేవదాసు ఇప్పుడు తరచుగా చక్రవర్తి ఇంటివైపుకు వెళ్ళడం లేదు. ఎప్పుడయినా ఒకసారి వరండాలో నిలబడి "పిన్నీ ఏం చేస్తున్నావు?" అని అడిగేవాడు.

ఇక్కడకు వచ్చి కూర్చో నాయనా!" అనేది పిన్ని.

"ఇప్పుడు కాదులే పిన్నీ, నేను కొంచెం షికారుకు వెళ్తున్నాను" అని దేవదాసు అనేవాడు.

పార్వతి ఒకప్పుడు పైన వుండేది. ఒకప్పుడు దేవదాసుకు ఎదురుపడేది.

అతడు పిన్నితో మాట్లాడుతూ వుంటే ఆమె నెమ్మదిగా అక్కడ నుంచి జారుకునేది. సాయంకాలం తరువాత దేవదాసు ఇంట్లో దీపం వెలుగుతూ వుండేది. గ్రీష్మఋతువులో తెరచివున్న కిటికీలో గుండా పార్వతి చాలా సేపటి వరకు ఆ వైపే చూస్తూ వుండేది. కాని ఆ దీపం వెలుగు తప్ప మరేమీ చూడగలిగేది కాదు. పార్వతి మొదటి నుంచీ ఆత్మాభిమానం గలది. ఆమె ఇప్పుడు పడుతున్న యాతనలో లేశ మాత్రం కూడా ఎవరికీ తెలియనీయకుండా వుంచడానికి ప్రయత్నిస్తూ వుండేది. ఎవరితోనైనా చెప్పుకున్నందు వలన ప్రయోజనం ఏముందీ? సానుభూతిని ఆమె సహించలేదు. తిరస్కారాన్నీ, కళంకాన్ని సహించేకన్నా మరణించడమే మేలు. గత సంవత్సరం మనోరమ వివాహ మయ్యింది. ఆమె యింకా అత్తవారింటికి వెళ్ళలేదు. అంచేత మధ్య మధ్యలో ఆమె పార్వతిని కలుసుకొనడానికి వస్తూ వుండేది. మొదట్లో ఇద్దరి సంభాషణలో ఈ విషయాలన్నీ వస్తూ వుండేవి. కాని యిప్పుడు పార్వతి ఆమెకు ఆ విషయం ముచ్చటించడానికే అవకాశమిచ్చేది కాదు. అటువంటి విషయం వచ్చిన సందర్భంలో ఆమె మౌనంగా ఉండేది. లేకపోతే ఆ విషయాన్ని దాట వేస్తూ వుండేది.

పార్వతి తండ్రి నిన్న రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇటీవల అనేక రోజుల నుంచి ఆయన వరుణ్ని వెతకడానికి వెళ్ళాడు. ఇప్పుడు వివాహం విషయం అంతా స్థిరపరచుకొని ఇంటికి తిరిగి వచ్చాడు. పాతికా ముప్పయ్ కోసుల దూరంలో బర్ద్ వాన్ జిల్లా హాథీపోతా గ్రామం జమీందారుతో పార్వతి వివాహం స్థిరపరచుకొని వచ్చాడు. ఆయన ఆర్థిక పరిస్థితి బాగున్నది. వయసు నలుబది సంవత్సరాల కన్న కొంచెం తక్కువే వుంటుంది. గత సంవత్సరం మొదటి భార్య స్వర్గస్తురాలయింది. అంచేత రెండో వివాహం చేసుకొంటున్నాడు. ఈ వార్తతో కుటుంబంలో యెవ్వరికీ ఆనందం కలగలేదు. పైగా దుఃఖమే కలిగింది. అయినప్పటికీ భువన్ మోహన్ చౌధరీ నుంచి అంతా కలుపుకొని రెండు మూడు వేల రూపాయలు అభ్యమవుతున్నాయి. అందువల్ల ఆడవాళ్ళందరూ మౌనం వహించారు.

ఒక రోజు మధ్యాహ్నం దేవదాసు వంటింట్లో భోజనం చేయడానికి కూర్చున్నప్పుడు తల్లి దగ్గర కూర్చొని "పత్తో పెళ్ళి" అన్నది.

దేవదాసు తలపైకెత్తి "ఎప్పుడూ?" అని అడిగాడు.

"ఈ నెలలోనే. నిన్న వరుడు స్వయంగా వచ్చి కన్యను చూసి వెళ్ళాడు."

దేవదాసు కొంచెం విస్మితుడై "నాకు ఏమీ తెలియలేదే అమ్మా!" అన్నాడు.

"నీకెలా తెలుస్తుంది? వరుడు రెండో పెళ్ళివాడు. వయసు కొంచెం ఎక్కువగా వుంటుంది. కాని శ్రీమంతుడు. పత్తోకు తిండికీ, బట్టకూ లోటేమీ

వుండదు. సుఖంగానే వుండగలదు."

దేవదాసు తల వంచుకొని భోజనం చేస్తూ వున్నాడు. అతడి తల్లి మళ్ళీ చెప్పడం ప్రారంభించింది_"పార్వతిని మొదట మనింట్లో ఇవ్వాలని అనుకున్నారు."

దేవదాసు తల పైకెత్తి "మరి?" అన్నాడు.

"ఛీ! ఈ విధంగా ఏనాటికయినా సాధ్యమవుతుందా? ఒకటేమో వాళ్ళు కన్యను అమ్ముకొని, కన్యను కొనడం లాంటి పనులు చేసే వాళ్ళు! అటువంటి చిన్న వంశంలో! ఛీ! ఛీ!" ఇలా తల్లి పెదవి విరిచింది. దేవదాసు కూడా ఇది గమనించాడు.

కొంచెం సేపు మౌనంగా వున్న తరువాత తల్లి మళ్ళీ "నేను మీ నాన్నగారితో కూడా చెప్పాను" అన్నది.

"నాన్నగారు ఏమన్నారు?" అన్నాడు దేవదాసు.

"ఇంకేమంటారూ? ఇంత గొప్ప వంశానికి తలవంపులు తెద్దామా?" అన్నాడు.

దేవదాసు తరువాత ఏ విషయమూ అడగలేదు. అదే రోజు మధ్యాహ్నం మనోరమకు, పార్వతికి సంభాషణ జరిగింది. పార్వతి కళ్ళల్లో నీళ్ళు చూసి మనోరమ కళ్ళు కూడా అశ్రుపూరితాలయ్యాయి. ఆమె కన్నీళ్ళు తుడుచుకొని "మరి ఇంకే ఉపాయం వుంది చెల్లీ?" అన్నది.

పార్వతి కూడా కళ్ళు తుడుచుకొని "నీవు వరుణ్ని ఇష్టపడే చేసుకున్నావా?" అన్నది.

"నా విషయం వేరు. నాకు ఇష్టమూ లేదు, అయిష్టమూ లేదు. అందుకే నాకేమీ కష్టం కూడా లేదు. కాని నీ కాళ్ళను నీవే గొడ్డలితో నరుక్కుంటున్నావు చెల్లీ!"

పార్వతి ఏమీ జవాబివ్వలేదు. ఆమె మనస్సులోనే ఏదో ఆలోచిస్తూ వున్నది.

మనోరమ కూడా ఏదో ఆలోచిస్తూ నవ్వింది. తరువాత "పత్తో! వరుడి వయస్సు ఎంత?" అని అడిగింది.

"ఎవరి వరుడిదీ?"

"నీ....!"

పార్వతి నవ్వి "పంతొమ్మిది సంవత్సరాలు వుండవచ్చు" అన్నది.

మనోరమ ఆశ్చర్యపోయి "నలభై అని నేను విన్నాను" అన్నది.

ఈ సారి కూడా పార్వతి నవ్వి "మనో అక్కా, ఎంత మంది వయసు నలభై సంవత్సరాలలో నేను అందరి వయసుల లెక్క వుంచుతున్నాననుకున్నావా? నా వరుడి వయస్సు పంతొమ్మిదీ- ఇరవై సంవత్సరాలు వుంటుంది__ఇది నాకు తెలుసు."

ఆమె ముఖం వైపు చూసి మనోరమ మళ్ళీ "పేరేమిటే?" అన్నది.

"నీకు తెలిసిందే!"

"నాకు ఎలా తెలుస్తుంది?"

"నీకు తెలియదా? సరే వుండు చెప్పేస్తాను" అని కొంచెం నవ్వి గాంభీర్యంగా తన నోటిని ఆమె చెవి దగ్గరకి తీసికునిపోయి "నీకు తెలియదా? శ్రీ దేవదాసు" అన్నది.

మనోరమ మొదట స్తబ్దురాలై పోయింది. ఆమెను కొంచెం అవతలకు నెట్టి "ఈ పరిహాసంతో పని కాదు. పేరేమిటో సరీగా చెప్పు. ఒకవేళ చెప్పలేకపోతే...." అన్నది.

"అదే నేను చెప్పాను గదా!"

"ఒకవేళ పేరు దేవదాసే అయితే ఇంతగా ఏడుస్తావెందుకు?" అని అడిగింది మనోరమ కోపంగా.

హఠాత్తుగా పార్వతి ముఖంలో రంగు మారిపోయింది. కొంచెం ఆలోచించిన తరువాత "ఇది నిజమే! ఇప్పుడు నేనిక ఏడవను" అన్నది.

"పత్తో!"

"ఏమిటే?"

"అన్ని విషయాలూ బాగా ఆలోచించుకొని చెప్పు చెల్లీ! నాకు ఏమీ అర్థం కావటం లేదు."

"నేను చెప్పవలసినదంతా చెప్పేశాను" అన్నది పార్వతి.

"కాని నాకు ఏమీ అర్థం కావడంలేదు."

"అర్థం కాకపోవచ్చు." అని పార్వతి మరోవైపు చూస్తూ వుంది.

'పార్వతి మాట దాస్తున్నది. ఆమెకు చెప్పాలనే అభిలాష లేదు' అనుకొన్నది మనోరమ. అందువల్ల ఆమెకు చాలా కోపం కూడా వచ్చింది. విచారపడుతూ ఆమె అన్నది__"పత్తో" నీకు బాధ కలిగించే విషయం నాకూ బాధ కలిగిస్తుంది. నీవు సుఖంగా వుండాలనే నేను నా అంతరంగంలో ప్రార్థిస్తూ వుంటాను. ఒకవేళ నీవు ఏ విషయమైనా ఎవరితోనైనా చెప్పదలచుకొనకపోతే చెప్పకుండా వుండు. కాని యీ విధంగా పరిహసించడం బాగుండదు."

పార్వతి విచారపడుతూ "పరిహసించడం లేదు అక్కా. నాక తెలిసినంతవరకు నేను నీకు చెప్పేశాను. నాకు ఇదే తెలుసు. నా భర్త పేరు శ్రీ దేవదాసు, వయసు పంతొమ్మిదీ, ఇరవై సంవత్సరాలు. ఈ విషయమే నీతో కూడా చెప్పేశాను" అన్నది.

"కాని నీ సంబంధం మరొకరితో స్థిర పడిందని నేను విన్నాను."

"ఇంకేం స్థిరపడుతుంది? దాదా పెళ్ళి ఇంకెవరితోనూ జరగదు. జరిగితే నాతోనేగదా? నేను నీవు విన్నటువంటి వార్త ఏదీ వినలేదు."

మనోరమ విన్న విషయాన్ని చెపుతూ వుంది. పార్వతి "ఇదంతా నేను కూడా విన్నాను" అన్నది.

"అప్పుడు దేవదాసు నిన్ను...."

"ఏమిటీ నన్నూ?"

మనోరమ నవ్వును అణచుకుంటూ "అయితే స్వయంవరం జరిగినట్లు కన్పిస్తున్నది! చాటు చాటుగానే జరిగిపోయి స్థిరపడిపోయిందన్న మాట!

"స్థిరపడటం, స్థిరపడక పోవటం అంటూ ఇక్కడేమీ జరగలేదు."

"పత్తో, నీవు చెప్పేదేమిటో నాకేమీ అర్థం కావడం లేదు" అన్నది మనోరమ వ్యథపడుతూ.

"అయితే దేవదాసును అడిగి నేను నీకు వివరిస్తాను" అన్నది పార్వతి.

"అతడు నిన్ను పెళ్ళి చేసుకుంటాడో లేదో అని అడుగుతావా?"

"అవును, అదే అడుగుతాను." అన్నది పార్వతి తల ఊపుతూ.

మనోరమ ఆశ్చర్యంతో "ఏం చేపుతున్నావే పత్తో, నీవు స్వయంగా అడుగుతావా?" అన్నది.

"ఇందులో తప్పేముంది?" అన్నది.

మనోరమ అవాక్కయి పోయింది. "ఏమంటున్నావు? స్వయంగానే?"

"అవును, స్వయంగానే. లేకపోతే ఇంకా నా తరపున ఎవరు అడుగుతారు?"

"నీకు సిగ్గు వేయదా?"

"ఎందుకు సిగ్గు వేస్తుంది? నీతో చెప్పడానికి నేనేం సిగ్గుపడ్డానా?"

"నేను స్త్రీని, నీ స్నేహితురాలిని. కాని అతడు పురుషుడు, పత్తో!"

పార్వతి ఫక్కున నవ్వింది. "నీవు స్నేహితురలివి. నీవు ఆత్మీయురాలివి. కాని ఆయనేం పరాయివాడా? నీతో చెప్పగలిగినదాన్ని, ఆ విషయాన్నే ఆయనతో చెప్పలేనా?" అన్నది.

మనోరమ అవాక్కయిపోయి ఆమె ముఖం వైపు చూస్తూ వుంది.

పార్వతి నవ్వుతూ 'మనో అక్కా, నీవు ఊరకనే నుదుట సింధూరము పెట్టుకున్నావు. భర్త అని ఎవరిని అంటారో కూడా నీకు తెలియదు. ఆయన నా భర్త కాకపోయినా నా సిగ్గుకు భర్త, నా సౌభాగ్యానికి భర్త. ఆయన అలా చేయకముందే నేను చచ్చిపోనా! దీన్ని వదిలేసెయ్. చావడానికి సిద్ధపడుతున్న వాళ్ళు విషం చేదుగా వుంటుందా, తియ్యగా వుంటుందా అని చూస్తారా? ఆయన దగ్గర నాకు చాటు ఏమీ లేదు" అన్నది.

మనోరమ ఆమె ముఖం వైపే చూస్తూ వుంది. కొంచెం సేపటి తరువాత ఆయనతో ఏమంటావు? నాకు మీ పాదాల దగ్గర స్థానమివ్వమంటావా?" అని అడిగింది.

"సరీగ్గా అదే అంటానక్కా!" అన్నది పార్వతి తల వూపుతూ.

"ఆయన స్థానం ఇవ్వకపోతే?'

ఈసారి పార్వతి కొంచెం సేపటిదాకా మౌనం వహించింది. తరువాత "ఆ సమయానికి నా నోట ఏ మాట వస్తుందో తెలియదు" అన్నది.

ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో మనోరమ లోలోపల ఆలోచిస్తూ వుంది__"పార్వతి సాహసం ధన్యమైనది. పార్వతి ఆత్మబలం ధన్యమైనది. నేను మాత్రం చచ్చినా ఈ మాట నా నోటితో ఎన్నడూ అనలేను."

ఆ మాట అక్షరాలా నిజం. అందుకే పార్వతి, మనోరమతో "నుదుట సింధూరమూ, చేతులకు గాజులూ ధరించడం వ్యర్థం" అన్నది.

## 6

రాత్రిపూట దాదాపు ఒంటిగంట కావస్తున్నది. అప్పుడు కూడా మసక వెన్నెల ఆకాశాన్ని అంటిపెట్టుకొనే వుంది. పార్వతి ఆపాదమస్తకము ఒంటినిండా దుప్పటి కప్పుకొని పిల్లి అడుగులు వేసుకుంటూ మెల్లగా మెట్లమీదుగా క్రిందికి దిగి వచ్చింది. కళ్ళు తెరిచి నలువైపులా చూసింది. ఎవ్వరూ మెలకువతో లేరు. ఆ తరువాత తలుపు తీసికొని నిశ్శబ్దంగా ఉన్న దారిలోకి వచ్చి నిలబడిపోయింది. పల్లెటూరి బాట కదా, పూర్తిగా స్తబ్దంగా, నిర్మానుష్యంగా వుంది. ఎవరైనా ఎదురుపడతారనే భయం కలగలేదు. ఆమె యే అవరోధమూ లేకుండా జమీందారుగారి భవంతి ఎదటికొచ్చి నిలబడింది. దేవిడీ దగ్గర వృద్ధుడైన కాపలాదారు కృష్ణసింహ్ మంచం వాల్చుకొని తులసీ రామాయణం చదువుతూ వున్నాడు. పార్వతి ప్రవేశించడం చూసి అతడు కళ్ళు వాల్చుకునే "ఎవరూ?" అని ప్రశ్నించాడు.

"నేను" అన్నది పార్వతి.

ఎవరో ఆడమనిషి అనుకున్నాడు కాపలా జవాను. దాసీ యేమోనని భావించి మళ్ళీ ఏమీ ప్రశ్నించలేదు. పాడుకుంటూ రామాయణం పాఠిస్తూ వున్నాడు. పార్వతి లోపలికి వెళ్ళిపోయింది. వేసవి కాలం కావడంచేత బయట వరండాలో అనేకమంది నౌకర్లు నిద్రిస్తూ వున్నారు. వాళ్ళల్లో సగం మంది గాఢ నిద్రలో వున్నారు. ఎంతోమంది సగం నిద్రబోతూ సగం మేలుకొంటూ వున్నారు. నిద్ర మగతలో ఒకడూ అరా పార్వతి వెళ్ళడము చూశారు. కాని దాసీ అనుకొని ఎవరూ అడ్డగించలేదు. పార్వతి నిర్విఘ్నంగా మెట్లమీదుగా పైనున్న గదిలోకి వెళ్ళిపోయింది. ఈ ఇంట్లో ప్రతి గదీ, ప్రతి మూలా పార్వతికి తెలిసే వుంది. దేవదాసు గదిని గుర్తించడంలో ఆమెకేమీ అవరోధం కలగలేదు. తలుపు తెరిచే వుంది. లోపల ఒక దీపం వెలుగుతూ వుంది. పార్వతి లోపలికి వచ్చి చూసింది. దేవదాసు ప్రక్కమీద నిద్రిస్తూ వున్నాడు. తలవైపున ఆ సమయంలో కూడా పుస్తకం తెరచి పడి వుంది. దానిని బట్టి అతడు ఇంతకు ముందే నిద్రబోయినట్లుగా బోధపడుతూ వుంది. దీపం వత్తిని కొంచెం పెద్దది చేసి ఆమె నిశ్శబ్దంగా దేవదాసు పాదాల దగ్గరకు వచ్చి కూర్చున్నది. కేవలం గోడకు వ్రేలాడుతున్న గడియారం మాత్రం "టక్ టక్" అని ధ్వనిస్తూ వుంది. అది మినహా అంతా నిశ్శబ్దంగా నిద్రపోతూ వున్నారు. అంతటా నిశ్శబ్దం వ్యాపించింది. పాదాలపైన చేయి వేసి పార్వతి నెమ్మదిగా "దేవదాదా" అన్నది.

దేవదాసు నిద్రమగతలో ఎవరో తనను పిలుస్తున్నట్లు విన్నాడు. అతడు ఆ నిద్రలోనే వుండి కళ్ళు తెరవకుండానే "ఊ" అన్నాడు.

"దేవదాదా!"

ఈసారి దేవదాసు కళ్ళు మూసుకునే లేచి కూర్చున్నాడు. పార్వతి ముఖానికి ముసుగులేదు. ఇంట్లో దీపం తీవ్రమైన కాంతితో వెలుగుతూ వుంది. దేవదాసు సహజంగానే గుర్తుపట్టాడు. అయినా మొదట అతడికి విశ్వాసం కలగలేదు. ఇదేమిటి పత్తో?" అని అడిగాడు.

దేవదాసు గడియారం వైపు చూశాడు. విస్మయం మీద విస్మయం పెరుగుతూ పోయింది__"ఇంత రాత్రిపూట."

పార్వతి ఏమీ జవాబుచెప్పలేదు. ఆమె ముఖం వాల్చుకొని కూర్చున్నది. దేవదాసు మళ్ళీ ప్రశ్నించాడు_ "ఇంత రాత్రిపూట ఇంటి నుంచి ఒంటరిగానే వచ్చావా?"

"అవును!" అన్నది పార్వతి.

దేవదాసు ఉద్విగ్నుడై పోయాడు. భయ సందేహాలతో కంపించి పోయాడు. శరీరం గగుర్పొడిచింది_"ఏం? దారిలో భయం కూడా వేయలేదా?" అని అడిగాడు.

పార్వతి తియ్యగా నవ్వింది_"నాకు భూతం భయం వుండదు గదా!

"భూతానికి భయపడవనుకో, మనిషికి భయపడతావుగదా, ఎందుకొచ్చావు?"

పార్వతి ఏమీ జవాబు చెప్పలేదు. "ఈ సమయంలో నాకు మనిషి భయం కూడా లేదు" అని మనసులో అనుకున్నది.

"ఇంట్లోకి ఎలా వచ్చావు? ఎవరూ చూడలేదా?" "కాపలా జవాను చూశాడు."

దేవదాసు బాగా కళ్ళు తెరచి చూశాడు. "కాపలా జవాను చూశాడా? ఇంకెవరూ?" అన్నాడు.

వరండాలో నౌకర్లు నిద్రిస్తూ వున్నారు. బహుశా వాళ్ళల్లో ఎవరైనా చూసి వుండవచ్చు."

దేవదాసు ప్రక్క మీద నుంచి దుమికి తలుపు తీశాడు. "ఎవరైనా గుర్తుపట్టారు కూడానా?" అన్నాడు. పార్వతి ఏమీ ఉత్కంఠతను వెల్లడించలేదు. సహజ భావంతోనే సమాధానమిచ్చింది_వాళ్ళందరికీ నేను తెలిసిన దాన్నే గదా! బహుశా ఎవరైనా గుర్తుపట్టారేమో!

"ఏమంటున్నావు? ఇటువంటి పని ఎందుకు చేశావు పత్తో?"

"ఇది నీవు ఎలా అర్థం చేసుకోగలవు?" అని పార్వతి లోలోపల

అనుకొన్నది. కాని పైకి ఏమీ అనలేదు. తల వంచుకొని కూర్చున్నది.

"ఇంత రాత్రిపూట_ఛీ!ఛీ! రేపు నీవు ఎలా ముఖం చూపించగలవు?"

"ఆ సాహసం నాలో వుంది" అన్నది పార్వతి తల వంచుకొని.

దేవదాసు కోపించలేదు. అయితే చాలా ఉత్కంఠతో_ఛీ!....ఇంకా నీవు చిన్నపిల్లవే ననుకుంటున్నావా? ఇక్కడకు ఈ విధంగా వస్తుంటే నీకు కొంచెం కూడా సిగ్గు వేయలేదా?"

"ఏమీ వెయ్యలేదు" అన్నది పార్వతి తల వూపుతూ.

"రేపు సిగ్గుతో నీ తల వాలిపోదూ?"

ఈ ప్రశ్న విని పార్వతి తీవ్రంగానూ, జాలిగానూ దేవదాసు ముఖం వైపు కొన్ని క్షణాలపాటు చూసి నిస్సంకోచంగా అన్నది_"నీవు నా సిగ్గునంతటినీ బాగా కనిపెట్టగలవని నాకు తెలియకపోతే అప్పుడు తల వాలిపోతుంది.

దేవదాసు విస్మయంతో, నిశ్చేష్టుడయి_"నేను! కాని నేను మాత్రం ఎలా ముఖం చూపించగలను?"

పార్వతి అదే మాదిరిగా దృఢంగా అన్నది_"నీవా? నీకు ఏమవుతుంది దేవదాదా? కొంచెం సేపు మౌనంగా వున్న తరువాత ఆమె అన్నది_నీవు పురుషుడవు! ఈ రోజు కాకపోయినా రేపైనా నీ కళంకం విషయం అందరూ తప్పకుండా మరచిపోతారు. ఎప్పుడు, ఏ రాత్రి దృష్టవంతురాలైన పార్వతి అంతా తుచ్ఛమని భావించి నీ పాదధూళిలో లీనమైపోవడానికి వచ్చిందనే విషయం రెండు రోజుల తరువాత జ్ఞాపకం కూడా వుండదు."

"ఇదేమిటి పత్తో?"

"మరి నేనో?"

"మరి నీవో?" అన్నాడు దేవదాసు మంత్రముగ్ధుడై.

"నా కళంకం సంగతి అడుగుతున్నావా? లేదు, నాకు కళంకం అంటదు. నీ దగ్గరకు నేను రహస్యంగా వచ్చాను. ఈ మాట అని నన్ను నిందిస్తే ఆ నింద నాకు తగలదు.

"ఇదేమిటి పత్తో, ఏడుస్తున్నావా?"

"దేవదాదా! నదిలో ఇంత నీరు నిండి వుంది. ఇంత నీటిలో కూడా నా కళంకాన్ని కడుగుకోలేనా?"

అమాంతంగా దేవదాసు పార్వతి చేతులు రెండూ పట్టుకొని 'పార్వతీ!' అన్నాడు.

పార్వతి దేవదాసు పాదాలమీద తల పెట్టుకొని గద్గద కంఠంతో "ఇక్కడే నాకు కొంచెం స్థానం ఇవ్వు దేవదాదా!" అన్నది.

తరువాత ఇద్దరూ మౌనం వహించారు. దేవదాసు పాదాల మీదుగా ప్రవహించే అనేక అశ్రుకణాలు తెల్లగా వున్న ఆ శయ్యను తడుపుతూ వున్నాయి.

చాలా సేపటి తరువాత దేవదాసు పార్వతి ముఖాన్ని పైకి లేవనెత్తి "పత్తో! నేను తప్ప నీకు మరో ఉపాయం లేదా?" అన్నాడు.

పార్వతి ఇంకేమీ అనలేదు. అదే విధంగా అతడి పాదాల మీద తల వుంచుకొని పడి వుంది. ఆ స్తబ్ధతలో కేవలం దీర్ఘమైన నిశ్వాసాలు మాత్రం విడుస్తూ వుంది. 'టన్ టన్' అంటూ గడియారం రెండు గంటలు కొట్టింది. "పత్తో!" అన్నాడు దేవదాసు.

"ఏమిటి" అన్నది పార్వతి రుద్ధ కంఠంతో.

"అమ్మా, నాన్నా బొత్తిగా అంగీకరించడం లేదు_ఈ సంగతి విన్నావా?"

పార్వతి తల ఊపుతూ 'విన్నాను' అన్నది. తరువాత ఇరువురూ మౌనం వహించారు. చాలా సేపటి తరువాత దేవదాసు దీర్ఘమైన నిట్టూర్పు విడిచి 'అయితే మరీ?....' అన్నాడు.

నీళ్ళల్లో మునిగినందు వలన మనిషి ఏ విధంగానైతే నేలను పట్టుకోగలడో, ఇక దాన్ని ఏ విధంగానూ వదలదలచుకోడో సరీగా అదే విధంగా పార్వతి అప్రయత్నంగానే దేవదాసు పాదాలు రెండూ పట్టుకొని వుంది. అతడి ముఖం వైపు చూసి "నేను ఏమీ తెలుసుకోదలచలేదు దేవదాదా!" అన్నది.

"పత్తో! తల్లి దండ్రులను అవమానించుదామా?"

దోషం ఏముందీ?"

"అప్పుడు నీవు ఎక్కడ ఉంటావు?"

"నీ పాదాల దగ్గర!" అన్నది పార్వతి ఏడుస్తూ.

తరువాత ఇద్దరూ స్తబ్ధులై కూర్చున్నారు. గడయారంలో నాలుగు గంటలవుతూ వుంది. అది గ్రీష్మకాలపు రాత్రి. త్వరగా తెల్లవారుతుందని తెలుసుకొని దేవదాసు పార్వతి చేయి పట్టుకొని "పద! మీ ఇంటికి పంపించి వస్తాను" అన్నాడు.

"నా వెంట వస్తావా?"

"హాని యేముంది? అవమానం కలిగితే అప్పుడేదయినా ఉపాయమైనా లభిస్తుందేమో!"

"అయితే పద!"

ఇరువురూ నెమ్మదిగా బయటికి వెళ్ళిపోయారు.

## 7

మరుసటి రోజు తండ్రికీ దేవదాసుకూ మధ్య కొంచెం సేపు సంభాషణ జరిగింది. "నీవు మొదటినుంచీ నన్ను వేధిస్తూనే వస్తున్నావు. నేను యీ ప్రపంచంలో ఎన్ని రోజులు బ్రతికి వుంటానో అన్ని రోజులు ఈ విధంగానే వేధిస్తూ ఉంటావు. నీ నోటినుంచి ఇటువంటి మాట రావడంలో ఆశ్చర్యమేమీలేదు" అన్నాడు తండ్రి.

దేవదాసు మౌనంగా తల వంచుకొని కూర్చొని వున్నాడు.

"నాకు దీనితో ఏమీ సంబంధం లేదు. మీ అమ్మతో సంప్రదించి ఇష్టం వచ్చినట్లు చేసుకో" అన్నాడు తండ్రి.

ఈ మాట విని దేవదాసు తల్లి "అరె, నాకు యీ గతికూడా వ్రాసి పెట్టి వుందన్న మాట!" అన్నది.

అదే రోజు దేవదాసు పెట్టె, బేడా సర్దుకొని కలకత్తా వెళ్ళి పోయాడు. పార్వతి ఉదాసీనురాలై నీరసంగా నవ్వి మౌనం వహించింది. గతరాత్రి జరిగిన విషయం ఆమె యెవరితోనూ చెప్పలేదు. ప్రొద్దెక్కిన  తరువాత మనోరమ వచ్చి కూర్చున్నది. "పత్తో! దేవదాసు వెళ్ళిపోయాడని విన్నాను?" అన్నది.

"అవును."

"అయితే నీవు ఏమి ఉపాయం ఆలోచించావు? అన్నది. ఉపాయం సంగతి ఆమెకే తెలియదు, ఇక ఇతరులతో ఏమి చెప్పగలదు? ఇప్పటికి అనేక రోజుల నుంచి ఆమె వరసగా అదే విషయం ఆలోచిస్తూ వున్నది. ఆశ యెంతో, నిరాశ యెంతో ఏ విధంగానూ ఆమె స్థిరపరచుకోలేక పోయింది. ఎప్పుడయితే మనిషి ఇటువంటి దుఃఖపు సమయంలో ఆశ_నిరాశల అంచులు చూడకపోతే అతడి దుర్బర హృదయం అమితమయిన భయంతో ఆశ అంచునే పట్టుకుంటుంది. దేనిలోనయితే ఆ వ్యక్తికి శుభం వుంటుందో ఆ విషయాన్నే ఆశిస్తూ వుంటాడు. ఇష్టంతోగానీ, అయిష్టంతో గానే అటువైపే నిత్యం ఆసక్తితో చూస్తూ వుంటాడు. పార్వతికి యీ స్థితిలో నిన్నరాత్రి జరిగిన సంఘటన

కారణంగా నిశ్చితంగా ఆమె మనోరథం విఫలం కాదనే పూర్తిగా ఆశ వున్నది. విఫలమయినప్పుడు ఆమె గతి ఏమవుతుందో అది ఆమె ఆలోచనకు అతీతమయిన విషయం. అంచేతనే దేవదాసు తిరిగి వస్తాడని ఆమె భావిస్తుంది. మళ్ళీ నన్ను పిలిచి "పత్తో! నిన్ను నా శక్తి వున్నంత వరకూ యితరుల చేతిలోనికి పోనివ్వను" అని చెపుతాడనుకున్నది. అయితే రెండురోజుల తరువాత పార్వతి యీ దిగువ ఉదాహరించిన ఉత్తరం అందుకున్నది.

"పార్వతీ, ఇప్పటికి రెండు రోజుల నుంచి నీ విషయాలే నిరంతరం ఆలోచిస్తున్నాను. నీతో నా పెళ్ళి జరగడం అమ్మకూ, నాన్నకూ ఎవరికీ యిష్టంలేదు. నిన్ను సుఖ పెట్టడం కోసం వాళ్ళకు అమితమయిన వేదనను కలిగించవలసి వస్తుంది. అది నాకు సాధ్యం కాదు. అంచేత వాళ్ళకు విరుద్ధంగా యీ పని ఎలా చేయగలను? బహుశా ఇక ముందు నీకు ఉత్తరం వ్రాయలేను. అంచేత యీ ఉత్తరంలో అన్ని విషయాలూ స్పష్టంగా వ్రాస్తున్నాను. నీ వంశం హీనమైనదనీ, కన్యను అమ్ముకొనేదనీ, కన్యను కొనుక్కొనేదనీ అటువంటి వంశం వాళ్ళ ఇంటి పిల్లను అమ్మ ఏ విధంగానూ తన ఇంటికి కోడలుగా తెచ్చుకొనడానికి ఇష్టపడటం లేదు. పైగా మా ఇంటి ప్రక్కనే మీ యిల్లు వుండటం కూడా వాళ్ళ ఉద్దేశ్యం ప్రకారం మంచిది కాదు. ఇక నాన్నగారి విషయమంటావా, అదంతా నీకు తెలిసే వుంది. ఆనాటి రాత్రి సంభవించిన విషయం తలపుకొస్తుంటే నాకు చాలా దుఃఖం కలుగుతూ వుంది. నీవంటి ఆత్మాభిమానం కలిగినటువంటి బాలిక ఎంత వ్యధ అనుభవిస్తే ఆ పని చేసి వుంటుందో నాకు బాగా తెలుసు.

మరో విషయం వుంది. నిన్ను నేను ఎప్పుడైనా ప్రేమించానా అనే విషయం నా మదిలో మెదలడం లేదు. ఇప్పుడు కూడా నీకోసం నా హృదయంలో అపరిమితమైన దుఃఖం ఏమీలేదు. కేవలం నీవు నాకోసం కష్టాలు అనుభవిస్తున్నావనే నాకు దుఃఖంగా వుంది. నన్ను మరచి పోవడానికి ప్రయత్నించు. అలా మరచిపోవడంలో నీవు సఫలత పొందగలవని నేను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను.

__దేవదాసు"

దేవదాసు ఉత్తరం లెటర్ బాక్స్ లో వేయనంతవరకూ కేవలం ఒకే విషయం ఆలోచిస్తూ వున్నాడు. కాని ఉత్తరం పోస్ట్ చేసిన తరువాత రెండో విషయం ఆలోచిస్తూ వున్నాడు. చేతిలోని రాయి విసిరేసి రెప్ప వాల్చకుండా అటువైపే చూస్తూ వున్నాడు. ఏదో అనిష్టం కలుగుతుందనే భయం అతడి మనసులో నెమ్మదిగా పెరిగిపోతూ వుంది. యీ విసిరినరాయి పోయి ఆమె తలకు ఎలా తగులుతుందా అని ఆలోచిస్తున్నాడు. ఏం, తీవ్రంగా తగులుతుందా?

ప్రాణాలతో బ్రతుకుతుంది గదా....? ఆ రాత్రి నా పాదాలమీద తల పెట్టుకుని ఆమె ఎంతగానో యేడ్చింది. పోస్ట్ ఆఫీస్ నుండి మెస్ కు తిరిగి వచ్చేటప్పుడు దారిలో అడుగడుగుకూ దేవదాసు మనసులో యీ భావమే చెలరేగుతూ వుంది. యీ చేసిన పని బాగాలేదా? అన్నిటి కన్నా, గొప్ప విషయం ఏమిటంటే పార్వతిలో ఏమీ దోషం లేనప్పుడు తల్లిదండ్రులు ఎందుకు నిషేధిస్తున్నారు? అని ఆలోచిస్తున్నాడు.వయసు పెరగడంతో పాటు కలకత్తా నివాసం ద్వారా అతడు ఒక విషయం నేర్చుకున్నాడు. అదేమిటంటే కేవలం జనానికి చూపించడం కోసం కుల గౌరవం మీద, మరో క్షుద్రమైన ఉద్దేశ్యం మీద ఆధారపడి వ్యర్థంగా ఒక నిండు ప్రాణాన్ని నాశనం చేయడం ఉచితమైన పనికాదు. ఒకవేళ పార్వతి తన హృదయ జ్వాలలను శాంతింపచేసుకోవడం కోసం ఏ ప్రవాహంలోనైనా మునిగి ప్రాణాలు తీసుకుంటే ఆ విశ్వేశ్వరుని పాదంలో ఈ మహాపాతకం ఓ నల్లని మచ్చగా నిలిచిపోదా?

మెస్ లోకి వచ్చి దేవదాసు తన మంచంమీద పడివున్నాడు. ప్రస్తుతం ఆయన ఒక మెస్ లో వుంటున్నాడు. అనేక రోజుల క్రిందటే మేనమామ ఇల్లు వదిలేశాడు....అక్కడ ఆయనకు కొన్ని అసౌకర్యాలు వుంటున్నాయి. ఇక్కడ దేవదాసు వుంటున్న గదికి ప్రక్కగదిలో చున్నీలాల్ అనే యువకుడు ఇప్పటికి తొమ్మిది సంవత్సరాల నుంచి నివసిస్తున్నాడు. ఆయనగారి దీర్ఘకాలపు ఈ కలకత్తా నివాసం బి.ఏ. పరీక్ష ప్యాస్ కావడం కోసం. కాని ఇప్పటికీ మనోరథం సఫలం కాలేదు. ఈ మాటే అంటూ అతడు ఇప్పుడుకూడా ఇక్కడే వుంటున్నాడు. చున్నీలాల్ తన నిత్యకృత్య మైన సాయంకాలపు షికారు కోసం బయటికి బయలుదేరాడు. ఇతరులు కూడా ఇంకా రాలేదు. నౌకరు దీపం వెలిగించి వెళ్ళిపోయాడు. దేవదాసు తలుపు వేసుకుని నిద్రపోయాడు.

ఒక్కొక్కరే వస్తూ క్రమంగా అంతా తిరిగి వచ్చారు. భోజనం చేసేటప్పుడు దేవదాసును పిలిచారు. కాని ఆయన లేవలేదు. చున్నీలాల్ ఏ రోజు కూడా రాత్రిపూట వసతి భవనానికి తిరిగి రాలేదు. అలాగే ఈ రోజు కూడా తిరిగి రాలేదు.

రాత్రి ఒంటిగంట అయింది. వసతి భవనంలో దేవదాసు తప్ప ఎవరూ మేల్కొని వుండరు. చున్నీలాల్ వసతి భవనానికి తిరిగి వచ్చి దేవదాసు గది ముందు నిలబడి చూశాడు. తలుపు వేసేవుంది. కాని దీపం మాత్రం వెలుగుతూ వుంది. పిలిచాడు__

"దేవదాస్, ఇంకా మేల్కొనే వున్నావా యేం?"

దేవదాసు లోపలనుంచి "మేల్కొనే వున్నాను. నీవు ఈ రోజు ఈ సమయంలో ఎలా తిరిగొచ్చావు?" అన్నాడు.

"చున్నీలాల్ కొంచెం నవ్వుతూ "అవును, ఈ రోజు ఆరోగ్యం బాగాలేదు" అని చెప్పి వెళ్ళిపోయాడు. కొంచెం సేపటి తరువాత మళ్ళీ తిరిగి వచ్చి_"దేవదాస్, ఓసారి తలుపు తీయగలవా?" అన్నాడు.

"ఎందుకు తీయను?

"నీ దగ్గర పొగాకు యేర్పాటు వుందా?"

"అవును, వుంది" అని చెప్పి దేవదాసు తలుపు తెరిచాడు.

చున్నీలాల్ పొగాకు నింపుకుంటూ "దేవదాస్, ఇప్పటిదాకా ఎందుకు మేల్కొని వుంటావ్?" అన్నాడు.

"ఏం? రోజూ నిద్ర వస్తుందా?"

"రావడం లేదా?" అని కొంచెం పరిహాసంగా "నీ లాంటి మంచి కుర్రవాడు అర్థరాత్రి ముఖం ఎప్పుడూ చూచి వుండడూ అని ఈనాటి వరకూ అనుకుంటూ వుండేవాణ్ని. కాని ఈ రోజు ఓ కొత్త బోధ లభ్యమయింది" అన్నాడు.

దేవదాసు ఏమీ అనలేదు. చున్నీలాల్ పొగ త్రాగుతూ "నీవు ఈ సారి ఇక్కడకు వచ్చినప్పటినుంచీ నీ ఆరోగ్యం బాగా వుండటం లేదు. నీకు వున్న దుఃఖం ఏమిటి?" అన్నాడు.

దేవదాసు అన్యమనస్కుడై వున్నాడు. ఆయన ఏమీ జవాబివ్వలేదు.

"ఆరోగ్యం బాగాలేదా?"

దేవదాసు హఠాత్తుగా ప్రక్కమీది నుంచి లేచి కూర్చున్నాడు. వాక్యులంగా అతడి ముఖంవైపు చూసి.... "సరే చున్నీబాబూ, నీ హృదయములో ఏ విషయంలోనూ దుఃఖం లేదా?" అన్నాడు.

"చున్నీలాల్ నవ్వి "ఏమీ లేదు" అన్నాడు.

"నీ జీవితంలో ఎన్నడూ దుఃఖం అనేది కలగలేదా?"

"ఈ విషయం ఎందుకు అడుగుతున్నావు?"

"నాకు వినాలనే అభిలాష వుంది."

"అలా అయితే ఎప్పుడైనా మరో రోజు విను."

"సరే చున్నీ, నీవు రాత్రంతా ఎక్కడుంటావు?" అడిగాడు దేవదాసు.

"తెలుసు కాని బాగా తెలియదు."

చున్నీలాల్ ముఖం ఉత్సాహంతో వెలిగిపోయింది. ఈ ఆలోచనల్లో మరేమైనా వున్నా లేకపోయినా ఒక మూల సిగ్గు అనేది దాగివుంది. దీర్ఘకాలపు అభ్యాసం వల్ల ఆ కొంచెం కూడా తొలగిపోయింది. కుతూహలంగా కళ్ళు మూసుకుని "దేవదాస్ ఒకవేళ బాగా తెలుసుకో దలచుకుంటే సరీగా నాలాగే తయారు కావలసి వస్తుంది. రేపు నా వెంట వస్తావా?" అన్నాడు.

దేవదాసు కొంచెం సేపు ఆలోచించి "అక్కడ బాగా మనస్సుకు వినోదం లభిస్తుందని విన్నాను. ఇది నిజమేనా?" అన్నాడు.

"అక్షరాలా నిజం!"

"అలా అయితే నన్ను ఓసారి తీసుకొని వెళ్ళు. నేను కూడా వస్తాను!"

రెండవరోజు సాయంత్రం చున్నీలాల్ దేవదాసు గదిలోకి వచ్చి చూశాడు. ఆయన పెట్టే బేడా అన్నీ సర్దుకొని కట్టగట్టుకొంటున్నాడు. ఆశ్చర్యపోయి "ఏం రావడం లేదా?" అన్నాడు.

దేవదాసు ఏ వైపుకూ చూడకుండా "అవును, వస్తాను" అన్నాడు.

"అయితే ఇదంతా ఏమిటీ?"

"అదే, వెళ్ళడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాను" అన్నాడు.

చున్నీలాల్ కొంచెం నవ్వి ఆలోచించాడు. "మంచి యేర్పాటే! ఏమిటి ఇల్లు వాకిలీ అంతా తెచ్చి అక్కడ పెడతావా?" అన్నాడు.

"అయితే ఎవరి దగ్గర వదిలిపెట్టి వచ్చేది?"

చున్నీలాల్ కేమీ అర్థం కాలేదు. "నేను నా వస్తువులు ఎవరి దగ్గర వదిలి పెడుతున్నాను? అన్నీ ఈ వసతి భవనంలోనే పడి వుంటున్నాయి" అన్నాడు.

దేవదాసు హఠాత్తుగా తెలివి తెచ్చుకొని కళ్ళు పైకెత్తాడు. సిగ్గుపడి "చున్నీ బాబూ, ఈ రోజు నేను ఇంటికి వెళుతున్నాను" అన్నాడు.

"ఇదేమిటి? ఎందుకు? ఎప్పుడొస్తావు?"

"ఇక నేను తిరిగి రాను" అన్నాడు దేవదాసు తల వూపుతూ.

విస్తుబోయి చున్నీలాల్ అతడి ముఖం వైపే చూస్తూ వున్నాడు.

"ఈ డబ్బు తీసుకో! నేను ఎవరికైనా, ఏమైనా ఇవ్వవలసి వుంటే అవన్నీ ఇచ్చేసెయ్. ఏమయినా మిగిలితే పనివాళ్ళకు పంచిపెట్టు. ఇహ నేను మళ్ళీ ఎన్నడూ కలకత్తాకు తిరిగి రాను" అన్నాడు దేవదాసు.

"కలకత్తాకు రావడం వలన నాకు చాలా ఖర్చయింది" అని దేవదాసు లోలోపల అనుకుంటూ వున్నాడు.

ఈనాడు అతని దృష్టి యౌవనపు పొగమంచు తెరను కప్పుకొని వున్న అంధకారపు పొరను చీల్చుకొని పొగలిగింది. అదే, ఆ ప్రచండమైన, ప్రబలమైన, కిశోరావస్థలో వున్న, అయాచితంగా వచ్చిన ఆ రత్నం కాళ్ళ క్రింద నలగద్రొక్క బడిన ఆ రత్నం కలకత్తా మహానగర మంతటితో పోల్చిచూస్తే చాలా గొప్పదిగానూ, చాల విలువైనదిగానూ కన్పిస్తూ వుంది. చున్నీలాల్ ముఖం వైపు చూసి అన్నాడు_"చున్నీ! విద్య, బుద్ధి, జ్ఞానం, బోధ, వికాసం మొదలైనవన్నీ సుఖం కోసమే వున్నాయి. నీవు కోరిన పద్ధతిలో చూడు, తమ సౌఖ్యాన్ని పెంచుకొనడానికి తప్ప వీటన్నిటి ప్రయోజనం మరేమైనా వుందంటావా? ఏమీలేదు."

చున్నీలాల్ మధ్యలోనే మాట నాపి "అయితే నీవు చదువు మానేస్తావా?" అన్నాడు.

"అవును, చదువుకొనడం వలన నాకు నష్టం కలిగింది. ఇన్ని రోజుల నుంచి, ఇంత ధనం ఖర్చుపెట్టి, ఇంతే నేర్చుకొనగలగననే విషయం నేను ముందుగానే తెలుసుకొనగలిగి వున్నట్లయితే ఎన్నడూ ఈ కలకత్తా మొహం చూసేవాణ్ని కాదు."

"దేవదాస్, నీకేమయ్యింది? ఏమిటి ఇలా మాట్లాడుతున్నావు?"

దేవదాసు కూర్చొని ఆలోచిస్తూ వున్నాడు. కొంచెం సేపటి తరువాత "ఒకవేళ మళ్ళీ ఎప్పుడైనా కలుసుకోవడం సంభవిస్తే అప్పుడు అన్ని విషయాలూ

చెప్పేస్తాను" అన్నాడు.

అప్పుడు దాదాపు రాత్రి తొమ్మిది గంటలవుతూ వుంది. వసతి భవనంలోని విద్యార్థులూ, చున్నీలాల్ అందరూ అత్యంత విస్మయంతో చూశారు. దేవదాసు తన సామానంతా బండిమీద వేసుకుని వసతి భవనం వదిలిపెట్టి శాశ్వతంగానే వెళ్ళిపోతున్నట్లుగా వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళి పోయిన తరువాత చున్నీలాల్ క్రోధంతో వసతి భవనంలోని ఇతర విద్యార్థులతో_"ఇటువంటి రంగు వేసుకొన్న జంబుకాల్లాంటి వ్యక్తులను ఏ విధంగానూ గుర్తించలేము" అన్నాడు.

8

తెలివి గలిగినటువంటి, దూరపు చూపు కలిగినటువంటి వ్యక్తుల విధానము అప్పటికప్పుడు ఏ విషయం మీదనైనా తమ దృడమైన అభిప్రాయాన్ని వ్యక్త పరిచేదిగా వుండదు. ఒకే పక్షాన్ని తీసుకొని విచారించరు. ఒకే పక్షాన్ని తీసికొని తమ నిశ్చయాన్ని స్థిరపరచుకోరు. రెండు పక్షాలనూ తీసికొని తులనాత్మక దృష్టితో పరీక్షిస్తారు. అప్పుడు ఏదయినా తమ గంభీరమైన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు. సరీగా ఇందుకు విరుద్ధంగా మరో శ్రేణికి చెందిన వ్యక్తులు వుంటారు. వీరికి ఏ విషయం మీదా ప్రత్యేకంగా ఆలోచించే ధైర్యం వుండదు. వీరు హఠాత్తుగా తమ అభిప్రాయాన్ని అది మంచిది కానివ్వండి లేక చెడ్డది కానివ్వండి స్థిరపరచుకొంటారు. ఏ విషయంలోనూ లోతుకు వెళ్ళి విచారించే శ్రమను వాళ్ళు స్వీకరించరు. కేవలం విశ్వాసం ఆధారంగానే నడుస్తారు. వీళ్ళు ప్రపంచంలో ఏ కార్యాన్నీ చేయలేరని కాదు. అవసరం వస్తే అప్పుడప్పుడు వీళ్లు ఇతరుల కన్నా ఎక్కువ కార్యాలనే చేస్తారు. భగవంతుని దయ వుంటే వీళ్ళు అభివృద్ధి మార్గంలో సర్వోన్నతమయిన శిఖరం మీద ఎక్కువగానే కన్పిస్తూ వుంటారు. లేకపోతే మాత్రం  లోతైన పతనపు లోయలో జీవితాంతం పడివుంటారు. లేవలేరు, కూర్చోలేరు, వెలుగు వైపు చూడలేరు, నిశ్చలంగా నిర్జీవులుగా, జలగండాల మాదిరిగా పడి వుంటారు. దేవదాసు కూడా యీ శ్రేణికి చెందిన మనిషే. మరుసటి రోజు ఉదయం ఆయన ఇంటికి చేరాడు. తల్లి ఆశ్చర్యంగా 'దేవా! కాలేజీకి సెలవలిచ్చారా?" అని అడిగింది.

దేవదాసు "అవును" అని చెప్పి అన్యమనస్కుడై వెళ్ళిపోయాడు. తండ్రి అడిగినా కూడా ఇటువంటి అర్థం లేని జవాబే చెప్పి తప్పించుకున్నాడు. ఆయనకు సరీగా అర్థంగాక గృహిణిని అడిగాడు. గృహిణి తన బుద్ధికి పదును పెట్టి "ఎండలు తగ్గలేదట, అంచేత మళ్ళీ సెలవలిచ్చారు" అని చెప్పింది.

రెండు రోజులు దేవదాసు చాలా చురుకుగా గడిపేశాడు. అతడి కోర్కె నెరవేరడం లేదు. పార్వతిని ఒంటరిగా

కలుసుకొనడానికి ఎక్కడా తటస్థ పడటం లేదు. రెండు రోజుల తరువాత పార్వతి తల్లి దేవదాసును ఎదురుగా చూసి "ఎటూ ఇక్కడకు రానే వచ్చావు, పార్వతి పెళ్ళి అయ్యేదాకా వుండు" అన్నది.

దేవదాసు "మంచిది, అలాగే" అన్నాడు.

మధ్యాహ్నం పూట పార్వతి రోజూ ఆనకట్ట దగ్గర నీళ్ళు తీసుకొని రావడానికి వెళుతూ వుంటుంది. ఇత్తడి బిందెను చంకన బెట్టుకుని యీ పుత్తడిబొమ్మ యీ రోజు కూడా రేవు దగ్గరకు వచ్చింది. చూసింది. అక్కడికి దగ్గరలోనే ఒక రేగు చెట్టుచాటున కూర్చొని దేవదాసు నీటిలోకి గాలం విసిరాడు. ఒకసారి ఆమె మనసులో తిరిగి పోదామనిపించింది. మరోసారి మౌనంగా నీళ్ళు ముంచుకు పోదామనిపించింది. అయితే తొందరలో ఆమె ఏదీ స్థిరపరచుకోలేకపోయింది. బిందె రేవు దగ్గర పెడుతున్న సమయంలో సహజంగానే కొంచెం చప్పుడు వినిపించింది. దానితో దేవదాసు దృష్టి అటువైపుకు మళ్ళింది. అతడు పార్వతిని చూసి సైగతో పిలిచి "పత్తో! మాట వినిపో" అన్నాడు.

పార్వతి నెమ్మదిగా దగ్గరకు వెళ్ళి నిలుచున్నది. దేవదాసు ఒక్కసారి ముఖం పైకెత్తాడు. మళ్ళీ చాలాసేపటి వరకు శూన్య దృష్టితో నదివైపే చూస్తూ వున్నాడు. "దేవదాదా, నాతో ఏమయినా చెపుతావా?" అన్నది పార్వతి.

దేవదాసు ఏ వైపుకూ చూడకుండా "రా, కూర్చో!" అన్నాడు.

పార్వతి కూర్చోలేదు. తల వంచుకొని నిలబడి వుంది. కాని కొంచెం సేపటివరకూ ఏమీ సంభాషణ జరగకపోవడంతో పార్వతి పార్వతి నెమ్మదిగా ఒక్కొక్క అడుగు రేవు వైపుకు వేస్తూ వుంది. దేవదాసు అకస్మాత్తుగా తల ఎత్తి ఆమెవైపు చూసాడు. "వినూ!" అన్నాడు.

పార్వతి తిరిగి వచ్చింది. అయినా దేవదాసు ఏమీ మాట్లాడలేదు. ఇది చూసి ఆమె మళ్ళీ తిరిగిపోయింది. దేవదాసు స్తబ్దంగా కూర్చొని వున్నాడు. కొంచెం సేపటి తరువాత మళ్ళీ చూశాడు. పార్వతి నీళ్ళు తీసికొని వెళ్ళడానికి సిద్ధపడుతూవున్నది. ఇది చూసి అతడు గాలం ప్రక్కన పడేసి రేవు పైకి వచ్చి నిలబడి "నేను వచ్చాను" అన్నాడు. పార్వతి కేవలం బిందె దించి ప్రక్కన పెట్టింది. ఏమీ మాట్లాడలేదు.

పార్వతి కొంచెం సేపు మౌనంగా నిలబడి వుంది. ఆఖరుకు అత్యంత మధురమైన స్వరంతో "ఎందుకూ?" అని అడిగింది.

"నీవు వ్రాయలేదా?"

"లేదు!"

"ఇదేమిటి పత్తో! ఆ రాత్రి విషయం మరచిపోయావా?"

"లేదు, కాని ఆ విషయంతో ఇక పనేముంది?"

ఆమె కంఠస్వరం తీవ్రంగానూ, పెళుసుగానూ వుంది. దేవదాసు దాని మర్మం తెలుసుకోలేకపోయాడు. "నన్ను క్షమించు. నేను అప్పుడు ఇంతగా అర్థం చేసుకోలేకపోయాను." అన్నాడు.

"ఇక మాట్లాడకు! ఈ మాటలన్నీ నాకు నచ్చవు."

"నేను ఏ విధంగానైనా సరే మా అమ్మా, నాన్నలను ఇష్టపడేటట్లు చేస్తాను. కేవలం నీవు....!"

పార్వతి దేవదాసు ముఖం వైపు ఒక్కసారి తీవ్రమయిన దృష్టితో చూసి "అమ్మా, నాన్నలు నీకే వున్నారా? నాకు లేరా? వారి యిష్టా యిష్టాలతో నాకేమాత్రం ప్రయోజనం లేదా?" అన్నది.

దేవదాసు సిగ్గుపడి "ఎందుకు లేదు పత్తో! అయితే వాళ్ళు ఇష్టపడ్డారు. కేవలం నీవు.....!"

"వాళ్ళు యిష్టపడ్డారని నీకు ఎలా తెలుసు? వాళ్ళు బొత్తిగా ఇష్టపడటంలేదు."

దేవదాసు నవ్వడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ__"అరే కాదు, వాళ్ళు యిష్టంగానే వున్నారు. ఈ విషయం నాకు బాగా తెలుసు. కేవలం నీవు....!"

పార్వతి మధ్యలోనే మాటనాపి తీవ్రమయిన స్వరంతో_"కేవలం నేను నీతో ఛీ....!" రెప్పపాటులో దేవదాసు రెండు కళ్ళు అగ్ని కణాల్లాగా మండిపోయాయి. అవరుద్ధ కంఠంతో అతడన్నాడు__"ఏం పార్వతీ! నన్ను మరచిపోయావా?"

మొదట పార్వతి కూడా కొంచెం ఉద్విగ్నురాలై మరో క్షణంలోనే మళ్ళీ నిగ్రహించుకొని శాంతంగా దృడమయిన స్వరంతో ప్రత్యుత్తర మిచ్చింది. "లేదు, ఎందుకు మరచిపోతాను? చిన్నతనం నుంచీ నిన్ను చూస్తూనే వస్తున్నాను. నాకు తెలివి వచ్చినప్పటినుంచీ నీకు భయపడుతూ వస్తున్నాను. ఆ భయాన్ని నాకు చూపించాలని వచ్చావా? అయితే నన్ను కూడా నీవు గుర్తించలేదా?" అని చెప్పి ఆమె నిర్భయంగా రెండు కళ్ళు పైకెత్తుకొని నిలబడింది.

మొదట దేవదాసు నోటి నుంచి మాట పెగలలేదు. తరువాత "ఎప్పుడూ నాకు భయపడుతూనే వచ్చావా? ఇంకేమీ లేదా?" అన్నాడు.

పార్వతి దృఢంగా "లేదు, ఇంకేమీలేదు" అన్నది.

"నిజమే చెపుతున్నావా?

అవును, నిజమే చెపుతున్నాను. నీ మీద నాకు శ్రద్ధా శక్తులు లేవు. నేను ఏ వ్యక్తి దగ్గరకు వెళుతున్నానో ఆ వ్యక్తి ధనవంతుడు. బుద్ధిశాలి, శాంతస్వభావుడు, దృఢమయినవాడు. ఆయన ధార్మికుడు. నా తండ్రి నా మేలు కోరేవాడు కావడం చేతనే నీ వంటి అజ్ఞానికి, మనస్సు నిలకడలేని వారికి, నీ వంటి ప్రచండుడైన వ్యక్తి చేతికి ఏ విధంగానూ నన్ను అప్పగించదలచుకోలేదు. నీవు నా దారి కడ్డంగా తప్పుకో!"

ఒకసారి దేవదాసు కొంచెం అటూ ఇటూ సంశయించాడు. ఒకసారి దారి వదిలేయడానికి కూడా సిద్ధపడ్డాడు. కానీ మళ్ళీ దృఢంగా ముఖం పైకెత్తి "నీకు ఇంత అహంకారమా?" అన్నాడు.

"ఎందుకుండదు? నీవు చేయగలవు. నేను చేయలేనా? నీకు రూపం ఉంది, గుణం లేదు. నాలో రూపమూ వుంది, గుణం కూడా వుంది....నీవు గొప్పవాడివి. కాని నా తండ్రి కూడా భిక్షకుడు కాదే! ఇంతే గాకుండా నేను స్వయంగా కూడా మీ అందరికన్నా ఏ అంశంలోనూ హీనంగా వుండను!"

దేవదాసు అవాక్కయి పోయాడు. పార్వతి మళ్ళీ అంటూనే వుంది, "నాకు హాని కలుగజేయగలనని అనుకొంటున్నావా? అవును, అంత అధికంగా కాకపోయినా తప్పకుండా కొంత హాని కలుగ జేయగలవు. అది నాకు తెలుసు. సరే, అదే కానివ్వు. నాకు కేవలం దారి మాత్రం ఇవ్వు."

దేవదాసు నిశ్చేష్టుడై పోయాడు. ఏ విధంగా హాని కలుగజేయగలను?" అన్నాడు.

పార్వతి తక్షణమే జవాబు చెప్పింది_"అపనింద వేసి అని నీవే అంటాను."

ఈ మాట విని దేవదాసు నెత్తిమీద పిడుగు పడిందా అన్నట్లుగా చూస్తూ వుండిపోయాడు. అతడి నోటినుంచి ఇదే మాట వచ్చింది__"అపనింద వేస్తానా, నేను?"

పార్వతి విషపు నవ్వు నవ్వుతూ అన్నది_"వెళ్ళు, ఇక మిగిలి పోయిన కాలమంతా నా పేరుకు కళంకాన్ని తెచ్చి పెడుతూ వుండు. ఆ రాత్రి నీ దగ్గరకు ఒంటరిగా వచ్చాను. ఈ విషయం నలువైపులా జనంలోవ్యాపింపజేస్తూ వుండు.

దీనితో నీ మనసుకు చాలా ఓదార్పు లభిస్తుంది." అని అంటూ అభిమానంతో, క్రోధంతో ఆమె పెదవులు వణుకుతూ వణుకుతూ ఒక్కసారి స్థిరపడిపోయాయి.

కాని దేవదాసు హృదయంలో క్రోధంతో, అవమానంతో అగ్ని పర్వతం బ్రద్దలయిందా అన్నట్లు భీషణమయిన అగ్ని రగులుతూ వుంది. అతడు అవ్యక్తంగా "అయితే అసత్యపు అపనిందను మోపితే నాకు ఓదార్పు లభిస్తుందా?" అదే సమయంలో గాలం కర్రను త్రిప్పి పట్టుకొని భయంకరమైన స్వరంతో "విను పార్వతీ, ఇంత రూపం వుండటం కూడా మంచిది కాదు. అహంకారం పెరిగిపోతుంది!" అని చెప్పి కొంచెం నెమ్మదిగా స్వరం తగ్గించి "చూడటం లేదా చంద్రుడు ఇంత అందంగా వున్నాడు" అంచేతనే అందులో నల్లని కళంకపు మచ్చ పడివున్నది. కమలం ఎంతో తెల్లగా వుంది. అంచేతనే అందులో నల్లని తుమ్మెదలు వున్నాయి. రా, నీ ముఖంలో కూడా కళంకపు గుర్తు పెడతాను" అన్నాడు.

దేవదాసు సహనం కోల్పోయాడు. గాలం కర్రను గట్టిగా పట్టుకొని విసురుగా పార్వతి తలమీద బాదాడు. తగలగానే తల ఎడమ కనుబొమ్మ క్రిందదాకా పగిలిపోయింది. క్షణంలో పార్వతి ముఖం అంతా రక్తంతో తడిసిపోయింది.

పార్వతి నేలమీద పడిపోయింది. "ఏం చేశావు దేవదాదా?" అన్నది.

దేవదాసు గాలం కర్రను ముక్కలు ముక్కలుగా విరిచి నీటిలో పారవేశాడు. "ఎక్కువగా ఏమీ లేదులే! కొంచెం తెగింది" అన్నాడు.

పార్వతి వ్యాకులంగా ఏడ్చింది_"అమ్మ బాబోయ్ దేవదాదా!"

దేవదాసు పల్చగా వున్న చొక్కాను చించి నీటిలో తడిపి కట్టుబడుతూ "బయటకు పత్తో, ఈ తేలికపాటి గాయం త్వరలోనే మానుతుంది. కేవలం మచ్చమాత్రం మిగిలి వుంటుంది. ఎవరైనా దీన్ని గురించి అడిగితే అబద్ధపు విషయమన్నా చెప్పు. లేకపోతే నీ కళంకపు విషయాన్ని వెల్లడించు!" అన్నాడు.

"అమ్మ బాబోయ్!"

"ఛీ! అలా అనకు పత్తో! వీడ్కోలు అందుకునే ఆఖరు రోజుల్లో కేవలం ఈ గుర్తు వేశాను. ఈ బంగారం లాంటి ముఖాన్ని అప్పుడప్పుడు అద్దంలో చూసుకుంటే....?" అని ప్రత్యుత్తరాన్ని కూడా ఆపేక్షించకుండానే దేవదాసు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

పార్వతి వ్యాకులంగా రోదిస్తూ "అబ్బా! దేవదాదా!" అన్నది.

దేవదాసు తిరిగి వచ్చాడు. అతడి కనుకొలుకుల్లో ఓ మూలన ఓ కన్నీటి బిందువు....చాలా స్నేహభావంతో "ఏం పత్తో?" అన్నాడు.

"ఎవరితోనూ చెప్పవద్దు."

దేవదాసు క్షణంలోనే లేచి నిలబడి, వంగి పార్వతి కేశాలు పైకి తీస్తూ ఆధరాలతో స్పృశించి "ఛీ! నీవేం పరాయిదానవా? బహుశా నీకు జ్ఞాపకం ఉండకపోవచ్చు. చిన్నతనంలో నేను అల్లరి చేస్తూ అనేకసార్లు నీ చెవులు మెలిపెట్టేవాణ్ణి" అన్నాడు.

"దేవదాదా! నన్ను క్షమించు."

"ఇది నీవు చెప్పవలసిన పనిలేదు. నిజంగానే నన్ను మరచిపోయావా పత్తో? నేను నిన్ను ఎప్పుడు క్షమించలేదు?"

"దేవదాదా....!"

"పార్వతీ నీకు తెలిసే వుంది. నేను ఎక్కువగా మాటలు చెప్పలేను. ఏ పనీ నేను బాగా ఆలోచించి చేయలేను. నా మనసులో ఏది చేయాలనిపిస్తే అది చేసి కూర్చుంటాను." ఇలా అని దేవదాసు పార్వతి తలమీద చేతిని వుంచి ఆశీర్వదిస్తూ "నీవు మంచిపనే చేశావు. నా దగ్గర వుండి నీవు బహుశా సుఖాన్ని పొందలేవు. కానీ యీ దేవదాసుకు తిరుగులేని స్వర్గసుఖం లభిస్తుంది."

ఇదే సమయంలో ఆనకట్టకు ఆవలివైపు నుంచి అనేక మంది మనుసులు వస్తూ వున్నారు. పార్వతి నెమ్మదిగా నీళ్ళు ముంచుకొనడానికి దిగింది. దేవదాసు వెళ్ళిపోయాడు. పార్వతి ఇంటికి తిరిగి వచ్చేసరికి ప్రొద్దువాలిపోయింది. నాయనమ్మ ఆమెను చూసి "పత్తో, చెరువు నీళ్ళు ఏమైనా తెస్తున్నావా?" అన్నది.

అయితే ఆమె నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది. పార్వతి ముఖం వైపు చూడగానే "ఓయ్ బాబోయ్! ఇదేమిటీ? ఏం జరిగిందీ?" అని అరిచింది.

గాయం నుంచి ఇప్పటికీ రక్తం కారుతూనే వుంది. దాదాపు గుడ్డ ముక్క అంతా బహుశా రక్తంతో తడిసిపోయింది. ఆమె ఏడుస్తూ "అమ్మ బాబోయ్, పత్తో నీ పెళ్ళే!"

పార్వతి స్థిమితంగా బిందె దించి క్రింద పెట్టింది. తల్లి వచ్చి ఏడుస్తూ "ఈ దెబ్బ తగిలింది" అన్నది పార్వతి సహజ భావంతో.

ఆ తరువాత అందరూ కలిసి ఆమెకు శుశ్రూష చేస్తూ వున్నారు. గాయం పెద్దది కాదని దేవదాసు చెప్పినది నిజమే. నాలుగైదు రోజుల్లో అది మానిపోయింది. ఇలా పది రోజులు గడిచిపోయాయి. తరువాత ఒక రోజు రాత్రిపూట హథీపోతా

గ్రామంనుంచి జమీందారు భువన్ మోహన్ చౌదరీ వరుడుగా వివాహం చేసుకొనడానికి వచ్చాడు. వివాహ మహోత్సవం ఆడంబరం గానీ, ఆర్భాటం గానీ లేకుండా జరిగిపోయింది. భువన్ తెలివితక్కువ మనిషి కాడు. ఈ ప్రౌఢావస్థలో రెండో వివాహం చేసుకొనే సమయంలో కుర్రవాడుగా రావడం ఉచితం కాదని భావించాడు.

వరుడి వయస్సు నలభై మాత్రమే కాదు, కొంచెం పైనే వుంటుంది.గౌరవర్ణం. లావుగావున్నా దొండ శరీరం. నలుపు తెలుపుగా వున్న మీసాలు పులగంలాగా కనిపిస్తున్నాయి. తల బట్టతల అయిపోయింది. వరుణ్ని చూసి కొందరు నవ్వారు. కొందరు మౌనం వహించారు. భువన్ బాబు శాంతంగా గంభీరంగా వుండే ముఖంతో ఒక అపరాధిలాగా, వివాహ మండపంలోకి వచ్చి నిలబడ్డాడు. వివాహ మండపం దగ్గరలో కులదేవతను ప్రతిష్టించే చోట స్త్రీలు ఆయనతో పరిహాసమాడలేదు. కారణం, ఇటువంటి విజ్ఞుడయిన, గంభీరుడయిన మనిషితో సరసమాడే సాహసం ఎవరికీ కలగలేదు. శుభ దృష్టి సమయంలో పార్వతి క్రోధంతో పళ్ళు పటపట కొరుకుతూ చూస్తూ ఉంది. పెదవులమీద కొంచెం హాస్యరేఖ తొంగి చూసింది. భువనబాబు చిన్న పిల్లవాడి లాగా దృష్టిని క్రిందికి వాల్చుకున్నాడు. గ్రామీణ స్త్రీలు కిలకిలా నవ్వుతూ వున్నారు. చక్రవర్తి మహాశయుడు అటూ ఇటూ హడావుడి చేస్తూ వున్నాడు. ప్రవీణుడయిన అల్లుణ్ని పొంది ఆయన కొంచెం బిజీ అయిపోయాడు. జమీందారు నారాయణ ముఖోపాధ్యాయ ఈ రోజు కన్యాపక్షం తరపున నిల్చున్నాడు. కార్యనిర్వహణ అంతా ఆయనదే. ఆయన అనుభవజ్ఞుడయిన కార్యకర్త. ఏ రకమైన లోటూ జరగనివ్వలేదు. శుభ కార్యం చక్కగా నమస్తమయింది.

మరుసటి రోజు ప్రాతఃకాలం చౌదరి మహాశయుడు ఓ పెట్టెడు నగలు తీసి బయట పెట్టాడు. ఆ ఆభరణాలన్నీ పార్వతి శరీరం మీద ప్రకాశించాయి. తల్లి అదిచూసి కన్నీరు తుడుచుకొంది. దగ్గరగానే జమీందారిణీ నిలబడి వుంది. ఆమె స్నేహపూర్వకంగా 'ఈ రోజు కన్నీరు కార్చి అశుభం కలుగజేసుకోవద్దని' మందలించింది.

సాయంకాలం కొంచెం ముందుగా మనోరమ పార్వతిని ఒక గదిలోకి తీసికొని వెళ్ళి ఆశీర్వదించింది. "జరిగిందేమో జరిగిపోయింది. పూర్వం కన్న కన్న ఎంత సుఖంగా ఉంటావో ఇప్పుడు చూస్తావు" అన్నది.

పార్వతి కొంచెం నవ్వి 'ఆఁ ఉంటాను. యముడితో నిన్న కొంచెం పరిచయ మయిందిగా!' అన్నది.

"ఇదేం మాట?"

"సమయం వచ్చినప్పుడు అంతా చూస్తావు" మనోరమ మాటను మరోవైపుకు మలిపి, "నీకు ఇష్టమైతే ఒకసారి దేవదాసును తెచ్చి యీ బంగారం ప్రతిమను చూపించనా?" అన్నది.

పార్వతి రెచ్చిపోయింది__"తేగలవు అక్కా! ఒక్కసారి పిలుచుకొని తీసుకురాలేవా?" అన్నది.

మనోరమ కంఠస్వరం కంపించిపోయింది__"ఎందుకు పత్తో!"

పార్వతి చేతి ముసుగును తిప్పుతూ, తిప్పుతూ అన్యమనస్కురాలై ఒకసారి ఆయన పాదధూళిని తలమీద వేసుకొంటాను. ఈ రోజు వెళతాను గదా!" అన్నది.

మనోరమ, పార్వతిని కౌగలించుకొన్నది. తరువాత ఇరువురూ చాలా సేపటివరకూ రోదిస్తూ వున్నారు. సాయంకాలం అయింది. చీకటి పెరిగిపోయింది. నాయనమ్మ తలుపుతట్టి బయటినుంచే నన్ను "ఓ పత్తో! ఓ మనో, మీరు కొంచెం బయటికి రండి!" అన్నది.

అదే రాత్రి పార్వతి, భర్త ఇంటికి వెళ్ళిపోయింది.

9

మరి దేవదాసో? అతడు కలకత్తాలోని ఈడెన్ గార్డెన్ లో ఉన్న ఓ బెంచీమీద కూర్చొని రాత్రంతా గడిపేశాడు. అతడికి అమితమైన దుఃఖం కలిగిందనీ కాదు, లేక మార్మికమయిన వేదన కలిగిందనీ కాదు. అతడి హృదయంలో అదో అపరిచితమయిన ఉదాసీన భావం క్రమంగా ఘనీభవిస్తూ వుంది. నిద్రావస్థలో హఠాత్తుగా శరీరంలోని ఒక అవయవానికి పక్షవాతం వస్తే, మెలకువ వచ్చిన తరువాత ఆ అవయవం మీద ఎంత వెదికినా గూడా అది తన అదుపులో లేకపోవడంతో విస్తుబోయి స్తంభించిన మనస్సును ఎలాగయితే సారిచేసుకోవడం సాధ్యంకాదో, ఎంచేతనంటే అతడి జీవితమంతా తోడుగానూ, ఎప్పుడూ విశ్వసనీయంగానూ ఉండే అవయవం అతడి ఆహ్వానానికి ఏమీ ప్రత్యుత్తరమివ్వదో, నెమ్మదిగా తెలివి వచ్చి ఇప్పుడు ఆ అవయవం మీద తన అధికారం ఏమీ లేదనే జ్ఞానం క్రమంగా ఉత్పన్నమవుతుందో సరిగా అలాగే దేవదాసు కూడా,సమయానికీ, సంస్కృతికీ అకస్మాత్తుగా పక్షవాతం సంభవించడం వలన అవి అతడి నుంచి శాశ్వతంగా వేరయిపోయాయని క్రమంగా గ్రహిస్తూ వున్నాడు. ఇప్పుడు వాటి మీద అనుచితమయిన క్రోధాన్నీ, అభిమానాన్నీ ప్రదర్శించి ఏమీ చేయలేము. అధికమయిన అధికారం విషయం ఆలోచించడం

కూడా గొప్ప పొరపాటే అవుతుంది. అప్పుడే సూర్యోదయం అవుతూ వుంది. దేవదాసు నిలబడి ఎక్కడికి వెళదామా అని ఆలోచించాడు. కలకత్తాలోని అదే మెస్ లో అక్కడ చున్నీలాల్ ఉన్నాడనే విషయం హఠాత్తుగా గుర్తుకొచ్చింది. దేవదాసు అటువైపు వెళ్తూ వున్నాడు. దారిలో రెండుసార్లు ఎదురుదెబ్బలు తిన్నాడు. ఎదురుదెబ్బ తగిలి వ్రేలు చితకడం వలన రక్తంతో తడిసిపోయింది. దెబ్బతగలడం వలన దారిలో ఓ వ్యక్తిమీద పడబోయాడు. అతడు దేవదాసును త్రాగిన మైకంలో ఉన్నాడని భావించి అవతలకు ఒక్క త్రోపు త్రోశాడు. అదే విధంగా భ్రాంతిలోపడి, దారి తప్పి తిరుగుతూ, తిరుగుతూ సాయంకాలానికి మెస్ గేటువద్దకు వచ్చి నిల్చున్నాడు. ఆ సమయంలో చున్నీలాల్ టిప్ టాప్ గా ముస్తాబై బయటికి వెళ్ళబోతూ "ఇదేమిటి దేవదాస్?" అన్నాడు.

దేవదాసు మౌనంగా చూస్తూ వున్నాడు. "ఎప్పుడు వచ్చారు?" ముఖం వాడిపోయి వుంది. స్నానం, భోజనం ఇంతవరకూ ఏమీ కాలేదా?" అన్నాడు. దేవదాసు దారిలోనే కూలబడిపోయాడు. చున్నీలాల్ చేయి పట్టుకొని లోపలికి తీసుకొని వెళ్ళాడు. తన ప్రక్కమీద కూర్చోబెట్టి, శాంత పరచి "ఏమిటి విషయం దేవదాసూ?" అని అడిగాడు.

"నిన్ననే ఇంటి దగ్గర నుంచి వచ్చాను."

"నిన్నటి రోజంతా యెక్కడున్నావు? రాత్రి యెక్కడ ఉన్నావు?"

"ఈడెన్ గార్డెన్ లో."

"పిచ్చివాడివా ఏమిటీ? ఏమయ్యిందీ?"

"విని ఏం చేస్తావు?"

"కాదు, చెప్పు ఇప్పుడు ముందు తిండి తిను. నీ సామాను ఎక్కడ వున్నది?"

"ఏమీ తీసుకొని రాలేదు."

"సరే పోనివ్వు, ఇప్పుడే వెళ్ళి భోజనం చేసెయ్."

అప్పుడు చున్నీలాల్ బలవంతం పెట్టి భోజనం చేయించాడు. ప్రక్కమీద పడుకోమని ఆదేశిస్తూ, తలుపు వేస్తూ "ఇప్పుడు కొంచెం నిద్రించడానికి ప్రయత్నించు. నేను మళ్ళీ రాత్రిపూట వచ్చి నిన్ను లేపుతాను" అని చెప్పి ఆయన అప్పటికి వెళ్ళిపోయాడు. రాత్రి పది గంటలకు ఆయన వచ్చి చూశాడు. దేవదాసు ఆయన ప్రక్కమీద గాఢనిద్రలో వున్నాడు. అతణ్ణి మేల్కొలపలేదు. అతడికి ఓ కంబళి కప్పి, తాను క్రింద చాపమీద నిద్రపోయాడు. రాత్రంతా దేవదాసుకు

మెలకువ రాలేదు. తెల్లవారినా కూడా ఇంకా నిద్రపోతూనే వున్నాడు. పది గంటలకు లేచి కూర్చున్నాడు. "చున్నీలాల్! ఎప్పుడు వచ్చావూ?" అని అడిగాడు.

"ఇప్పుడే వచ్చాను."

"నీకేమీ ఇబ్బంది కలగలేదు కదా?"

"ఏమీలేదు!"

దేవదాసు కొంచెం సేపటివరకూ అతడి ముఖం వైపు చూసి "చున్నీబాబూ, నా దగ్గర డబ్బు ఏమీ లేదు. నీవు నాకు ఆశ్రయమిస్తావా?" అన్నాడు.

చున్నీలాల్ కొంచెం నవ్వాడు. దేవదాసు తండ్రి గొప్ప ధనవంతుడని ఆయనకు తెలుసు. అంచేత నవ్వుతూ "నేను ఆశ్రయమిస్తాను. మంచి సంగతే! నీ ఇష్టం వచ్చినన్ని రోజులు ఇక్కడ వుండు. ఏమీ చింతించవద్దు" అన్నాడు.

"చున్నీబాబూ, నీ ఆదాయం ఎంత?"

"నా ఆదాయం మామూలుదే! ఇంటివద్ద కొద్దిగా జమీందారీ వుంది. దానిని అన్నగారికి ఒప్పగించి, నేను ఇక్కడ ఉంటున్నాను. ఆయన ప్రతి నేలా డెబ్బది రూపాయలు లెక్కన పంపిస్తూ వుంటాడు. అందులో ఖర్చూ, నా ఖర్చూ చక్కగా వెళ్ళబుచ్చుకోవచ్చు."

"నీవు ఇంటికి ఎందుకు వెళ్ళవూ?"

చున్నీలాల్ మొహం అటు మలిపి "అనేక విషయాలు ఉన్నాయి" అన్నాడు.

దేవదాసు మరేమీ అడగలేదు. తరువాత భోజనానికి పిలుపు వచ్చింది. ఇరువురూ స్నానాలూ, భోజనాలూ ముగించుకొని వాళ్ళ గదిలోకి వచ్చి కూర్చున్నారు. "దేవదాస్! నాన్నగారితో ఏమయినా పోట్లాట జరిగిందా?" అని అడిగాడు.

"లేదు!"

"మరెవరితోనయినా?"

"లేదు" అని దేవదాసు జవాబిచ్చాడు.

దీని తరువాత చున్నీలాల్ కు అకస్మాత్తుగా రెండో విషయం గుర్తుకు వచ్చింది. "ఓహో, నీకింకా పెళ్ళి కాలేదు గదూ?" అన్నాడు.

అదే సమయంలో దేవదాసు ముఖం మలుపుకొని నిద్రపోయాడు. కొద్దిసేపటిలో దేవదాసు నిద్రపోయినట్లు చున్నీలాల్ గమనించాడు. ఇదే విధంగా

నిద్రిస్తూ, నిద్రిస్తూ మరో రెండు రోజులు గడిచిపోయాయి. మూడోరోజు ఉదయానికి దేవదాసు ఆరోగ్యవంతుడై లేచి కూర్చున్నాడు. అతడి ముఖం చూస్తుంటే అతణ్ణి ఆవరించిన ఆ దట్టమయిన నీడ చాలా వరకు తొలగిపోయినట్లుగా కన్పిస్తూ వుంది. " ఈరోజు నీ ఆరోగ్యం ఎట్లా వుంది?" అని చున్నీలాల్ అడిగాడు.

"పూర్వంకన్నా బాగున్నట్లు కన్పిస్తూ వుంది.సరే చున్నీబాబూ, రాత్రిపూట నీవు యెక్కడికి వెళుతున్నావు?" అన్నాడు. ఈ రోజు చున్నీలాల్ సిగ్గుపడి "అవును, నేను వెళుతున్నాను. కాని దేనిదేముందిలే! సరే ఈ రోజు కాలేజీకి వెళతావు గదూ?" అన్నాడు.

"లేదు, చదువు మానేశాను."

"ఛీ! ఇలా కూడా చేయవచ్చు. రెండు మాసాల తరువాత నీ పరీక్ష జరుగుతుంది. నీవు చదువులో అంత వెనకబడిన వాడివేమీ కాదు. ఈ సంవత్సరం పరీక్షకు కూర్చోరాదూ?"

"లేదు, చదువు మానేశాను."

"చున్నీలాల్ మౌనం వహించాడు. ఎక్కడికి వెళుతున్నావో చెప్పరాదూ? నీ వెంట నేను కూడా వస్తాను" అని దేవదాసు మళ్ళీ అడిగాడు.

చున్నీలాల్, దేవదాసు ముఖంవైపు చూసి "అది తెలిసికొని నీవు ఏం చేస్తావు? నేను అంత మంచి చోటుకేమీ వెళ్ళడంలేదు" అన్నాడు.

"మంచిది కానివ్వు, చెడ్డది కానివ్వు. దానితో సంబంధం ఏమిటి?" అని మనసులో అనుకున్నాడు. "చున్నీబాబూ, నన్ను వెంట తీసికొని వెళతావా, లేదా?" అన్నాడు పైకి.

"తీసుకువెళతాను. కాని నీవు రావద్దు."

"కాదు, నేను వస్తాను. ఒకవేళ నచ్చకపోతే నేను మళ్ళీ రాను. కానీ నీవు ఏ సుఖం ఆశతో నిత్యం నిరీక్షిస్తూ వుంటావో....ఏమయినా కానివ్వు, చున్నీలాల్ నేను ఖచ్చితంగా వస్తాను."

చున్నీలాల్ ముఖం మలుపుకొని కొంచెం నవ్వి__నా స్థితి! అని మనసులో అనుకొని "సరే పద" అన్నాడు పైకి.

సాయంకాలానికి కొంచెం ముందుగా ధర్మదాసు అవసరమయిన వస్తువులు, సామాను తీసికొని వచ్చాడు. దేవదాసును చూసి ఏడుస్తూ "దేవదాస్! ఇప్పటికి నాలుగు రోజుల నుంచి మీ అమ్మ ఎంతగానో ఏడుస్తున్నది" అన్నాడు.

"ఎందుకు ఏడుస్తున్నది?"

"ఎవరితోనూ చెప్పా పెట్టకుండా అకస్మాత్తుగా వచ్చేశావు" అని ఒక ఉత్తరం బయటికి తీసి చేతికిచ్చి "అమ్మగారి ఉత్తరం" అన్నాడు.

చున్నీలాల్ సంగతి తెలుసుకొనడానికి ఉత్కంఠతో చూస్తున్నాడు. దేవదాసు ఉత్తరం చదివి అక్కడ పెట్టేశాడు. తల్లి ఇంటికి రమ్మని ఎంతో బ్రతిమలాడుతూ వ్రాసింది. ఇంట్లో ఆమె ఒక్కతే దేవదాసు మానసిక స్థితిని, దుఃఖాన్ని కొంచెం కొంచెం వూహించుకోగలిగినది. ధర్మదాసు చేత చాటుగా కావలసినంత ధనం కూడా పంపించింది. ధర్మదాసు అదంతా దేవదాసు చేతికిచ్చి "దేవదాస్! ఇంటికి పోదాం పద" అన్నాడు.

"నేను రాను, నీవు తిరిగి వెళ్ళు."

రాత్రిపూట మిత్రులిద్దరూ మంచి దుస్తులు వేసుకొని, బాగా ముస్తాబై బయటికి బయలుదేరారు. దేవదాసు ప్రవృత్తి వీటన్నిటివైపు లేదు. కాని చున్నీలాల్ సాధారణ దుస్తులు ధరించి బయటికి వెళ్ళడానికి ఇష్టపడలేదు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఒక బాడుగు బండి చిత్ పుర్ లోని ఒక రెండంతస్థుల భవనం ముందుకువచ్చి నిలబడింది. చున్నీలాల్ దేవదాసు చేయి పట్టుకొని లోపలికి తీసికొని వెళ్ళాడు. ఆ గృహం యజమానురాలి పేరు చంద్రముఖి. ఆమె వచ్చి అతిధులిద్దరికీ స్వాగతం చెప్పింది. ఆ సమయంలో దేవదాసు శరీరమంతా మండిపోయింది. ఆయన ఇటీవల అనేక రోజులనుంచి తన అజ్ఞానంతో నారీ దేహపు నీడను కూడా ద్వేషించనారంభించాడు. ఇదంతా స్వయంగా అతడికి కూడా తెలియదు. చంద్రముఖిని చూడగానే హృదయంలో ఘనీభవించిన ద్వేషం దావానలంలాగా ప్రజ్వరించింది. చున్నీలాల్ ముఖం వైపు చూసి కనుబొమలు విరుచుకొని "చున్నీలాల్! ఎటువంటి చెడు ప్రదేశానికి తీసుకొని వచ్చావు?" అతడి తీవ్రమయిన స్వరాన్నీ, దృష్టినీ చూసి చంద్రముఖి, చున్నీలాల్ ఇరువురూ నిశ్చేష్టులైపోయారు. మరుక్షణంలోనే చున్నీలాల్ తనను తాను స్థిమితపరచుకొని, దేవదాసు చేయి పట్టుకొని మృదువుగా "పదండి, లోపలికి వెళ్ళి కూర్చోండి" అన్నాడు.

దేవదాసు ఏమీ మాట్లాడలేదు. గదిలోకి వెళ్ళి ప్రక్కమీద విషణ్ణ వదనంతో కూర్చున్నాడు. దగ్గరే చంద్రముఖి కూడా మౌనంగా కూర్చుండి పోయింది. దాసీ పొగాకు నింపి వెండితో కప్పబడిన కొబ్బరికాయ తెచ్చింది. దేవదాసు దానిని స్పృశించను గూడా స్పృశించలేదు. చున్నీలాల్ గాంభీర్యంగా కూర్చుని వున్నాడు. ఏం చేయాలో నిశ్చయించుకోలేక దాసీ చివరకు ఆ కొబ్బరికాయ చంద్రముఖి చేతికిచ్చి వెళ్ళిపోయింది. ఒకటి రెండు దమ్ములు లాగిన తరువాత దేవదాసు ఆమె ముఖం వైపు చూశాడు. హఠాత్తుగా అమితమయిన ఏవగింపుతో "ఎంత

అనాగరికురాలు! ఎంత సౌదర్యహీనురాలు" అన్నాడు.

ఇంతకు పూర్వం చంద్రముఖిని సంభాషణలో ఎవరూ ఓడించలేకపోయారు. ఆమెను నిశ్చేష్టురాలిని చేయడం చాలా కష్టమైన పనిగా వుండేది. దేవదాసు అంతరంగంలో ఘనీభవించిన సరళమైన, కఠినమైన ద్వేషపు పలుకు ఆమె హృదయంలో ములికిలాగా గుచ్చుకొన్నది. కాని కొంచెం సేపటి తరువాతనే ఆమె తనను నిగ్రహపరచుకొన్నది. అయితే  చంద్రముఖి నోటినుండి పొగ మాత్రం బయటికి రాలేదు. అప్పుడు చున్నీలాల్ చేతికి హుక్కాను అందించి ఆమె మరోసారి దేవదాసు ముఖం వైపు చూసింది. మళ్ళీ నిశ్శబ్దంగా కూర్చున్నది. ముగ్గురూ నిర్వికారులవుతున్నారు. మధ్య మధ్య కేవలం హుక్కా గుడగుడల శబ్దం మాత్రం వినిపిస్తున్నది. అది కూడా భయంతో కంపిస్తూ వుంది. మిత్రబృదంలో తర్కం ప్రారంభమైనపుడు అకస్మాత్తుగా నిరర్థకమైన కలహం రాగానే ఎలాగైతే ప్రతి ఒక్కరూ వ్యాకులంతోనూ, అలకతోనూ వున్న అంతఃకరణంతో "ఇదే!" అని చెపుతూ వుంటారో ఆ విధంగానే ముగ్గురు వ్యక్తులూ లోలోపల "ఇదే! ఇదెలా సంభవించింది?" అని చెప్పుకుంటూ వుంటారు.

ఏమయినా, ముగ్గురిలో ఎవరికీ కూడా ఆనందం లభించలేదు. చున్నీలాల్ హుక్కా అక్కడ పెట్టి క్రిందికి దిగివచ్చాడు. బహుశా అతడికి మరో పని దొరకలేదు. అంచేత గదిలో ఇప్పుడు ఇద్దరు వ్యక్తులే వుండిపోయారు. దేవదాసు తన ముఖం పైకెత్తి నీవు నిన్ను దర్శించినందుకు రుసుం తీసుకుంటావా?" అని అడిగాడు.

చంద్రముఖి వెంటనే ఏమీ జవాబివ్వలేదు. ఇప్పుడు ఆమె వయసు ఇరువది ఆరు సంవత్సరాలు. ఈ పది సంవత్సరాలలో ఆమెకు ఎంతోమంది విభిన్న స్వభావాలు గల వ్యక్తులతో ఘనిష్ఠమైన పరిచయం ఏర్పడింది. కాని ఇటువంటి అద్భుతమైన వ్యక్తిని ఒక్కరోజు కూడా కలుసుకోవడం జరగలేదు. కొంచెం అటూ ఇటూ గడిపి ఆమె అన్నది_"మీ పాదధూళి ఎప్పుడైతే పడిందో_!"

దేవదాసు ఆ మాట పూర్తి కానివ్వలేదు. మధ్యలోనే "పాదధూళి సంగతి కాదు, డబ్బు తీసుకొంటున్నావా?" అన్నాడు.

"అది తీసుకొనకపోతే మా పని ఎలా గడుస్తుంది?"

"చాలు_ఇదే వినదలచుకున్నాను." అని చెప్పి ఆయన పాకెట్ లో నుంచి ఒక నోటు తీశాడు. చంద్రముఖి చేతికిచ్చి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. ఒక్కసారి చూడను కూడా లేదు, ఎన్ని రూపాయలిచ్చాడు?"

"ఇంత త్వరగా వెళతావా?" అన్నది చంద్రముఖి వినయంగా.

దేవదాసు ఏమీ మాట్లాడలేదు వరండాలోకి వచ్చి మౌనంగా

నిలబడిపోయాడు.

చంద్రముఖికి ఆ ధనం తిరిగి ఇచ్చివేద్దామనే కోరిక ఒకసారి కలిగింది. కాని ఏదో తీవ్రమైన సంకోచం కారణంగా తిరిగి ఇవ్వలేకపోయింది. బహుశా ఆమెకు కొంచెం భయం కూడా కలిగి వుంటుంది. ఇది తప్ప ఆమెకు అనేక నిందలనూ, కళంకాలనూ, అవమానాలనూ సహించే అభ్యాసం వుంది. అంచేత ఉలుకూ-పలుకూ లేకుండా, స్పందన లేకుండా గడప వద్దే నిలబడి వుంది. దేవదాసు మెట్ల మీదగా క్రిందికి దిగిపోయాడు.

మెట్ల దగ్గరే చున్నీలాల్ ను కలుసుకున్నాడు. "ఎక్కడికి వెళ్తున్నావు?" అని అతడు ఆశ్చర్యంగా అడిగాడు.

"వసతి భవనానికి."

"ఎందుకు?"

దేవదాసు ఇంకా రెండు మూడు మెట్లు దిగిపోయాడు.

"నేను కూడా వస్తున్నాను" అన్నాడు చున్నీలాల్.

దేవదాసు దగ్గరకు వచ్చి అతడి చేయి పట్టుకుని "అయితే పద! కొంచెం ఇక్కడే నిలబడి వుండు. నేను పైకి వెళ్ళి ఇప్పుడే తిరిగివస్తాను" అన్నాడు.

"లేదు, నేను వెళ్తున్నాను. నీవు తరువాత రావచ్చు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

చున్నీలాల్ పైకి వెళ్ళి చూశాడు. అప్పుడు కూడా చంద్రముఖి అదే విధంగా గడపవద్ద నిలబడి వుంది.

అతణ్ణి చూసి "ఆయన వెళ్ళిపోయాడా?" అని అడిగింది.

"అవును!"

చంద్రముఖి చేతిలోని నోటు చూపించి "ఇది చూడు. దీన్ని తీసుకొని వెళ్ళు, బాగుంటుంది. నీ మిత్రునికి తిరిగి ఇచ్చేసెయ్ అన్నది.

"ఆయన తన ఇష్టంమీదే ఇచ్చి వెళ్ళాడు. మళ్ళీ నేను ఎందుకు తిరిగి తీసికొని వెళ్ళేది?" అన్నాడు చున్నీలాల్.

ఇంత సేపటి తరువాత చంద్రముఖి కొంచెం నవ్వింది. అయితే నవ్వులో ఆనందం లశ మాత్రం కూడా లేదు. ఇష్టంమీద ఇవ్వలేదు. నేను డబ్బు తీసుకుంటున్నాను. ఇందువల్ల కోపగించి ఇచ్చి వెళ్ళాడు. అవును చున్నీబాబూ,

అతడేమైనా పిచ్చివాడా?"

"ఏమీ కాదు. ఈ మధ్య అనేక రోజుల నుంచి అతడి మనస్సు బాగా వుండటం లేదు."

"మనసు ఎందుకు బాగా వుండలేదో అదేమైనా తెలుసా?"

"నాకు తెలియదు. బహుశా ఇంటిదగ్గర ఏదో జరిగింది."

"అటువంటప్పుడు ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చావు?"

"నేను తీసుకురాలేదు. అతడే స్వయంగా బలవంత పెట్టి వచ్చాడు."

చంద్రముఖి ఈసారి యదార్థంగా విస్తుబోయింది. "స్వయంగా బలవంత పెట్టి వచ్చాడా? అంతా తెలిసివుండి!"

చున్నీలాల్ కొంచెం ఆలోచించి "లేకపోతే యేమిటి? ఆయనకు అన్నీ తెలుసు. నేను మరపించి తీసుకురాలేదు!"

చంద్రముఖి కొంచెం సేపటి వరకూ మౌనంగా వుంది. మళ్ళీ ఆలోచించుకొన్నదో, తెలియదు. చున్నీ! నాకు ఒక ఉపకారం చేసి పెడతావా?" అన్నది.

"ఏమిటీ?"

"నీ మిత్రుడు యెక్కడ వుంటున్నాడు?"

"నాతోనే!"

"అయితే ఒకరోజు మళ్ళీ తీసుకొనిరాగలవా?"

"ఇది నేను చేయలేను. ఇంతకు పూర్వం ఆయన ఇటువంటి చోటుకు ఎక్కడికీ వెళ్ళలేదు. ఇక భవిష్యత్తులో కూడా ఇటువంటి చోటుకు ఎక్కడికీ వెళ్తాడనే ఆశ కూడా లేదు. యెందుకు? ఈ విషయం చెప్పు!"

చంద్రముఖి ఒక మాలిన్యపు నవ్వు నవ్వి "చున్నీ! ఎలాగయినా సరే, మరోసారి ఆయన్ని తీసికొనిరా" అన్నది.

చున్నీ చిరునవ్వు నవ్వి, ఆమెకు కన్నుగొట్టి "దబాయించి నందు వలన ఎక్కడైనా ప్రేమ ఉత్పన్నమయిందా యేం?" అన్నాడు.

చంద్రముఖి కూడా చిరునవ్వు నవ్వి_"చూడలేదు, నోటు యిచ్చి వెళ్ళారు. ఈ మాత్రం కూడా తెలుసుకోలేవా?"

చున్నీ, చంద్రముఖిని కొంచెం గుర్తెరిగే వున్నాడు. తల వూపుతూ "కాదు-కాదు, నోటు తీసుకునేది వేరే వుంటుంది. నీవు అటువంటి దానివి కావు. నిజం సంగతి యేమిటో చెప్పు?"

సత్యమైన మాట యేమిటంటే అతడి వైపుకు మనసు లాగుతూ వుంది.

చున్నీ విశ్వసింపలేదు. నవ్వి ఈ కొద్ది సేపటిలోనా?

ఈసారి చంద్రముఖి కూడా ఫక్కున నవ్వింది_"ఇది జరగనివ్వు. మనసుకు స్వస్థత చేకూరిన తరువాత మరోసారి తప్పకుండా తీసుకొనిరా! మరోసారి చూస్తాను. తీసుకొస్తావు కదూ?" అన్నది.

"చెప్పలేను."

"నా తలమీద ఒట్టు వేసుకో!" అన్నది.

"సరే, ప్రయత్నిస్తాను."

## 10

పార్వతి వచ్చి చూసింది. తన భర్త భవనం ఓ పెద్ద రాజభవనం లాగుంది. కొత్తగా దొరల పద్ధతిలో కట్టినది కాదు. పురాతన పద్ధతిలో కట్టిన కట్టడం. ముఖ్య భవనం, లోపలి భవనం, పూజా మందిరం, నాట్య మందిరం, అతిధి శాల, కచేరీ భవనం, భోజనాలయం, అనేక మంది దాసదాసీజనం-ఇదంతా చూసి పార్వతి అవాక్కయిపోయింది. తన భర్త ధనవంతుడని, జమీందారని మాత్రమే విన్నది. కాని ఇంత గొప్పవాడని అనుకోలేదు. కేవలం మనుషులదే కొరత అంటే కుటుంబంలో ఆత్మీయులైన వాళ్ళు యెవరూ లేరు. ఇంత పెద్ద అంతఃపురం శూన్యంగానే పడి వుంది. పార్వతి నూతనంగా వచ్చిన వధువు. కాని అమాంతంగా గృహిణి అయిపోయింది. హారతిచ్చి, దృష్టి తీసి ఇంటి లోపలికి తీసికొని వెళ్ళడానికి కేవలం వృద్ధురాలైన మేనత్త మాత్రమే వుంది. మిగిలిన వాళ్ళందరూ దాసదాసీ జన బృందమే.

సాయంకాలానికి కొంచెం ముందుగా ఇరవై సంవత్సరాల వయసులో వున్న అందమైన యువకుడు వచ్చి, నమస్కారం చేసి, పార్వతి యెదుట నిలబడి "అమ్మా, నేను పెద్ద కొడుకును" అన్నాడు.

పార్వతి ముసుగు లోపలనుంచే చూసింది. ఏమీ అనలేదు. అతడు మరోసారి నమస్కారం చేసి "అమ్మా! నేను నీ పెద్ద కుమారుణ్ని, నమస్కారం చేస్తున్నాను" అన్నాడు.

పార్వతి దీర్ఘంగా వున్న ముసుగును తొలగించి, మృదువుగా "రా నాయనా,

ఇక్కడకు రా!" అన్నది.

ఆ కుర్రవాడి పేరు మహేంద్రుడు. అతడు కొంచెం సేపటి వరకు అవాక్కయిపోయి పార్వతి ముఖం వైపు చూస్తూ వున్నాడు. తరువాత దగ్గరలో కూర్చుని వినయంగా "మా అమ్మ స్వర్గస్తురాలై ఇప్పటికి రెండు సంవత్సరాలయింది. ఈ రెండు సంవత్సరాల కాలం మేము చాలా దుఃఖంతోనూ, కష్టాలతోనూ గడిపాము. ఈ రోజు నీవు వచ్చావు. ఇప్పుడు మేము సుఖంగా వుండాలని ఆశీర్వదించు!" అన్నాడు.

పార్వతి చనువుగానూ, సరళంగానూ మాట్లాడుతూ వుంది. ఆమె అకస్మాత్తుగా గృహిణి అయిపోయినందువలన ఎన్నో విషయాలు తెలుసుకోవలసి వుంది. ఎంతోమంది వ్యక్తులతో, ఎన్నోసార్లు మాట్లాడవలసిన అవసరం వస్తుంది అయితే యీ మాట చెప్పడం ఎంతో మందికి కొంచెం అస్వాభావికం అనిపిస్తుంది. కాని పార్వతి స్వభావాన్ని బాగా తెలిసికుని వున్నవాళ్ళు వయసులో వచ్చిన అనేక మార్పులు వయసుకన్న మించి ఆమెను ఎక్కువగా పరిణతి చెందేటట్లు చేశాయని గమనించగలరు. అంతేగాక నిరర్థకమైన సిగ్గూ, అకారణమైన జడత్వమూ, అనవసరమైన సంకోచమూ ఆమెలో ఏనాడూ లేవు.

మహేంద్రుడు కొంచెం నవ్వి "నీ పెద్ద కూతురు_నా చెల్లెలు. తన అత్తవారింటి వద్ద వున్నది. నేను ఆమెకు ఉత్తరం వ్రాశాను. కాని యశోద ఏ కారణం చేతనో రాలేకపోయింది" అన్నాడు.

"రాలేక పోయిందా లేక రావడం ఇష్టం లేక రాలేదా?" అని పార్వతి బాధపడుతూ అడిగింది.

"నాకు సరీగా తెలియదమ్మా!" అన్నాడు మహేంద్రుడు సిగ్గుపడుతూ.

కాని అతడి మాటను బట్టీ, ముఖంలోని భావాన్ని బట్టీ 'యశోద కోపం కారణంగా రాలేదు' అని గ్రహించింది. "మరి మన చిన్న పిల్లవాడూ?" అన్నది.

"అతడు త్వరలోనే వస్తాడు-కలకత్తాలో వున్నాడు, పరీక్షలు వ్రాసి వస్తాడు" అన్నాడు మహేంద్రుడు.

చౌధరి మహాశయుడు స్వయంగానే జమీందారీ వ్యవహారాలు చూస్తూ వుంటాడు. ఇంతే గాకుండా ఆయన నిత్యం సాలగ్రామ విగ్రహానికి తన చేతులతో పూజ చేస్తూ వుంటాడు. వ్రతాలు, ఉపవాసాలు, నియమాలు అన్నీ యథోచితంగా పాటిస్తూ వుంటాడు. అతిథిశాలకు, సాధువులకూ, సన్యాసులకూ సేవలు చేస్తూ వుంటాడు. ఉదయం మొదలుకొని రాత్రి పదకొండు గంటలదాకా ఈ పనులన్నిట్లో నిమగ్నమై వుంటాడు. కొత్తగా పెళ్ళి చేసుకున్నందువలన విలాస యాత్రల్లాంటి

కొత్త అభిరుచులేమీ ఆయనలో కన్పించలేదు. రాత్రిపూట ఒక్కోరోజు లోపలికి వచ్చేవాడు. ఒక్కోరోజు రాలేకపోయేవాడు. వచ్చిన కూడా చాలా మామూలు సంభాషణ జరిగేది. మంచంమీద బాలీసు వేసుకొని పాడుకొంటూ మహా అయితే కేవలం ఇదిగో చూడూ! నీవే యింటి యజమానురాలివి. అన్నీ జాగ్రత్తగా చూసీ, వినీ, తెలివి తేటలతో, యుక్తి ప్రయుక్తులతో అన్ని పనులూ చూసుకుంటూ వుండు" అని మాత్రం అనేవాడు.

పార్వతి తలవూపి "సరే, మంచిది!" అనేది.

"ఇదిగో, చూడూ! ఈ మగ పిల్లలూ, ఆడ పిల్లలూ_ఆఁ -వీళ్ళందరూ నీ వాళ్ళే!" అనేవాడు భువన్ బాబు.

భర్త సిగ్గు పడటం చూసి పార్వతి కనుకొలికి నుంచి నవ్వు ఉట్టిపడుతుండేది. ఆయన కూడా కొంచెం నవ్వి "ఆఁ ఇదిగో, చూడూ! ఈ మహేంద్రుడు నీ పెద్ద కొడుకు. ఈ మధ్యనే బి.ఏ. పాసయ్యాడు. ఇంత మంచి పిల్లవాడు_

ఇతడిలాగా ప్రేమించే వాళ్ళు. ఆహా ఈ....!" అనేవాడు.

"ఇతడు నా పెద్ద కొడుకని నాకు తెలుసు" అన్నది పార్వతి నవ్వును ఆపుకొంటూ.

"ఈ సంగతి నీవు తెలుసు కోవేం? ఇటువంటి కుర్రవాణ్ని మరెక్కడా చూడలేదు. నా కూతురు యశోమతి అమ్మాయిగాదు, ఆపాద మస్తకం ఆ లక్ష్మీదేవి ప్రతిమ. ఆమె తప్పకుండా వస్తుంది. వృద్ధుడైన ఈ తండ్రిని చూడటానికి రాదా? ఆమె వచ్చినందువలన...."

పార్వతి దగ్గరకు వచ్చి ఆ బట్టతల మీద తన కోమలమైన కరకమలాన్ని వుంచి మృదువుగా అంటుంది_"ఈ విషయాన్ని గురించి మీరు చింతించవలసిన పని వుండదు. యశోదను పిలిచుకొని రావడానికి నేను మనిషిని పంపిస్తాను. లేకపోతే మహేంద్రుడే స్వయంగా వెళ్ళి వస్తాడు."

"వెళ్ళివస్తాడా! వెళ్ళివస్తాడా! సరే మంచిది, చూసి చాలా రోజులయింది. నీవు మనిషిని పంపిస్తావు గదూ?"

"తప్పకుండా పంపిస్తాను. నా కూతురును నేను పిలిపించనా?"

వృద్ధుడు యీ సమయంలో ఉత్సాహపడి లేచి కూర్చున్నాడు. తమ పరస్పర సంబంధాన్ని కూడా మరచిపోయి పార్వతి తలమీద చేయి వుంచి దీవిస్తూ "నీకు శుభం కలుగుగాక! నీకు సుఖం కలుగుగాక! భగవంతుడు నీకు

దీర్ఘాయుస్సు ప్రసాదించుగాక!" అని ఆశీర్వదిస్తాడు.

దీని తరువాత అకస్మాత్తుగా ఆ వృద్ధుని మనసులో ఏమేమిటో విషయాలు మెదులుతూ వుండేవి. మళ్ళీ మంచంమీద కళ్ళు మూసుకొని తన మనసులో అనుకొంటూ వుండేవాడు. ఆహా! ఆమె నన్ను చాలా ప్రేమిస్తూ వుండేది.

ఇదే సమయంలో సగం నరసి పులగం లాగా వున్న ఆ మీసాల దగ్గరగా జాలువారుతూ అశ్రుబిందువులు దిండుమీద పడేవి. పార్వతి తుడిచి వేసేది. అప్పుడప్పుడు ఆయన లోలోపల అనుకొంటూ వుండేవాడు_ఆహా! ఆ జనమంతా వచ్చేస్తే ఒక్కసారి మళ్ళీ ఇళ్ళూ, వాకిళ్ళూ ప్రకాశిస్థాయి-ఆహా! పూర్వం ఎంత కోలాహలంగా వుండేది! అబ్బాయిలూ, అమ్మాయిలూ ఇంట్లో అందరూ వుండేవారు. నిత్యం దుర్గోత్సవం లాంటి ఆనందం వుండేది. తరువాత ఒకనాడు అంతా సమాప్తమైపోయింది. అబ్బాయిలు కలకత్తా వెళ్ళిపోయారు. యశోదను ఆమె మామగారు వచ్చి తీసికొని వెళ్ళారు. మళ్ళీ అంతా అంధకారం, శ్మశానం...."

ఇదే సమయంలో మళ్ళీ మీసాల రెండు వైపులా నుంచీ జారుతున్న అశ్రువులు పక్కమీద దిండును తడుపుతూ వున్నాయి. పార్వతి వ్యాకులంగా అశ్రువులు తుడుస్తూ "మహేంద్రునికి ఎందుకు పెళ్ళి చేయలేదూ?" అని అడిగింది.

"ఆహా! అది నాకు ఎలా సుఖంగా వుండే రోజు కాగలదు? ఇదే ఆలోచిస్తున్నాను. కాని అతడి మనసులో విషయం ఎవరు తెలుసుకొనగలరు? అతని హఠాన్ని ఎవరు మార్చగలరు? ఏ విధంగానూ అతడు పెళ్ళి చేసికొనడానికి ఇష్టపడలేదు. అంచేతనే వృద్ధాప్యంలో....ఇల్లంతా బావురుమంటూ వుంది. ఇల్లంతా దుఃఖంతోనే వుంది. లక్ష్మి కళ పోయింది. ఇల్లు దరిద్రుల నివాసంగా వుంది. ఇంట్లో ఎవరూ దీపం పెట్టేవాళ్ళు లేరు. ఇదంతా చూడలేక పోయాను. అందుచేతనే....

ఈ మాట విని పార్వతి చాలా దుఃఖించేది. జాలిగా నవ్వుతో పాటు తల వూపుతూ "నీవు వృద్ధుడిని అయినందువలన నేను కూడా త్వరలోనే వృద్ధురాలిని అవుతాను. స్త్రీలు వృద్ధురాండ్రు కావడానికి ఎంతో కాలం పట్టదు" అన్నది.

భువన్ చౌదరి లేచి కూర్చుంటాడు. ఒక చేతిలో ఆమె చిబుకాన్ని పట్టుకొని, మౌనంగా ఆమె మొఖం వైపు చాలా సేపటివరకూ చూస్తూ వుంటాడు. శిల్పి తన ప్రతిమను అలంకరించి, తలపై కిరీటం పెట్టి ఎడమకూ, కుడికీ త్రిప్పి చాలా సేపటివరకు చూస్తూ వుంటాడు. తర్వాత కొంచెం గర్వమూ, ఎక్కువగా స్నేహ భావమూ ఉత్పన్నమవుతుంది. సరీగా అదే విధంగా భువన్ బాబు పరిస్థితి కూడా వుంది. ఒకరోజు ఈయన నోటి నుంచి అస్పష్టంగా "ఆహా, మంచి పని చేయలేదు" అనే మాట వెలువడుతోంది.

"ఏం మంచి పని చేయలేదు?"

"ఇక్కడ నీకు శోభనివ్వడం లేదని ఆలోచిస్తున్నాను."

పార్వతి నవ్వుతూ, "బాగా శోభగానే వుంది. మనకు శోభ, అశోభ ఏమిటి?" అన్నది.

వృద్ధుడు మళ్ళీ పడుకొని లోలోపల అనుకొంటూ వుండేవాడు_"నాకు తెలుసు, అది నాకు తెలుసు. నీకు మేలు కలుగుగాక!" భగవంతుడు నిన్ను చూస్తాడు.

ఇదే విధంగా ఓ నెల గడిచిపోయింది. మధ్యలో ఒకసారి చక్రవర్తి మహాశయుడు కూతురును తీసుకొని వెళ్ళడానికి వచ్చాడు. పార్వతి తన ఇష్టప్రకారమే వెళ్ళలేదు. "నాన్నగారూ! ఇది ఇంకా కుదుటపడని సంసారం. కొన్నాళ్ళ తరువాత వస్తాను!" అన్నది తండ్రితో.

"స్త్రీల జాతే ఇటువంటిది!" అని ఆయన లోలోపల నవ్వుకున్నాడు.

ఆయన వెళ్ళిపోయాడు. పార్వతి, మహేంద్రుని పిలిచి "ఒకసారి నా పెద్ద కూతురును పిలిచుకురా!" అని చెప్పింది.

మహేంద్రుడు అటూ, ఇటూ దాట వేస్తున్నాడు. యశోద ఏ విధంగానూ రాదని అతడికి తెలుసు. "ఒకసారి నాన్నగారు వెళ్ళడం మంచిది" అన్నాడు.

"ఛీ! అదేం బాగుంటుంది? అంతకన్న మనం తల్లీ కొడుకులం వెళ్ళి పిలిచుకొని రావటం మంచిది."

"ఏమిటి? నీవు వెళతావా?" అన్నాడు మహేంద్రుడు ఆశ్చర్యంతో.

"ఏం నష్టమేమిటి? ఇందులో నాకేమీ సిగ్గులేదు. నేను వెళ్ళిణ,నందు వలన కోపం తొలగిపోయి, యశోద వస్తే నేను వెళ్ళడానికి కష్టమేమిటి?"

అంచేత మహేంద్రుడు మరుసటి రోజే యశోదను తీసికొని రావడానికి వెళ్ళాడు. అక్కడకు వెళ్ళి అతడు ఏమి కౌశలం ప్రదర్శించాడో అది మాత్రం నాకు తెలియదు. నాలుగు రోజుల తరువాత యశోద వచ్చేసింది. ఆ రోజు పార్వతి ఒంటినిండా చాలా విలువైన కొత్త కొత్త ఆభరణాలు ధరించి వుంది. కొద్ది రోజుల క్రితమే వాటిని భువన్ బాబు కలకత్తా నుంచి తెప్పించాడు. పార్వతి ఈరోజు ఆ నగలన్నింటినీ ధరించి వుంది. దారిలో వచ్చేటప్పుడు యశోద చాలా క్రోధంతోనూ, అభిమానంతోనూ కూడిన మాటలను లోలోపల రిపీట్ చేస్తూ వుంది. కాని ఇక్కడకు వచ్చిన తరువాత కొత్త కోడలను చూచి అకస్మాత్తుగా అవాక్కయిపోయింది. విద్వేషపు మాట ఒక్కటి కూడా ఆమె మనసులో

మిగలకుండా పోయింది. కేవలం అస్పష్టమైన స్వరంతో "ఈమే!" అన్నది.

పార్వతి యశోద చేయి పట్టుకొని యింట్లోకి తీసికొని వెళ్ళింది. ఆమె దగ్గర కూర్చొని, ఒక పంఖా చేతిలోకి తీసికొని "తల్లిమీద ఇంతగా కోపగించుకొంటారటమ్మా?" అన్నది.

యశోద ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది. అప్పుడు పార్వతి తన ఒంటిమీద సొమ్ములన్నీ ఒక్కొక్కటే తీసి యశోదకు పెడుతూ వుంది. యశోద విస్మయంతో "ఇదేమిటీ?" అని అడిగింది.

"ఏమీలేదు, కేవలం తల్లి కోరిక!"

ఆభరణాలు ధరించినందు వలన యశోద శరీరం అద్భుతంగా వికసించింది. ధరించడం పూర్తి అయిన తర్వాత ఆమె అధరం మీద హాసరేఖ తొణికిసలాడింది. ఆమె ఒంటినిండా ఆభరణాలు తగిలించి నిరాభరణంగా వున్న పార్వతి "యశోదా, తల్లిమీద క్రోధం తెచ్చుకుంటారా?" అన్నది.

"లేదు, లేదు, క్రోధం ఏమిటి? క్రోధం ఎవరిమీద?"

"విను యశోదా! ఇది నీ తండ్రి ఇల్లు! ఇంత పెద్ద భవనంలో ఎంతోమంది దాస దాసీలు అవసరం అవుతారు. నేను కూడా ఒక దాసిని. ఛీ-ఛీ! అమ్మాయీ, తుచ్ఛమైన దాసీ పైనే ఇంతగా కోపగించుకోవడం నీకు శోభనిస్తుందా?"

యశోద వయసులో పెద్దదే కాని, మాట్లాడటంలో చిన్నది. ఆమె కలత చెందింది. పంఖాతో విసురుతూ పార్వతి మళ్ళీ "ఒక దుఃఖం అనుభవించే వాని కూతురుకు మీ అందరి దయ వలన యిక్కడ కొంచెం స్థానం లభించింది. ఎంతో మంది దీనులనూ, అనాధలనూ, పీడుతులనూ మీ అందరి దయవలన నిత్యం పోషిస్తూ వున్నారు. వారిలో నేనూ ఒకదాన్ని, ఆశ్రితురాలివి...."

యశోద తన్మయత్వంతో వింటూ వుంది. ఇప్పుడు అమాంతంగా తనను తాను మరచిపోయి ఆమె పాదాల దగ్గర పడి నమస్కారం చేసి "నీ కాళ్ళమీద పడుతున్నానమ్మా" అన్నది.

మరుసటిరోజు మహేంద్రుడు యశోదను ఒంటరిగా పిలిచి "ఏం కోపం తగ్గిపోయిందా?" అన్నాడు.

యశోద అన్న పాదం మీద చేయివేసి వెంటనే "అన్నయ్యా, కోపంతో, ఛీ-ఛీ! ఎన్నో మాటలు అనేశాను. చూడు, అవన్నీ బయటపెట్టకు."

మహేంద్రుడు నవ్వుతూ వున్నాడు. "సరే అన్నయ్యా! సవతి తల్లి ఎవరైనా ఇంత ఆదరభావం కలిగి వుండగలదా?" అన్నది.

రెండు రోజుల తరువాత యశోద స్వయంగా తండ్రి దగ్గరకు వచ్చి "నాన్నగారూ, నేనింకా రెండు మాసాలు ఇక్కడే ఉంటానని అక్కడికి ఉత్తరం వ్రాసెయ్యండి" అని చెప్పింది.

"ఎందుకమ్మా?" అన్నాడు భువన్ బాబు కొంచెం ఆశ్చర్యంగా.

"నా ఆరోగ్యం కొంచెం బాగాలేదు. అంచేత కొన్నాళ్ళు చిన్నమ్మ దగ్గర ఉంటాను" అన్నది యశోద.

వృద్ధుడి కళ్ళనుంచి ఆనందాశ్రువులు రాలాయి. సాయంకాలం పార్వతిని పిలిచి "నీవు నా గౌరవాన్ని కాపాడావు, సుఖంగా వర్థిల్లు" అన్నాడు.

"అదేమిటి?" అన్నది పార్వతి.

"అదేమిటో నీకు వివరించలేను. ఆ శ్రీమన్నారాయణుడు ఈరోజు నన్ను లజ్జ పడవలసి రాకుండా ఉద్ధరించాడు."

ఆ నంద చీకట్లో భర్త కళ్ళల్లో నీళ్ళు తిరగడం పార్వతి చూడలేదు. భువన్ బాబు చిన్న కుమారుడు వినోద్ లాల్ పరీక్షలు వ్రాసి ఇంటికి వచ్చాడు. అతడింతవరకూ చదువుకొనడానికే వెళ్ళలేదు.

## 11

రెండు మూడు రోజులు దేవదాసు పిచ్చివాడిలాగా అటూ యిటూ తిరుగుతూ గడిపాడు. ధర్మదాసు ఏదో చెప్పబోతే కళ్ళెర్రజేసి, దబాయించి అతణ్ణి తరిమేశాడు. అతడి వికృత భావాలు చూసి చున్నీలాల్ కూడా ఏమనడానికి సాహసించలేకపోయాడు. ధర్మదాసు రోధిస్తూ "చున్నీబాబూ, దేవదాసు ఎందుకు ఇలా అయిపోయాడు?" అన్నాడు.

"ఏమయిపోయాడు ధర్మదాసూ?" అన్నాడు చున్నీలాల్.

ఒక గ్రుడ్డివాడు మరో గ్రుడ్డివాణ్ని అడిగాడు. ఇరువురిలో ఒక్కరు కూడా అతడి హృదయంలోని విషయాన్ని తెలుసుకోలేకపోయారు. కళ్ళు తుడుచుకుంటూ ధర్మదాసు "చున్నీబాబూ, ఎలాగయినా సరే దేవదాసును వాళ్ళమ్మ దగ్గరకు చేర్చు. ఇక ఇప్పుడు చదువు కూడా లేకపోతే ఇక్కడ వుండవలసిన అవసరం ఏముంది?"

అతడన్న మాట అక్షరాలా నిజం. చున్నీలాల్ ఆలోచిస్తూ వున్నాడు. నాలుగైదు రోజుల తరువాత ఒకరోజు సాయంకాలం సరీగా అప్పుడే చున్నీ బయటికి వెళుతూ వున్నాడు. దేవదాసు ఎక్కడ నుంచో వచ్చి అతడి చేయి పట్టుకొని, "చున్నీబాబూ, అక్కడికే వెళుతున్నావా?" అన్నాడు.

చున్నీ సంకోచిస్తూ "అవును, వద్దంటే వెళ్ళను" అన్నాడు.

"లేదు, నేను వెళ్ళవద్దని చెప్పడం లేదు. కాని యే ఆశతో నీవు అక్కడికి వెళ్తున్నావో చెప్పు."

"ఆశ యేముంది? ఊరకనే, మనస్సును ఆహ్లాద పరచుకొనడం కోసం."

మనస్సును ఆహ్లాద పరచుకోవడం కోసమా? నా మనస్సుకు ఆహ్లాద మేమీ కలగలేదు. నేనూ మనస్సును ఆహ్లాద పరచుకోవాలనుకున్నాను."

చున్నీబాబు కొంత సేపటి దాకా అతడి ముఖం వైపు చూస్తూ వున్నాడు. తరువాత "దేవదాస్! నీ కేమయిందో స్పష్టంగా చెప్పు" అన్నాడు.

"ఏమీ కాలేదు."

"చెప్పవా?"

చున్నీలాల్ చాలా సేపటి తరువాత తల వంచుకుని "దేవదాసు, నా మాట ఒక్కటి దక్కిస్తావా?" అన్నాడు.

"ఏమిటి?"

"అక్కడకు నీవు మరోసారి రావలసి వుంటుంది. నేను మాట ఇచ్చాను."

"ఆరోజు వెళ్ళిన చోటకేనా?"

"అవును."

"ఛీ! అక్కడ నాకు నచ్చదు."

"నీకు ఏది నచ్చుతుందో అదే చేస్తాను."

దేవదాసు కొంచెం సేపు అన్యమనస్కుడు మాదిరిగా మౌనంగా వున్నాడు. తరువాత "సరే పద. నేను వస్తాను" అన్నాడు.

* * * *

పతనానికి పోయేదారిలో మరో మెట్టు దిగి చున్నీలాల్ ఎక్కడికి వెళ్ళిపోయాడో తెలియదు. దేవదాసు ఒక్కడే చంద్రముఖి భవనంతో క్రింద భాగంలో కూర్చొని మద్యం సేవిస్తూ వున్నాడు. దగ్గరే చంద్రముఖి విషణ్ణవదనంతో కూర్చొని చూస్తూ వుంది. "దేవదాస్! ఇక త్రాగవద్దు" అన్నది ఆమె.

దేవదాసు మద్యం గ్లాసు క్రిందపెట్టి కనుబొమలు విరుస్తూ "ఎందుకు?" అన్నాడు.

కొద్ది రోజులనుంచే మధ్యం త్రాగడం ప్రారంభించావు....ఇంక భరించలేవు."

"భరించడం కోసం మధ్యం త్రాగడం లేదు. ఇక్కడ వుండడం కోసం మధ్యం సేవిస్తున్నాను."

ఈ మాట చంద్రముఖి అనేకసార్లు వినివుంది. ఎక్కడయినా గోడకు కొట్టుకుని రక్తం ప్రవహింపజేసి చనిపోడుగదా! అని ఒకటి రెండుసార్లు ఆమె అనుకున్నది. దేవదాసును ఆమె ప్రేమిస్తున్నది. దేవదాసు మధ్యం గ్లాసును పైకి ఎగరేశాడు. మంచం కోడుకు తగిలి అది ముక్కలు ముక్కలయిపోయింది. మళ్ళీ దిండు మీద వాలిపోయి తొట్రుపడుతున్న స్వరంతో అన్నాడు- "నాలో లేచే శక్తి లేదు. అంచేతనే ఇక్కడ పడి వుంటున్నాను. జ్ఞానం లేదు. అందుచేతనే నీ ముఖం వైపు చూసి మాట్లాడుతున్నాను. చంద....ర....అప్పుడు అజ్ఞానం వుండదు. కొంచెం జ్ఞానం వుంటుంది. నిన్ను తాకలేను, నాకు చాలా ఏవగింపు కలుగుతుంది."

చంద్రముఖి కళ్ళు తుడుచుకుని నెమ్మదిగా "దేవదాస్! ఇక్కడికి ఎంతో మంది మనుషులు వస్తారు. వాళ్ళు మధ్యాన్ని తాకను కూడా తాకరు" అన్నది.

దేవదాసు కళ్ళు తెరచి లేచి కూర్చున్నాడు. కొంచెం ఊగుతూ అటూ ఇటూ చేతులు విసరి "తాకను కూడా తాకరా? నా దగ్గర తుపాకి వుంటే కాల్చి పారేసేవాణ్ని. వాళ్ళు నాకన్నా ఎక్కువ పాపిష్టులు చంద్రముఖీ!"

కొంచెం సేపు ఆగి ఆలోచిస్తూ వున్నాడు. తరువాత అన్నాడు-ఒకవేళ ఎప్పుడయినా మధ్యం త్రాగడం మానివేస్తే-ఒకవేళ మానకపోయినా-అయినా మానను-మానితే ఇక్కడకు ఎప్పుడూ రాను. నాకు ఉపాయం తెలుసు. కాని వాళ్ళ స్థితి ఏమవుతుంది?"

కొంచెం ఆగి మళ్ళీ ప్రారంభించాడు...."చాలా దుఃఖంతో మధ్యాన్ని స్వీకరించాను. ఆపదలోనూ, దుఃఖంలోనూ నా సహచరి! ఇక నిన్ను ఎప్పటికీ విడువలేను" అని దేవదాసు దిండు మీద ముఖం రుద్దుకుంటూ వున్నాడు. చంద్రముఖి వెంటనే దగ్గరకు వచ్చి ముఖాన్ని పైకి లేవనెత్తింది. దేవదాసు కనుబొమలు విరిచి "ఛీ! తాకవద్దు! ఇంకా నాలో జ్ఞానం వుంది చంద్రముఖీ నీకు తెలియదు....నేను నిన్ను ఎంత అసహ్యించుకుంటున్నానో అది కేవలం నాకే తెలుసు. ఎప్పుడూ నిన్ను ఏవగించుకొంటాను! అప్పుడు కూడా వస్తాను, అప్పుడు కూడా కూర్చుంటాను. అప్పుడు కూడా మాట్లాడతాను. ఇది మినహా మరో ఉపాయం లేదు. దీన్ని మీరెవరైనా అర్థం చేసుకోగలరా! హా...హా! జనం పాపాన్ని చీకట్లో చేస్తారు. నేను ఇక్కడ నిషాలో పడివున్నాను__అందుకు బాగా తగినచోటు. ఇంత తగిన చోటు ప్రపంచంలో మరెక్కడుంది. మరి మీరందరూ...."

దేవదాసు దృష్టిని సరి చేసుకొని కొంచెం సేపటిదాకా ఆమె విషణ్ణ వదనం

వైపు చూసి "ఆహా! సహసశీలతకు ప్రతిరూపం! కళంకము, నింద, అవమానము, అన్యాయము,అత్యాచారం, ఉపద్రవం- వీటన్నిటినీ స్త్రీ సహించ గలదు. నీవే దీనికి ఉదాహరణగా వున్నావు!" అన్నాడు.

తరువాత వెల్లకిలగా పడుకొని నెమ్మదిగా అంటున్నాడు. "నన్ను ప్రేమిస్తున్నానని చంద్రముఖి అంటున్నది. నేను ఇది కోరుకోవడం లేదు. కోరుకోవడంలేదు....కోరుకోవడం లేదు. జనం నాటకాల వేస్తుంటారు, నాట్యం చేస్తుంటారు.ముఖానికి భస్మం పూసుకుంటారు. మసి పూసుకుంటారు. బిచ్చం అడుక్కుంటారు....రాజులవుతారు....ప్రేమిస్తారు. ఎన్నో ప్రేమ విషయాలు ముచ్చటిస్తారు!....ఎంతో రోదిస్తారు. అంతా సరిగ్గా వున్నట్లు, అంతా నిజం అన్నట్లు నా చంద్రముఖి నాట్యం చేస్తుంది. నేను చూసాను. కానీ అది ఎక్కువగా గుర్తుకు వస్తుందే, క్షణంలో అంతా అయిపోయింది. ఆమె ఎక్కడకు వెళ్ళింది? నేను ఏ దారిన ఇక్కడకు వచ్చాను? ఇప్పుడు నిషాతో నిండివున్న ఒక అభినయం ప్రారంభమయింది.ఇది ఘోరమయిన మత్తుతో నిండివున్న అభినయం....ఇదొక్కటే....కానివ్వు" అభ్యంతర మేముంది? ఆశలేదు. అదే విశ్వాసం....సుఖమూ లేదు, కోరికా లేదు....ఆహా! చాలా బాగుంది!

ఆ తరువాత దేవదాసు ప్రక్కకు పొర్లి ఏమిటో పలవరిస్తూ వున్నాడు. చంద్రముఖి ఆ ప్రలాపాలను అర్థంచేసుకోలేకపోయింది. సేపటికే దేవదాసు నిద్రపోయాడు. చంద్రముఖి అతని దగ్గరకు వెళ్ళి కూర్చున్నది. చీర కొంగు తడిపి అతడి ముఖం తుడిచింది. తడిసిపోయిన దిండును మర్చి వేసింది. ఒక పంఖా తీసికొని కొద్దిసేపు విసిరింది. చాలా సేపటి వరకు తల వంచుకుని కూర్చున్నది. అప్పటికి రాత్రి ఒంటిగంట అయింది. ఆమె దీపం ఆర్పివేసి, తలుపులు మూసి గదిలోకి వెళ్ళి పోయింది.

## 12

సోదరు లిద్దరూ ద్విజదాసు, దేవదాసు-ఇంకా చాలా మంది గ్రామస్తులు, జమీందారైన ముఖోపాధ్యాయుని అంత్యక్రియలు పూర్తిచేసుకొని ఇంటికి తిరిగి వచ్చారు. ద్విజదాసు పిచ్చివాడిలాగా అరిచి రోదిస్తూ నిద్రపోయాడు. గ్రామస్తులు ఐదారుగురు కలిసి కూడా అతణ్ని పట్టలేకపోయారు. దేవదాసు శాంతంగా ఒక స్థంభం దగ్గర కూర్చొని వున్నాడు. నోటి నుంచి ఒక్క మాట రావడం లేదు. కళ్ళల్లో ఒక్క కన్నీటి చుక్క కూడా కన్పించడం లేదు. అతణ్ని పట్టుకొనడానికి ఎవ్వరూ రావడం లేదు. అతణ్ని ఎవ్వరూ ఓదార్చడంలేదు. కేవలం మధుసూధన ఘోష్ మాత్రం ఒకసారి దగ్గరకు వచ్చి, "తమ్ముడూ! ఇదంతా ఆ ఈశ్వరుని చేతిలోని విషయం ఇందులో...."

దేవదాసు చేతితో ద్విజదాసు వైపు చూపిస్తూ "అక్కడ చూడండి"

అన్నాడు.

ఘోష్ మహాశయుడు నిశ్చేష్టుడై....అవును....అవును....ఆయన చాలా శోకంతో....అన్నాడు.

ఇలా ఏదో అంటూ అంటూ ఆయన వెళ్ళిపోయాడు. మరెవ్వరూ దగ్గరకు రాలేదు. మధ్యాహ్నం దాటిన తరువాత దేవదాసు స్పృహతప్పి పడివున్న తల్లి పాదాల దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. అక్కడ చాలా మంది స్త్రీలు ఆమె చుట్టూ కూర్చొని వున్నారు. వారిలో పార్వతి నాయనమ్మ కూడా కూర్చొని వుంది. ఆమె పూడిపోయిన స్వరంతో, శోకంలో మునిగివున్న వితంతువైన తల్లితో "కోడలూ, చూడు! దేవదాసు వచ్చాడు" అన్నది దేవదాసు "అమ్మా!" అని పిలిచాడు.

ఆమె కేవలం ఒక్కసారి చూసి "దేవదాసు!" అన్నది. మళ్ళీ ఆమె కళ్ళ నుంచి బొటబొటా కన్నీళ్ళు కారాయి. స్త్రీలు కూడా విలపించారు. దేవదాసు కొంచెం సేపటివరకూ తల్లి పాదాలతో ముఖం కప్పుకొని కూర్చున్నాడు. మళ్ళీ లేచి తండ్రి పడకగదిలోకి వెళ్ళాడు. కంటతడి లేదు. ముఖం గంభీరంగానూ, శాంతంగానూ వుంది. ఎరుపెక్కిన కళ్ళను పైకి తెరచుకొని వెళ్ళి నేలమీద చతికిల బడ్డాడు. ఆ విగ్రహాన్ని ఎవరైనా చూస్తే బహుశా భయపడి పోతారు. రెండు కణతలు ఉబికి వున్నాయి. కాల్చిన బంగారంలాగా శరీరం రంగు మారి నల్ల బడిపోయింది. కలకత్తాలోని జఘన్య అత్యాచారాల మధ్య రాత్రులందు దీర్ఘమైన జాగరణలు చేశాడు. ఆ పైన ఇక్కడ తండ్రి మరణించాడు. ఒక సంవత్సరం క్రితం ఎవరైనా అతణ్ని చూసి వుంటే బహుశా ఇప్పుడు హటాత్తుగా చూసి గుర్తు పట్టలేరు కూడా. కొంచెం సేపటి తరువాత పార్వతి తల్లి అతణ్ని వెతుక్కుంటూ తలుపు నెట్టుకొని లోపలికి వచ్చి "దేవదాస్!" అని పిలిచింది.

"ఏమిటి పిన్నీ."

"ఇలా అయితే ఇక సాగదు."

దేవదాసు ఆమె ముఖం వైపు చూసి "ఏం చేసేది పిన్నీ!" అన్నాడు దేవదాసు.

పిన్నికి అంతా తెలుసు. కాని ఏమీ అనలేకపోయింది. దేవదాసు తల చేతితో నిమురుతూ_"దేవుడి లాంటి వాడివి నాయనా!" అన్నది.

"ఏమిటి పిన్నీ?"

"దేవిడివి."

ఈసారి దేవదాసు ఆమె ఒడిలో తన ముఖం దాచుకున్నాడు. కళ్ళ నుంచి

రెండు వేడి వేడి అశ్రుబిందువులు రాలాయి.

పరివారమంతా శోకంతో మునిగిపోయిన రోజు ఏదో విధంగా గడిచిపోయింది. నియమిత రూపంతో ప్రభావిత మయ్యింది. రోదనలు, వేదనలు చాలా వరకు  పరిమితమయ్యాయి. ద్విజదాసు క్రమంగా కుదుట బడ్డాడు. ఆయన తల్లి కూడా కొంచెం స్థిమితపడింది. కన్నీరు కార్చుకుంటూ, ముక్కు చీదేసుకుంటూ అవసరమైన పనులు అందుకుంటూనే వుంది. రెండు రోజుల తరువాత ద్విజదాసు, దేవదాసును పిలిచి దేవదాస్ నాన్నగారి శ్రాద్ధ కర్మలకు ఎంత ఖర్చు పెట్టడం ఉచితంగా వుంటుంది?" అని అడిగాడు.

దేవదాసు అన్న ముఖం వైపు చూసి "మీకు ఉచితమనిపించినట్లుగా ఖర్చు పెట్టండి." అన్నాడు.

"అలా కాదు తమ్ముడూ, కేవలం నేను ఉచితమనుకుంటే చాలదు. ఇప్పుడు నీవు కూడా పెద్దవాడివయ్యావు. నీ అభిప్రాయం తెలుసుకోవడం కూడా అవసరం."

"రొక్కం ఎంత డబ్బుందీ?" అడిగాడు దేవదాసు.

"నాన్నగారి లెక్కలో లక్షన్నర రూపాయలు నిలువ వున్నాయి. నా అభిప్రాయం ప్రకారం పదివేల రూపాయలు ఖర్చు పెడితే చాలనుకుంటాను. ఏమంటావు?"

"నా కెంత లభిస్తుంది?"

ధర్మదాసు కొంచెం అటూ ఇటూ జరిపి "నీకు కూడా సగం లభిస్తుంది. పదివేలు ఇప్పుడు ఖర్చయితే డెబ్బదివేలు నీకూ, డెబ్బది వేలు నాకూ లభిస్తాయి."

"అమ్మకు ఏమి లభిస్తుంది?"

"అమ్మ నగదు తీసుకొని ఏం చేసుకొంటుంది? ఆమె ఎటూ ఇంటికి యజమానురాలే. ఆమె ఖర్చు మనం భరించుదాం."

దేవదాసు కొంచెం సేపు ఆలోచించి "నా అభిప్రాయం ఏమిటంటే మీ వాటానుంచి అయిదు వేల రూపాయలు ఖర్చు పెట్టండి. నా వాటా నుంచి పాతికవేల రూపాయలు ఖర్చు పెట్టండి. మిగిలిన పాతికవేల రూపాయలు అమ్మ పేరున జమ చేసి వుంచండి. మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు.

మొదట ద్విజదాసు కొంచెం సిగ్గుపడ్డాడు. తరువాత "సరే మంచిది, నీకు తెలుసుగదా? నాకు భార్య, కొడుకు, కూతురు వున్నారు. వాళ్ళ అధ్యయనాలకు, ఉపనయనాలకు, వివాహాలకూ, చాలా ఖర్చు పెట్టవలసి వుంటుంది. అంచేత ఈ

అభిప్రాయమే బాగున్నది." అని మళ్ళీ కొంచెం ఆగి "ఇలా అని కొంచెం వ్రాసి యిస్తావా?" అన్నాడు.

"వ్రాతకోతలతో పనేమిటీ? ఆ పని అంత బాగుండదు. ప్రస్తుతం డబ్బు విషయం రహస్యంగా వుండటమే మంచిదని నా అభిప్రాయం."

"అయితే మంచిదే. కాని నీకు తెలియదు తమ్ముడూ...."

"సరే నేను వ్రాసే ఇస్తాను" అని ఆ రోజే దేవదాసు వ్రాసి ఇచ్చాడు.

రెండవ రోజు మధ్యాహ్నం పూట దేవదాసు మెట్లమీదుగా క్రిందికి దిగి వస్తున్నాడు. మధ్యలో పార్వతిని చూసి ఆగిపోయాడు. పార్వతి అతడి ముఖం వైపు చూసింది_చూసి గుర్తుపడుతూ వుండగానే ఆమెకు దుఃఖం కలుగుతూ వుంది. దేవదాసు గంభీరంగానూ, శాంతంగానూ "ఎప్పుడొచ్చావు పార్వతీ?" అన్నాడు.

అదే కంఠస్వరం  మూడు సంవత్సరాల తరువాత ఈ రోజు వింటున్నది. తల వంచుకొని పార్వతి "ఈ రోజు ఉదయమే వచ్చాను" అన్నది.

"చాలా రోజుల నుంచి చూడలేదు. బాగున్నావు గదా?"

పార్వతి తల వంచుకొని వుంది.

"చౌధరి మహాశయుడు బాగున్నాడా? అబ్బాయిలూ, అమ్మాయిలూ అందరూ బాగున్నారా?"

"అందరూ బాగానే వున్నారు" అని పార్వతి ఒకసారి ముఖం వైపు చూసింది. కాని ఒక్కమాట కూడా అడగలేకపోయింది. ఆయన ఎలా వున్నాడు, ఏం చేస్తున్నాడు మొదలయిన విషయాలు ఏవీ అడగలేక పోయింది.

"ఇంకా ఇక్కడ కొన్నాళ్ళు వుండవలసి వుంటుంది గదా?" అన్నాడు దేవదాసు.

"అవును!"

"అయితే ఇంకేం?" అని దేవదాసు వెళ్ళిపోయాడు.

శ్రాద్ధకర్మలు సమాప్తమైపోయాయి. దానిని వర్ణించడం కోసం చాలా వ్రాయవలసి వుంటుంది. అంచేత అదంతా చెప్పవలసిన అవసరం ఏమీలేదు. శ్రాద్ధం పూర్తి అయిన మరుసటి రోజు పార్వతి, ధర్మదాసును ఒంటరిగా పిలిచి అతడి చేతిలో ఒక బంగారు హారాన్ని వుంచి "ధర్మా! దీన్ని మీ అమ్మాయికివ్వు. మెళ్ళో వేసుకుంటుంది" అన్నది.

ధర్మదాసు ఆమె ముఖం వైపు చూసి ఆర్ద్రనేత్రాలతో, జాలిగొలిపే కంఠస్వరంతో "నిన్ను చాలా రోజులనుంచి చూడలేదు. అంతా క్షేమంగా వున్నారా?" అన్నాడు.

"అందరం క్షేమంగానే వున్నాం. మీ అబ్బాయిలూ, అమ్మాయిలూ బాగున్నారా?"

"అవును పత్తో, అంతా బాగానే వున్నారు."

"నీవు బాగున్నావా?"

ఈసారి దీర్ఘమైన నిట్టూర్పు విడిచి ధర్మదాసు "ఏం బాగున్నానమ్మా? ఇప్పుడు ఈ జీవితం భారంగా కనిపిస్తున్నది_యజమానే వెళ్ళి పోయాడు...." ధర్మదాసు శోకాతిశోకంతో ఇంకా కొంత చెప్పదలచుకొని వున్నాడు. కాని పార్వతి అడ్డుపడింది. ఈ మాటలన్నీ వినడం కోసం ఆమె హారాన్ని ఇవ్వలేదు.

"ఇదేమిటి ధర్మదాస్! నీవు వెళ్ళిపోతే దేవదాసును ఎవరుచూస్తారు?" అన్నది పార్వతి.

"చిన్న పిల్లవాడుగా వున్నప్పుడు చూడవలసిన అవసరం వుండేది. ఇప్పుడు చూడకుండా వుంటేనే బాగున్నాడు" అన్నాడు ధర్మదాసు.

పార్వతి మరింత దగ్గరగా వచ్చి "ధర్మా! ఒక మాట అడుగుతాను, ఉన్నదున్నట్లు నిజం చెబుతావా?" అన్నది.

"ఎందుకు చెప్పను పత్తో?"

"దేవదాసు ఈ సమయంలో, అంటే ఇప్పుడే ఏం చేస్తూ వున్నాడో నిజం చెప్పు!"

"నా తలకాయ చేస్తుంటాడు. ఇంకేం చేస్తూ వుంటాడు?"

"ధర్మదాస్! స్పష్టంగా చెప్పవేమిటీ?"

ధర్మదాసు తల బాదుకొంటూ "స్పష్టంగా ఏం చెప్పేది? అది చెప్పుకోదగిన విషయమా? ఇప్పుడు యజమాని కూడా లేడు. దేవదాసు చేతికి అమితంగా డబ్బు అందింది. ఇంకా ఏం చేతికొస్తాడు?" అన్నాడు.

పార్వతి ముఖం అమాంతంగా మలిన పడిపోయింది. ఆమె అస్పష్టంగా ఏదో కొంత విని వుంది. బాధపడుతూ అడిగింది "ఏం చెపుతావు ధర్మదాస్? మనోరమ వ్రాసే ఉత్తరాల ద్వారా ఇటువంటి సమాచారం అందుతూ వుంటే విశ్వసించేది కాదు. ధర్మదాసు తల వంచుకొని చెపుతూ వున్నాడు. "తినడం లేదు,

త్రాగడం లేదు, నిద్రపోవటం లేదు. కేవలం మద్యం బాటిల్ మీద బాటిల్-మూడేసి రోజులు, నాలుగేసి రోజులు ఎక్కడుంటాడో కూడా తెలియదు. ఎంతో డబ్బు ఊది పారేస్తున్నాడు. అనేక వేల రూపాయల సొమ్ములు కూడా చేయించాడని వింటున్నాను."

పార్వతి ఆపాద మస్తకం కంపించిపోయింది. "ధర్మదాస్! ఏమిటి నీవు చెప్పేది? ఇది పూర్తిగా నిజమేనా?"

ధర్మదాస్ తన మనసులో అనుకున్నాడు__బహుశా నీ మాట వింటాడేమో! నీవు ఒక్కసారి వారించి చూడు. ఎటువంటి శరీరం ఎట్లా అయిపోయింది? ఇలా నిగ్రహం కోల్పోతే, అత్యాచారాలకు గురయితే ఎంత కాలం జీవిస్తాడు? ఈ విషయం ఎవరితో చెప్పేది? తల్లీ, తండ్రీ, అన్న లాంటి వాళ్ళతో ఇటువంటి విషయాలు చెప్పలేం" ధర్మదాసు మళ్ళీ ఆలోచించి "విషం పుచ్చుకొని చచ్చిపోదాం అనిపిస్తుంది. ఇక ముందు బ్రతకాలనే కోర్కె కూడా లేదమ్మా!" అన్నాడు.

పార్వతి లేచి వెళ్ళిపోయింది. నారాయణబాబు చనిపోయాడనే సమాచారం తెలిసి బయలుదేరి వచ్చింది. ఈ ఆపద సమయంలో దేవదాసు దగ్గరకు వెళ్ళడం అవసరమని ఆలోచించింది. అయితే తనకు అత్యంత ప్రియుడయిన దేవదాస్ స్థితి ఇలా వుంది. ఎన్నో విషయాలు ఆమె మనసులో మెదులుతూ వున్నాయి. ఆమె దేవదాసును ఎంత ధిక్కరించిందో అంతకు వేయిరెట్లు తనను తాను ధిక్కరించుకున్నది. తాను వుంటే ఆయన ఇలా చెడిపోయి వుండేవాడు కాడని ఆమె మనసులో వేయిసార్లు అనుకున్నది. మధ్యలోనే ఆమె తన కాళ్ళమీద తాను గొడ్డలి వ్రేటు వేసుకున్నది. కాని ఆ గొడ్డలి ఆమె తలమీద పడింది. తన దేవదాసు ఇలా అయిపోతున్నాడు. ఈ రకంగా నష్టపోతున్నాడు. తానేమో మరొకరి సంసారం నిలబెట్టడంలో నిమగ్నమై వుంది. పరులను తన వాళ్ళుగా భావించి నిత్యం భోజనం పంచుతూ వున్నది. ఇక్కడ తన సర్వస్వం అయినవాడు ఆకలితో అలమటించిపోతున్నాడు. ఈరోజు దేవదాసు పాదాల వద్ద తల పగలగొట్టుకుని ప్రాణాలు త్యజిస్తానని పార్వతి ప్రతిజ్ఞ చేసింది.

సాయంత్రం కాబోతూ వుంది. పార్వతి, దేవదాసు గదిలోకి ప్రవేశించింది. దేవదాసు మంచంమీద కూర్చొని లెక్క చూస్తూ వున్నాడు. ఇటు చూశాడు_పార్వతి నెమ్మదిగా తలుపు వేసివచ్చి నేలమీద కూర్చున్నది. దేవదాసు తలెత్తి నవ్వి ఆమె వైపు చూశాడు. ఆమె వదనం విషాదంతో నిండి వుంది. అయితే శాంతంగా వుంది. అమాంతంగా కుతూహలంతో "ఒకవేళ నేను నీ మీద అపనింద వేస్తే?" అన్నాడు.

పార్వతి సిగ్గుపడుతూ నీలి కమలాల్లాంటి రెండు కళ్ళతో ఒకసారి అతడివైపు చూసింది. తరువాత కళ్ళు వాల్చుకుంది. దేవదాసు అన్నటువంటి ఆ

మాట ఆమె హృదయంలో జీవితాంతం ఉండేటట్లుగా ముద్ర బడిపోయిందని చక్కగా తెలియచేసింది. ఆమె దేవదాసుతో ఎన్నో విషయాలు చెప్పాలని వచ్చింది. కాని అన్నీ మరచిపోయింది. ఒక్కటి కూడా చెప్పలేకపోయింది. దేవదాసు మళ్ళీ నవ్వి "నాకు తెలుసు, నాకు తెలుసు. సిగ్గువేస్తుంది కదూ?" అన్నాడు. అప్పుడు కూడా పార్వతి ఏ మాటా చెప్పలేకపోయింది. "ఇందులో సిగ్గుపడవలసినది ఏముంది? నేనూ, నీవూ ఇద్దరమూ బాల్యంలో ఒకచోట తోడు తోడుగా లేస్తూ, కూర్చుంటూ, ఆడుతూ పాడుతూ తిరిగాము. ఈ కాలంలోనే మధ్యలో ఒక గందరగోళం జరిగింది. కోపం వచ్చి నీ యిష్టం వచ్చినట్లు మాట్లాడేశావు. నేను కూడా నీ తలమీద గుర్తుగా ఈ మచ్చ వేశాను. ఎలా వుంది?" అన్నాడు దేవదాసు.

దేవదాసు మాటలో శ్లేషగానీ, విడ్డూరంగానీ లేశ మాత్రం గూడా లేదు. నవ్వుతూ నవ్వుతూనే పూర్వం జరిగిపోయిన దుఃఖగాథను చెప్పి వినిపించాడు. అది విని పార్వతి హృదయం పగిలి బ్రద్దలై పోయింది. నోటికి చీర చెంగు అడ్డం పెట్టుకుని, ఓ దీర్ఘమయిన నిట్టూర్పు విడిచి మనసు లోపలనే అనుకున్నది_"దేవదాదా! ఈ మచ్చ మాత్రమే నా ఓదార్పుకు కారణంగా వుంది. ఇది ఒక్కటే నా ఏకైక సహచరి. నీవు నన్ను ప్రేమించేవాడివి. అందుకు నామీద దయతలచి మన ఇరువురి బాల్య చరిత్రను ఈ రూపంలో ఈ లలాటంమీద ముద్రించావు. దీనికి నేను సిగ్గుపడటం లేదు. ఇది నాకు కళంకం కాదు. ఇది నా గౌరవ చిహ్నం!"

"పత్తో!"

"ఏమిటి?" అన్నది పార్వతి నోటికి అడ్డంగా పెట్టుకున్న చీర చెంగు తొలగించుకోకుండానే.

"నీ మీద నాకు చాలా కోపం వస్తున్నది."

ఈసారి దేవదాసు కంఠస్వరం వికృతమైపోయింది_"నాన్నగారు లేరు. ఇది నేను ఆపదలో వున్న కాలం. అయినా నీవు వుంటే నాకు ఏమీ చింత వుండదు. వదినగారి విషయం నీకు తెలిసే వుందికదా? అన్నగారి స్వభావం నీకు తెలియదేమీ కాదు! నీవే ఆలోచించు! అమ్మను తీసికొని నేను ఏం చేసేది? నా విషయం ఏమవుతుందో ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. నీవు వుంటే అంతా నీ చేతికి ఒప్పగించి నేను నిశ్చింతగా వుండిపోతాను. ఏం పత్తో?"

పార్వతి బోరున ఏడ్చింది." ఏడుస్తున్నావా ఏం? అయితే ఇక ఏమీ చెప్పను" అన్నాడు దేవదాసు.

పార్వతి కళ్ళు తుడుచుకొంటూ "కాదు, చెప్పు" అన్నది.

దేవదాసు ద్వారాన్ని సరిచేసికొని "పత్తో! ఇప్పుడు నీవు పూర్తిగా గృహిణివై పోయావు గదూ?" అన్నాడు.

ముసుగు లోపలే పెదవులు పంటితో నొక్కుకుంటూ, మనసులోనే అనుకున్నది_"గృహిణిని ఏమయ్యానో! బూరుగు పువ్వును ఎన్నడైనా దేవుని సేవకు ఉపయోగిస్తారా?"

దేవదాసు నవ్వుతూ "నాకు బాగా నవ్వు వస్తుంది. నీవు ఎంత చిన్నదానివి, ఇప్పుడు ఎంత పెద్దదానివై పోయావు? గొప్ప భవంతి, పెద్ద జమీందారీ, పెద్ద పెద్ద కొడుకులూ, కూతుళ్ళూ వున్నారు. అందరికన్నా పెద్దవారు చౌదరిగారు. ఏం పత్తో?" అన్నాడు.

చౌదరిగారు పార్వతికి బాగా నవ్వుకొనే వస్తువు. అయన గుర్తుకు రాగానే ఆమెకు నవ్వు వస్తుంది. అంచేతనే ఇంత దుఃఖంలో కూడా ఆమెకు నవ్వు వచ్చేసింది. దేవదాసు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో "ఏం, ఒక ఉపకారం చేసి పెట్టగలవా?" అన్నాడు.

పార్వతి తలెత్తి "ఏమిటీ?" అన్నది.

"మీ గ్రామంలో మంచిపిల్ల ఎవరైనా లభించగలదా?"

పార్వతి కొంచెం దగ్గి "మంచి పిల్లా? ఏం చేసుకుంటావు?"

"లభిస్తే పెళ్ళి చేసుకొంటాను. ఒకసారి గృహస్థుణ్ణి కావాలని కోర్కె కలుగుతున్నది."

"బాగా అందమైనది కదూ?" అడిగింది పార్వతి గాంభీర్యంగా.

"అవును. నీ మాదిరిగా."

"మరి బాగా శాంత స్వభావం గలదిగా ఉండాలా?"

"బాగా శాంత స్వభావంతో పనిలేదు. పైగా నీలాగా నాతో పోట్లాడగలగడానికి కొంచెం దుష్ట స్వభావం గలదిగా కూడా ఉండాలి."

పార్వతి మనసులో అనుకొన్నది_ఇది ఎవరూ చేయలేరు దేవదాదా! ఎంచేతనంటే దీనికోసం నాతో సమానంగా ప్రేమ కావాలి" తరువాత పైకి అన్నది_"నేను దురదృష్టవంతురాలివి. నేనెంత? నాలాంటి వాళ్ళు నీ పాదధూళి తీసికొని ధన్యులు కావాలని భావించేవాళ్ళు ఎన్నో వేలమంది ఉన్నారు."

దేవదాసు పరిహాసంగా నవ్వుతూ_"ఏం ఇప్పుడే అటువంటి అమ్మాయిని ఒక దానిని తీసుకురాగలవా?" అన్నాడు.

"దేవదాదా, ఏం, నిజంగా పెళ్ళి చేసుకుంటావా?"

"అటువంటి అమ్మాయినే, నేను చెప్పినట్లుగా వుంటేనే."

ఆమె మినహా యీ ప్రపంచంలో ఆయనకు జీవిత సహచరిణిగా మరెవ్వరు కాలేరని కేవలం విప్పి చెప్పలేదు అంతే!

"దేవదాస్! ఒక మాట చెపుతావా?"

"ఏమిటీ?"

"పార్వతి తనను తాను అదుపులో పెట్టుకుని "నీవు మధ్యం త్రాగడం ఎలా నేర్చుకున్నావు?" అన్నది.

దేవదాసు నవ్వి "త్రాగడం కూడా ఎక్కడైనా నేర్చుకోవలసి వుంటుందా?" అన్నాడు.

"అది కాకపోతే పోనీ అభ్యాసం ఎలా చేసుకున్నావు?"

"ఎవరు చెప్పారు? ధర్మాదాసా?"

"ఎవరైనా చెప్పనివ్వు, ఇందులో నిజం వుందా లేదా?"

దేవదాసు దాచలేదు "కొంచెం వుంది" అన్నాడు.

పార్వతి కొంచెం సేపే స్తబ్దంగా వున్న తరువాత "ఇంకా ఎన్నివేల రూపాయల ఆభరణాలు చేయించి ఇచ్చావు?" అని అడిగింది.

"ఇవ్వలేదు. చేయించి వుంచాను. నీవు తీసుకొంటావా?"

పార్వతి చేయిచాపి "ఇవ్వు, ఇదుగో చూడు, నా ఒంటిమీద ఒక్క ఆభరణం కూడా లేదు.

"చౌదరిగారు నీకు ఇవ్వలేదా?"

"ఇచ్చారు, కాని నేను వాటి నన్నిటినీ ఆయన పెద్దకూతురుకు ఇచ్చేశాను."

"ఇప్పుడు నీకు అవసరం లేదన్నట్లుగా కన్పిస్తూ వుంది."

పార్వతి ముఖం ఊపి తల వంచుకున్నది. దేవదాసు కళ్ళు చెమ్మగిల్లాయి. సాధారణమైన దుఃఖంలో వున్న స్త్రీలు తమ ఆభరణాలు తీసి ఇవ్వరు అని దేవదాసు మనసులో అనుకున్నాడు. కాని కంటి నుంచి వెలువడుతున్న అశ్రువులను ఆపుకొని నెమ్మదిగా అన్నాడు_"నేను ఏ స్త్రీని ప్రేమించలేదు, ఏ స్త్రీకీ నేను ఆభరణాలు ఇవ్వలేదు. ఇది అబద్ధం."

పార్వతి దీర్ఘంగా నిట్టూర్చి మనసులో "నా నమ్మకం కూడా అదే" అనుకొన్నది.

కొంచెం సేపటి దాకా ఇరువురూ మౌనంగా వున్నారు. తరువాత "ఇక మధ్యం త్రాగనని ప్రతిజ్ఞ చేయి" అన్నది పార్వతి.

"ఇది చేయలేను. నీవు నన్ను మరపించగలనని ప్రతిజ్ఞ చేయగలవా?"

పార్వతి ఏమీ అనలేదు. ఇదే సమయంలో బయటి నుంచి సంధ్యాకాలపు శంఖధ్వని వినిపించింది. దేవదాసు కిటికీలో నుంచి బయటికి చూసి "సాయంత్రం మయిపోయింది. ఇక ఇంటికి వెళ్ళు పత్తో!" అన్నాడు.

"నేను వెళ్ళను, నీవు ప్రతిజ్ఞ చేయి."

"ఎందుకు? నేను చేయలేను!"

"ఎందుకు చేయలేవు?"

"ఏం అందరూ అన్ని పనులు చేయగలరా?"

"కోరుకుంటే తప్పకుండా చేయగలరు."

"ఈ రాత్రికి లేచి పారిపోదాం, మరి నీవు నాతో పాటు రాగలవా?"

పార్వతి హృదయ స్పందన హఠాత్తుగా ఆగిపోయినట్లే వుంది. అప్రయత్నంగానే ఆమె నోట "ఇది సాధ్యమా?" అనే మాట వచ్చింది.

దేవదాసు కొంచెం మంచం పైకి జరిగి కూర్చొని "పార్వతీ! తలుపు తెరువు" అన్నాడు.

దేవదాసు నిలబడి నెమ్మదిగా అంటూ వున్నాడు__పత్తో, బలవంత పెట్టి ప్రతిజ్ఞ చేయించడం మంచిదా? దాని వలన ప్రత్యేకమైన ప్రయోజనం ఏమైనా వుందా? ఇవ్వాళ చేసిన ప్రతిజ్ఞ బహుశా రేపు వుండక పోవచ్చు. ఎందుకు నన్ను అసత్యవాదిగా చేస్తావు?"

మరికొన్ని క్షణాలు ఊరకనే నిశ్శబ్దంగా గడిచిపోయాయి. ఇదే సమయంలో ఏ ఇంట్లోనే గాని టన్ టన్ మంటూ తొమ్మిది గంటలు కొట్టింది గడియారం. దేవదాసు హడావిడిగా "తలుపు తెరువు పత్తో!" అన్నాడు.

పార్వతి ఏమీ మాట్లాడలేదు.

"వెళ్ళు పత్తో!"

"నేను వెళ్ళనే వెళ్ళను." అని పార్వతి హఠాత్తుగా మైకం వచ్చిపడిపోయింది. చాలా సేపటి వరకు వెక్కి వెక్కి ఏడుస్తూ వుంది. ఈ సమయంలో గదిలో గాఢాంధకారమే వుంది. ఏమీ కన్పించడమే లేదు. దేవదాసు కేవలం తన ఊహ ప్రకారం పార్వతి నేలమీద పడి ఏడుస్తున్నదని తెలుసుకున్నాడు. "పత్తో!" అని నెమ్మదిగా పిలిచాడు.

పార్వతి ఏడుస్తూనే "దేవదాదా, నాకు చాలా బాధ కలుగుతూ వుంది" అన్నది. దేవదాసు నెమ్మదిగా దగ్గరకు జరిగి వచ్చాడు. ఆయన కళ్ళల్లో గూడా నీళ్ళు నిండిపోయాయి కాని స్వరం మాత్రం వికృతం కాలేదు. "ఇదేమిటి, నాకు తెలియదు పత్తో!" అన్నాడు.

"దేవదాదా నేను చచ్చిపోతాను కూడా. కాని ఎన్నడూ నీకు సేవ చేయలేక పోయాను, అది నా చిరకాల వాంఛ."

చీకటిలో కళ్ళు తుడుచుకుంటూ "ఆ సమయం కూడా వస్తుంది" అన్నాడు దేవదాసు.

"అయితే నాతోపాటు వచ్చేసెయ్. ఇక్కడ నిన్ను చూసే వాళ్ళు ఎవరూ లేరు."

"నీ ఇంటికి వస్తే బాగా సేవ చేస్తావా?"

"అది నా బాల్యకాలపు కోర్కె. ఓ స్వర్గంలోని దేవుడా! నా యీ కోర్కెను నెరవేర్చు. ఆ తరువాత నేను మరణించినా నాకేమీ దుఃఖం వుండదు."

ఈసారి దేవదాసు కళ్ళు కూడా అశ్రువులతో నిండిపోయాయి. దేవదాస్ నా దగ్గరకు వచ్చేసెయ్!" అని పార్వతి మళ్ళీ చెప్పింది.

దేవదాసు కళ్ళు తుడుచుకొని "సరే మంచిది, వస్తాను" అన్నాడు.

"వస్తాను అని నా తల మీద చేయివేసి చెప్పు!"

దేవదాసు తడుముకుంటూ పార్వతి కాలు తాకి "ఈ మాట నేను ఎన్నటికీ మరచిపోను. నేను వచ్చినందువల్లనే నీ దుఃఖం తొలగిపోతుందని భావిస్తే నేను తప్పకుండా వస్తాను. చావబోయే ముందు కూడా యీ మాట జ్ఞాపకం వుంటుంది" అన్నాడు.

TOne Home TVNewsMovie NewsVideosRadioTelugu MoviesKidsoneComedyShoppingBhaktiGreetingsNRI CornerRomanceCharityMore...

## 13

తండ్రి మరణించిన తరువాత ఆరు మాసాలు గడిచిపోయాయి. దేవదాసుకు ఇంటి మీద పూర్తిగా విరక్తి కలిగింది. శాంతి లేదు, సౌఖ్యం లేదు. జీవితంలో మార్పు లేదు. పార్వతి చింత కారణంగా మనస్సు నిలకడ లేకుండా పోయింది. పైగా ఇప్పుడు ఆమె చేసిన ప్రతి పనీ, ఆమె ప్రదర్శించిన ప్రతి హావభావమూ నిత్యం అతడి కళ్ళ ముందు ప్రత్యక్షంగా చిత్రంలాగా నర్తిస్తూ వున్నాయి. దానికితోడు అన్నా వదినెల నిర్లిప్తమైన వ్యవహారాలు దేవదాసు సంతాపాన్ని మరింతగా అధికం చేశాయి.

తల్లి స్థితి కూడా దేవదాసు స్థితి లాగానే వుంది. భర్త మరణంతో పాటు ఆమె సుఖాలన్నీ అంతరించి పోయాయి. పరాధీనతతో ఈ ఇంట్లో వుండటం ఆమె కూడా సహించలేకపోతూ వుంది. ఇప్పుడు అనేక రోజుల నుంచి ఆమె కాశీ వాసాన్ని గురించి ఆలోచిస్తూ వుంది. కేవలం దేవదాసు అవివాహితుడుగా ఉన్న కారణంగా ఆమె ఇప్పుడే వెళ్ళలేకపోతూ ఉంది. "దేవదాస్, ఇక నీవు పెళ్ళి చేసుకో, నా కోరిక నెరవేరుతుంది" అని ఆమె అప్పుడప్పుడు అంటూ వుంటుంది. కాని అది ఇప్పుడు ఎలా సాధ్యమవుతుంది? ఒకటేమో తండ్రి కర్మకాండ పూర్తి కాలేదు. రెండోది అభిరుచికి అనుకూలమైన కన్య లభించలేదు. పార్వతి పెళ్ళి ఇప్పుడైతే బాగుండేదని దేవదాసు తల్లి అప్పుడప్పుడు దుఃఖిస్తూ ఉంటుంది. ఒక రోజు ఆమె దేవదాసును పిలిచి "ఇప్పుడు నేను ఇక్కడ వుండదలచుకోలేదు. కొన్ని రోజుల పాటు కాశీలో ఉండి వద్దామని కోరికగా ఉంది" అని చెప్పింది. దేవదాసు కూడా

అదే ఆలోచనలో ఉన్నాడు. "నా అభిప్రాయం కూడా అదేనమ్మా. ఆరు మాసాల తరువాత తిరిగి రా" అన్నాడు.

"అలాగే చెయ్యి. నేను తిరిగి వచ్చిన తరువాత ఆయనగారి ఆబ్దికం అయిపోయిన తరువాత, నీ పెళ్ళి చేసి, నీవు గృహస్థుడివి కావడం చూసి నేను మళ్ళీ కాశీకి వెళ్ళిపోతాను!"

దేవదాసు ఆమె అభిప్రాయంతో ఏకీభవించి, కొన్ని రోజుల పాటు ఉండటం కోసం ఆమెను కాశీకి చేర్చి, తాను కలకత్తాకు వెళ్ళిపోయాడు. ద్కలకత్తా వచ్చిన దేవదాసు నాలుగైదు రోజుల వరకూ చున్నీలాల్ ను వెతుకుతూ వున్నాడు. ఆయన లభించలేదు. ఆ మెస్ విడిచిపెట్టి మరో చోటకు వెళ్ళిపోయాడని తెలిసింది ఒకరోజు సాయంకాలం దేవదాసుకు, చంద్రముఖి సంగతి జ్ఞాపకం వచ్చింది. ఒకసారి చూసి రావడం బాగుంటుంది అనుకొన్నాడు. ఇన్ని రోజుల వరకూ ఏమీ గుర్తు కూడా రాలేదు. అంచేత కొంచెం సిగ్గుపడ్డాడు కూడా. ఒక బాడుగ బండి మాట్లాడుకొని వెళ్ళాడు. కొంచెం చీకటి పడిన తరువాత చంద్రముఖి ఇంటి ముందుకు వచ్చి బండి ఆగిపోయింది. చాలా సేపు పిలిచి, పిలిచి అరిచిన తరువాత లోపల నుంచి ఒక స్త్రీ "ఇక్కడ లేదు" అని జవాబు చెప్పింది. ఎదురుగా ఒక విద్యుత్ స్తంభం ఉంది. దేవదాసు దానికి దగ్గరగా వెళ్ళి నిలబడి "ఆమె ఎక్కడకు వెళ్ళిందో చెప్పగలవా?" అన్నాడు. కిటికీ తెరిచి ఆమె ఎక్కడకు వెళ్ళిందో చెప్పగలవా?" అన్నాడు. కిటికీ తెరిచి ఆమె కొన్ని క్షణాలు చూసిన తరువాత "మీరు దేవదాసు గారా?" అన్నది.

"అవును."

"ఉండండి....తలుపు తీస్తాను" అని తలుపు తీసి "రండి" అన్నది. ఆమె కంఠస్వరం పరిచితమైనదిగా అనిపించింది. అయినా గుర్తుపట్టలేక పోయాడు. అందులో కొంచెం చీకటి పడింది కూడా. సంశయిస్తూ "చంద్రముఖి యెక్కడ ఉంటుందో ఏమైనా చెప్పగలవా?" అన్నాడు.

ఆ స్త్రీ తియ్యగా నవ్వుతూ "ఆఁ మీరు పైకి వెళ్ళండి" అన్నది. ఈసారి దేవదాసు గుర్తుపట్టాడు. "ఆఁ! నీవేనా?"

"అవును, నేనే. దేవదాస్ నన్ను పూర్తిగా మరచిపోయారా?"

పైకి వచ్చి దేవదాసు చూశాడు. చంద్రముఖి నల్లని అంచుగల ఓ మురికి చీర కట్టుకొని ఉంది. చేతులకు కేవలం రెండు మురుగులు తప్ప ఆ వంటి మీద మరే ఆభరణమూ లేదు. ఆమె శిరోజాలు అటూ ఇటూ చెదిరిపోయి వున్నాయి. దేవదాసు ఆశ్చర్యపోయి, "నీవే?" అన్నాడు. బాగా పరీక్షగా చూసాడు. చంద్రముఖి పూర్వం కన్నా బాగా బలహీన పడిపోయి వుంది.

"నీవు జబ్బు పడ్డావా?" అడిగాడు దేవదాసు.

"శారీరకంగా ఏమీ జబ్బు పడలేదు. చక్కగా కూర్చో."

దేవదాసు మంచం మీద కూర్చొని చూశాడు. ఇంట్లో పూర్వం కన్న మార్పు వచ్చింది. అప్పటికీ ఇప్పటికీ, ఆకాశానికీ పాతాళానికీ వున్నంత తేడా వుంది. గృహ యజమానురాలు మాదిరిగానే దాని దుస్థితికి మేర లేకుండా పోయింది. ఇంట్లో సామాను ఒక్కటి కూడా లేదు. ఆల్ మైరాటేబుల్, కుర్చీ మొదలైనవాటి స్థానాలన్నీ పడివున్నాయి. కేవలం ఒక మంచం మాత్రం మిగిలివుంది. దుప్పటి బాగా మురుకిపట్టి వుంది. గోడ మీద వుండే పటాలన్నీ ఒక్కటి గూడా లేవు. ఇనుప మేకులు మాత్రం ఇంకా గోడలో దిగబడే వున్నాయి. ఒకటి రెండు ఎర్రని పట్టీలు మాత్రం ఇటూ అటూ వ్రేలాడుతున్నాయి. పూర్వపు ఆ గడియారం మాత్రం బ్రాకెట్ మీద పెట్టి వుంది. కాని మౌనంగా వుంది. అక్కడక్కడ మూలల్లో బూజు పట్టి వుంది. ఒక మూల నూనె దీపం కాంతి లేకుండా వెలుగుతూ వుంది. ఆ గుడ్డి దీపం వెలుగులోనే దేవదాసు ఆ యింటి ప్రస్తుత పరిస్థితి అంతా చూశాడు. నివ్వెరపోయి "చంద్రా! ఏమిటీ దురదృష్టం? ఎందుకు సంభవించింది?" అన్నాడు. చంద్రముఖి కళా హీనంగా నవ్వి, "దురదృష్టమని ఎవరు చెప్పారు మీకు? ఇది నా అదృష్టమే అనుకోవాలి" అన్నది.

దేవదాసు అర్థం కాలేదు. నీ ఆభరణాలన్నీ ఏమయ్యాయి?" అన్నాడు.

"అమ్మేశాను."

"సామానులు?"

"అవి కూడా అమ్మేశాను."

"ఇంట్లో పటాలు కూడా అమ్మేశావా?"

ఈసారి చంద్రముఖి నవ్వి ఎదురుగా వున్న ఒక ఇంటిని చూపించి "ఆ యింటి యజమానికి అమ్మేశాను" అన్నది.

దేవదాసు కొంచెం సేపు ఆమె ముఖంవైపు చూసి "చున్నీబాబు ఎక్కడున్నాడు?" అన్నాడు.

"చెప్పలేను. రెండు మసాలయింది. పోట్లాడి వెళ్ళిపోయాడు. మళ్ళీ అప్పటి నుంచి రాలేదు."

దేవదాసు ఇప్పుడు మరీ ఆశ్చర్యం కలిగింది. "పోట్లాట ఎందుకొచ్చింది?" అని అడిగాడు.

"ఏం పోట్లాట జరగదా?" అన్నది చంద్రముఖి.

"జరుగుతుంది, కాని ఎందుకు?"

"దలారి పని చేయడానికి వచ్చాడు. అంచేత తొలగించాను."

"ఎవరికి దలారి పని?"

చంద్రముఖి నవ్వి "విటులకు. నీవు తెలియదులే ఒక గొప్ప మనిషిని పట్టుకొచ్చాడు. నెలకు రెండువందల రూపాయలు, ఒక సెట్ ఆభరణాలు, వాకిలి ముందు ఒక కాపలావాడు. లభిస్తాడు. తెలిసిందా!"

ఇదంతా తెలుసుకున్న తరువాత దేవదాసు నవ్వి "వాటన్నిటిలో ఒకటి కూడా కన్పించడం లేదే?" అన్నాడు.

"వుంటే గదా కన్పించడానికి? నేను వాళ్ళను తొలగించేశాను."

"వాళ్ళ అపరాధమేమిటి?"

"వాళ్ళ అపరాధం అంత ఎక్కువేమీ లేదు. కాని నాకు నచ్చలేదు."

దేవదాసు బాగా ఆలోచించి "ఆ రోజునుంచి ఇక్కడకు మరెవ్వరూ రాలేదా?" అన్నాడు.

రాలేదు. ఆ రోజు నుంచే ఏమిటి? నీవు వెళ్ళిన దగ్గర నుంచే ఇక్కడకు ఎవ్వరూ రాలేదు. మధ్య మధ్యలో కేవలం చున్నీలాల్ మాత్రం వస్తుండేవాడు. అయితే రెండు మాసాల నుంచి ఆయన కూడా రావడం లేదు."

దేవదాసు ప్రక్కమీద పడుకొన్నాడు. మరో వైపు చూస్తూ వున్నాడు. చాలా సేపటివరకు మౌనంగా వున్న తరువాత నెమ్మదిగా "అయితే వ్యాపారం అంతా ఎత్తేశావన్న మాట!" అన్నాడు.

"అవును, దివాలా తీశాను."

దేవదాసు యీ మాటకు ప్రత్యుత్తరమియ్యకుండా "అయితే తిండీ తిప్పలు ఎట్లా జరుగుతున్నాయి?" అన్నాడు.

"అందుకే వున్న ఆభరణాలన్నీ అమ్మేశాను."

"అందులో ఇప్పుడు ఎంత మిగిలి వుంది.

"ఎక్కువగా లేదు. ఎనిమిది, తొమ్మిది వందలు వున్నాయి. అవి ఒక దుకాణదారుని వద్ద వుంచాను. అతడు వాటి మీద నెలకు ఇరవై రూపాయలు

ఇస్తాడు."

"ఇరవై రూపాయలతో ఇదివరకు నీకు జరిగేది కాదే?"

"జరిగేది కాదు. ఇప్పుడు కూడా బాగా జరగడంలేదు. మూడు మాసాలనుంచి యింటి అద్దె బకాయిపడి వుంది. అందుకే యీ రెండు మురుగులూ అమ్మేసి అప్పులన్నీ తీర్చి మరెక్కడికైనా వెళ్ళిపోదామను కుంటున్నాను."

"ఎక్కడికి వెళతావు?"

"అది యింకా నిశ్చయించుకోలేదు. ఏదైనా చౌక ప్రదేశానికి, ఏ పల్లెటూరుకో వెళతాను. నెలకు ఇరవై రూపాయలతో జరిగే చోటుకు."

"ఇన్ని రోజుల నుంచి ఎందుకు వెళ్ళలేదు. ఒకవేళ నిజంగా మరో ఉద్దేశ్యం లేకపోతో మరి యిన్నిరోజులు ఇక్కడ వుండి వ్యర్థంగా అప్పు ఎందుకు పెంచుకున్నావు?"

చంద్రముఖి తల వంచుకొని ఏదో ఆలోచిస్తూ వుంది. ఆమె జీవితములో సంభాషించడంలో సిగ్గుపడవలసి వచ్చిన మొట్టమొదటి అవకాశము ఇదే. "మాట్లాడవేం?" అన్నాడు దేవదాసు.

చంద్రముఖి మంచంమీద మరో సంకుచిత భావంతో కూర్చొని నెమ్మదిగా "కోప్పడవద్దు, వెళ్ళే ముందు నిన్ను కలుసుకొనడం బాగుంటుందని అనుకున్నాను. ఒకసారి నీవు తప్పకుండా రాగలవని ఆశిస్తూ వున్నాను. ఈరోజు నీవు వచ్చావు. ఇక రేపే వెళ్ళే ప్రయత్నం చేస్తాను. కాని ఎక్కడకు వెళ్ళేది ఏమయినా చెప్పగలవా?" అన్నది.

TOne Home TVNewsMovie NewsVideosRadioTelugu MoviesKidsoneComedyShoppingBhaktiGreetingsNRI CornerRomanceCharityMore...

HOMENOVELSPUBLICATIONS

Share|

దేవదాసు

Prev

## Next

దేవదాసు ఆశ్చర్యపోయి లేచి కూర్చున్నాడు. కేవలం నన్ను చూడాలనే ఆశతోనే ఆగి వున్నావా? కాని ఎందుకు?" అన్నాడు.

ఒక అభిప్రాయం. నీవు నన్ను చాలా ఏవగించుకొంటున్నావు. యెన్నడూ ఇంతగా నన్ను ఎవరూ ఏవగించుకొనలేదు. బహుశా ఇందు వల్లనే. నీకు ఇప్పుడు జ్ఞాపకం వుందో, లేదో అది నేను చెప్పలేను. కాని నాకు బాగా జ్ఞాపకం వున్నది. ఏమిటంటే ఏ రోజైతే నీవు మొట్ట మొదట ఇక్కడకు వచ్చావో ఆ రోజే నీ మీద నా దృష్టి పడింది. నీవు ధనవంతుల బిడ్డవని నాకు తెలుసు. అయితే ధన లోభంతో నేను నీ వైపుకు మొగ్గలేదు. నీ కన్న ముందు ఎంతోమంది వ్యక్తులు ఇక్కడకు వచ్చారు, వెళ్ళారు. కాని ఎవరిలోనూ ఇంత తేజస్సు చూడలేదు. నీవు రావడంతోనే నన్ను గాయపరచావు. ఒక అయాచితమైన ఉపయుక్తమైన కాని అనుచితమైన వ్యవహారం ప్రారంభించావు. ఏవగింపుతో మొహం మలుపుకున్నావు. చివరకు వేడుక మాదిరిగా కొంత యిచ్చి వెళ్ళిపోయావు. ఈ విషయాలన్నీ నీకు గుర్తు వస్తున్నాయా?

దేవదాసు మౌనం వహించాడు. చంద్రముఖి మళ్ళీ చెపుతూ వుంది. ఆ రోజు నుంచే నీ మీద నా దృష్టి పడింది. నేను నిన్ను ప్రేమించడమూ లేదు, ద్వేషించడమూ లేదు. ఒక కొత్త వస్తువును చూసినపుడు ఎలాగైతే అది మనసులో ఎల్లప్పుడు గుర్తు వుంటుందో, అలాగే నిన్ను కూడా చూసి ఏ విధంగానూ మరవలేకపోయాను. నీవు వచ్చినప్పుడు చాలా భయంతోనూ,సావధానంగానూ వుండేదాన్ని. కాని రాకపోతే కొంచెం బాగుండేది కూడా కాదు. తరువాత ఎలా మతి భ్రమించిందో తెలియదు కాని ఈ రెండు కళ్ళకు అన్ని వస్తువులూ ఒకే విధంగా కన్పించసాగాయి. నేను పూర్వం కన్నా పూర్తిగా మారిపోయాను. నేను పూర్వం ఎటువంటి దాన్నిగా వుండేదాన్నో ఇప్పుడు అటువంటి దాన్నిగా లేను. తఃరువాత నీవు మద్యం తాగడం ప్రారంభించావు. మద్యం అంటే నాకు చాలా అసహ్యం. ఎవరైనా మద్యం త్రాగి ఆ మైకంలో వుంటే నాకు అతడి మీద చాలా కోపం వచ్చేది. కాని నీవు కైపులో వున్నా కోపం వచ్చేది కాదు. చాలా దుఃఖం కలిగేది."

ఇదంతా చెప్పి చంద్రముఖి దేవదాసు పాదాలమీద చేతిని వుంచి అశ్రుపూరిత నయనాలతో "నేను చాలా అధమురాలను, నా అపరాధాలను

దృష్టిలో వుంచుకోవద్దు. నీవు ఎంతగా మాటలు చెపుతూ నన్ను ఏవగించుకొంటూ వుండేవాడివో అంతగా నేను నీ దగ్గరకు రావాలని కోరుకునే దాన్ని. చివరకు నిద్రపోయిన మీదట_"వుండనివ్వు, ఈ మాటలు చెప్పను, చెపితే కోప్పడిపోతావు" అన్నది. దేవదాసు ఏమీ అనలేదు. కొత్తగా జరిగే సంభాషణ అతనికి వేదనను కలిగిస్తూ వుంది. చంద్రముఖి చాటుగా కళ్ళు తుడుచుకుని "మేము ఎంతో సహించేవాళ్ళమనీ, నిందలనూ, అవమానాలనూ జఘన్య అత్యాచారాలనూ, ఉపద్రవాలనూ, వాటికి సంబంధించిన విషయాలనూ సహించగలమనీ ఒకరోజు నీవు అన్నావు. ఆ రోజు నుంచే నాకు చాలా అభిమానం కలిగింది_అప్పుడే నేను అంగడిని మూసివేశాను."

దేవదాసు కూర్చొని "అయితే యీ జీవితం ఎలా గడుస్తుంది?" అని అడిగాడు.

"అది మొదటనే చెప్పేశాను గదా!" అన్నది చంద్రముఖి.

"ఈ సంగతి ఆలోచించు. ఒకవేళ అతడు నీ డబ్బు అంతా సొంతం చేసుకుంటే?"

చంద్రముఖి భయపడలేదు దీనికి. శాంతంగానూ, సహజంగానే చేసుకున్నా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఆపద వచ్చినప్పుడు నీ దగ్గర నుంచి కొంచెం బిచ్చం అడుగుదామని కూడా ఆలోచించే వున్నాను." అన్నది.

దేవదాసు ఆలోచించి "అది తరువాత అడిగి తీసుకో. యిప్పుడు మరెక్కడికైనా వెళ్ళడానికి ప్రయత్నించు" అన్నాడు.

రేపే ప్రయత్నిస్తాను. మురుగు కూడా అమ్మి ఒకసారి దుకాణదారుణ్ని కూడా కలుసుకుంటాను."

దేవదాసు పాకెట్ లో నుంచి వందేసి రూపాయలవి అయిదునోట్లు తీసి దిండు క్రింద బెట్టి "మురుగులు అమ్మవద్దు, కేవలం దుకాణదారుణ్ని కలుసుకో. కాని వెళ్ళేది ఎక్కడికీ? ఏదైనా తీర్థస్థానానికా?"

"కాదు దేవదాస్! తీర్థాలమీద, ధర్మంమీద నాకు ఎక్కువ శ్రద్ధలేదు. కలకత్తా నుంచి ఎక్కువ దూరం వెళ్ళను. చుట్టుప్రక్కల ఏ పల్లెటూరికైనా వెళ్ళి వుంటాను."

"ఏదైనా మంచి ఇంట్లో దాసీ పని చేస్తావా?"

చంద్రముఖి కళ్ళు మళ్ళీ అశ్రుపూరితాలయ్యాయి. కళ్ళు తుడుచుకుని, యిష్టం లేదు. స్వతంత్రంగా, స్వేచ్ఛగా వుంటాను. దుఃఖం అనుభవించడానికి ఎందుకు వెళ్ళాలి? కాయకష్టం ఎప్పుడూ చేయలేదు. ఇప్పుడు కూడా చేయలేను.

ఎక్కువగా పెనుగులాడితే చిందర వందరై పోతాను" అన్నది.

దేవదాసు విషణ్ణ వదనంతో కొంచెం నవ్వి "అయితే పట్టణానికి దగ్గరగా వుంటే మళ్ళీ ప్రలోభంలో పడిపోగలవు. మనిషి మనసు విశ్వసించదగినది కాదు" అన్నాడు.

ఈసారి చంద్రముఖి వదనం వికసించింది. నవ్వింది. మళ్ళీ అన్నది. "యీ మాట నిజం. మనిషిని విశ్వసించలేము. కాని ఇప్పుడు నేను ప్రలోభంలో పడను. స్త్రీలలో లోభం అధికంగా వుంటుంది. ఇది నేను ఒప్పుకుంటాను. దేనిమీద లోభం వుందో దాన్నే స్వేచ్ఛగా వదిలి వేసినపుడు నేను ఇక భయపడవలసిన పనిలేదు. అకస్మాత్తుగా ఏ ఆవేశంలోనో వదిలివేస్తే అప్పుడు జాగ్రత్త పడవలసిన అవసరం వుంటుంది. కాని ఇంత దీర్ఘకాలం వదిలేసి వున్నాను. అందుకు ఒక్కరోజు కూడా పశ్చాత్తాపం కలగలేదు. నేను చాలా సుఖంగానే వున్నాను."

దేవదాసు తల వూపి "స్త్రీల మనస్సు చాలా చంచలమయినది. విశ్వసనీయమయినది కాదు" అన్నాడు.

ఈసారి చంద్రముఖి కొంచెం జరిగి పూర్తిగా దగ్గరకు వచ్చి కూర్చున్నది. చేయి పట్టుకొని "దేవదాస్!" అన్నది.

దేవదాసు ఆమె ముఖం వైపు చూస్తూ వున్నాడు. ఈసారి నన్ను తాకవద్దని అనలేకపోయాడు.

చంద్రముఖి కళ్ళు స్నేహభావంతో విస్ఫారితములైనాయి. కొంచెం కంపిస్తున్న కంఠంతో అతడి చేతులను తన ఒళ్ళోకి లాగుకొని "నేడు ఆఖరు రోజు, కోపించవద్దు. ఒక మాట నిన్ను అడగాలనే అభిలాష ఉన్నది_"అని చెప్పి కొంతసేపు దేవదాసు ముఖం వైపు చూసి "పార్వతి నిన్ను చాలా లోతుగా గాయపరిచిందా?" అన్నది.

దేవదాసు కనుబొమలు ముడుచుకుని_ "ఈ సంగతి ఎందుకు అడుగుతున్నావు?" అన్నాడు.

చంద్రముఖి చలించలేదు. శాంతంగా, దృఢంగా అన్నది_"నాకు పని ఉంది.నేను నిజం చెపుతున్నాను. నీకు దుఃఖం కలుగజేస్తూ నాకూ దుఃఖం కలుగుతుంది. ఇది తప్ప బహుశా నాకు చాలా విషయాలు తెలుసు. మధ్య మధ్యలో మద్యం కైపులో నీ నోటినుంచి అటువంటి మాటలు అనేకం విన్నాను. అయినా కూడా పార్వతి నిన్ను మోసగించిందనే మాట నేను విశ్వసించలేకపోతున్నాను. పైగా నిన్ను నీవే స్వయంగా మోసగించుకున్నావని నా మనస్సులో అనిపిస్తున్నది దేవదాస్. వయసులో నేను నీకన్నా పెద్దదానిని. ఈ

ప్రపంచంలోని విషయాలు చాలా చూశాను, విన్నాను. నా మనసులో ఏమనిపిస్తుందో నీకు తెలుసా? ఇందులో నీదే పొరపాటని నేను దృఢచిత్తంతో చెపుతాను. స్త్రీలు చంచలమైన , అస్థిరమైన చిత్తం గలవారని చెప్పి స్త్రీలను ఎంతగా నిందిస్తున్నారో, అంత నిందకు వాళ్ళు అర్హులు గారు! నిందించేవాళ్ళూ మీరే, ప్రశంసించేవాళ్ళూ మీరే. మీ మగవాళ్ళ మనసుల్లోకి ఏది వస్తే దాన్ని సహజంగానే అనేస్తారు. కాని వాళ్ళు అలా చేయలేరు. తమ మనసులోని విషయాన్ని వెల్లడించలేరు. వెల్లడించినా కూడా జనులందరూ బాగా అర్థం చేసుకోలేరు. ఎంచేతనంటే చాలా అస్పష్టంగా వుంటుంది. మీ తర్కం ముందు అది అణగిపోతుంది. మళ్ళీ అదే నింద ప్రజల నోట స్పష్టంగానూ, స్పష్టతరంగానూ వినిపిస్తుంది."

చంద్రముఖి కొంచెం ఆగి తన కంఠస్వరాన్ని బాగా సరిచేసుకొని చెప్పింది_"ఈ జీవితంలో చాలా రోజుల వరకు ప్రేమ వ్యాపారము చేశాను. కాని కేవలం ఒక్కసారి మాత్రమే ప్రేమించాను. ఆ ప్రేమ విలువ చాలా గొప్పది. దానివిలువ అనేక బోధలు లభిస్తాయి. ప్రేమ ఒకటి రూపం మీద వ్యామోహం, మరొకటి తెలుసుగదా? ఈ రెండింటిలో పెద్ద గందరగోళం వుంది. పురుషులే ఎక్కువ గందరగోళపరుస్తారు. రూపం మీది మోహం మీలోకంటే మాలో చాలా తక్కువగా వుంటుంది. ఇందు వలన మేము మీలాగా అమాంతంగా ఉన్మత్తులం కాము. మీ పురుషులువచ్చి తమ ప్రేమను చూపిస్తారు. అనేక భావాలు వెల్లడిస్తారు. అప్పుడు మేము మౌనం వహిస్తాము. ఎన్నోసార్లు మీ పురుషుల మనస్సుకు దుఃఖం కలిగించడానికి సిగ్గుపడతాము. దుఃఖం కలుగుతుంది, సంకోచం కలుగుతుంది. ముఖం చూస్తే ఒకవేళ రోత కలిగినా అప్పుడు కూడ సిగ్గుచేత నేను నిన్ను ప్రేమించడం లేదని చెప్పలేము. తరువాత ఒక బాహ్యా ప్రణయం యొక్క అభినయం ప్రారంభమవుతుంది. ఏ రోజైనా అది అంతమైపోయినప్పుడు పురుషులు స్థిరం లేనివారై ఎంత విశ్వాసఘాతిని అంటారు. అప్పుడు అందరూ ఆ మాటనే వింటారు. దానినే విశ్వసించనారంభిస్తారు. మేము అప్పుడు కూడా మౌనంగానే వుంటాము. మనసులో ఎంతో క్లేశం వుంటుంది. కాని అది ఎవరు చూడబోతారు?" దేవదాసు ఏమీ అనలేదు. ఆమె కూడా చాలాసేపటివరకు నిశ్శబ్దముగా ముఖం వైపు చూస్తూ వుంది. తరువాత మళ్ళీ చెప్పింది_"ఒకవేళ ఏదైనా వుంటే బహుశా కొద్దీగొప్పా మమత ఉత్పన్నమౌతుంది. అదే ప్రేమ అని స్త్రీలు మనసులో ఆలోచిస్తారు. శాంతంగానూ, ధైర్యంగానూ సంసారంలోని పనులు చేస్తూ వుంటారు. దుఃఖకాలంలో ప్రాణాన్ని పణంగా పెట్టి కూడా సహాయపడతారు. అప్పుడు మీరు బాగా ప్రశంసిస్తారు. అందరినోట ఎన్నోసార్లు ధన్యురాలు, ధన్యురాలు అని వినిపిస్తుంది. కాని అప్పటివరకు ఆమె ప్రేమ యొక్క వర్ణ_పరిచయం కూడా ఆరంభం కాదు. ఆ తరువాత ఒకవేళ ఏదైనా ఆ శుభముహూర్తంలో తన

హృదయంలో సహించలేని వేదన కారణముగా విలవిలలాడుతూ వాకిలి బయటికి వచ్చి నిలబడితే (ఈ మాట అని ఆమె దేవదాసు ముఖం వైపు తీవ్రంగా చూసి అన్నది ) మీరు అరిచి "ఛీ!ఛీ! కళంకినీ" అని గోలపెడతారు. హఠాత్తుగా దేవదాసు, చంద్రముఖి నోటిని చేతితో అణచి పెట్టి "చంద్రముఖీ, ఇదేమిటి?" అన్నాడు. చంద్రముఖి నెమ్మదిగా చేతిని తొలగించుకొని "భయపడకు దేవదాస్. నేను నీ పార్వతి సంగతి చెప్పడం లేదు" అన్నది.

ఈ మాట అని ఆమె మౌనం వహించింది. దేవదాసు కొన్ని క్షణాలు మౌనంగా వుండి అన్యమనస్కుడై అన్నాడు. "కాని కర్తవ్యం వుండి, ధర్మం అధర్మం అనేది వుంది గదా?" చంద్రముఖి అన్నది "అవును, అదైతే వుంది. అంచేతనే దేవదాసును ఆమె నిజంగా ప్రేమిస్తున్నది. అతణ్ణి సహిస్తున్నది కూడా. హృదయపూర్వకమయిన ప్రేమతో లభించే సుఖాన్నీ, తృప్తినీ పెంపొందించుకొనడం కోసం ఆమె ఇంట్లో అశాంతిని తీసికొని రాదలచుకోలేదు. కాని దేవదాస్, నేను నిజం చెపుతున్నాను. పార్వతి నిన్నేమీ మోసగించలేదు. నిన్ను నీవే మోసగించుకొన్నావు. ఈ రోజు ఈ విషయం తెలుసుకొనే శక్తి నీలో లేదు. ఈ విషయం నాకు కూడా తెలుసు. ఒకవేళ ఎప్పుడైనా సమయం వస్తే నేను నిజం చెప్పానని నీవు గ్రహించగలవు" దేవదాసు రెండు కళ్ళూ అశ్రువులతో నిండిపోయాయి. ఆయన దుఃఖిస్తూ చంద్రముఖి మాటలు నిజమేనా అని ఆలోచిస్తూ వున్నాడు. అతడి కళ్ళల్లోని అశ్రువులను చంద్రముఖి చూసింది. కాని తుడవడానికి ప్రయత్నించలేదు. లోలోపల అనుకొంటూ వుంది_"నిన్ను నేను అనేకసార్లు అనేక రూపాల్లో చూశాను. అంచేత నీ మనస్సు యొక్క గతి నాకు బాగా తెలిసే వుంది. సామాన్య పురుషుల మాదిరిగా నీవు కోరి ప్రేమను వెల్లడించలేవు. అప్పుడు మరి రూపం విషయమో_ రూపాన్ని ఎవరు కోరుకోరు? కాని ఇందుకోసం నీవు నీ యింత తేజస్సును రూపం పాదాలకు సమర్పించుకుంటావా? ఈ మాట విశ్వసించలేము. పార్వతి కావడానికి మంచి రూపవతి. కాని అయినా కూడా మొదట ఆమె ప్రేమ ద్వారాన్ని తెరిచిందనీ, మొదట ఆమెయే ప్రేమాలాపం ప్రారంభించిందనీ విశ్వాసం కలుగుతున్నది.

లోలోపల అనుకొంటూ వుండగా హఠాత్తుగా ఆమె నోటి నుంచి అస్ఫుటమయిన స్వరంలో బయటపడింది_"నన్ను చూసుకొని ఆమె నిన్ను ఎంతగా ప్రేమిస్తూ వుండవచ్చునో తెలుసుకుంటున్నాను.

దేవదాసు గభాలున లేచి కూర్చొని "ఏమంటున్నావూ?" అన్నాడు.

"ఏమీలేదు, ఆమె నీ రూపం చూసి మరచిపోలేకుండా వుంది అని చెపుతున్నాను. నీకు రూపం వుంది. కాని ఆమెలో పొరపాటు వుండదు. ఈ తీవ్రమయిన శుష్కరూపం మీద అందరి దృష్టి పడదు. అయితే ఎవరి దృష్టి

పడుతుందో అది మళ్ళీ తొలగలేదు.

ఇలా అని ఒక దీర్ఘమయిన నిట్టూర్పు విడిచి మళ్ళీ అన్నది-"నీలో ఏమి ఆకర్షణ వుందో తెలియదు కాని దాన్ని నిన్ను ఎప్పుడైనా ప్రేమించినవాళ్ళే తెలుసుకోగలరు. ఈ స్వర్గాన్ని పొందాలని అభిలషించి మరలా ఎవరు మరలగలరు. అలా మరలిపోగల స్త్రీ యీ భూమిమీద ఎవరున్నారు?"

మరికొన్ని క్షణాలు నిశ్శబ్దంగా వున్న తరువాత ఆమె ముఖం వైపు చూసి నెమ్మదిగా అన్నది_"ఈ రూపం కేవలం మూడునాళ్ళ ముచ్చట. అలా చూస్తూ చూస్తూ వుండగానే ఇది అంతమయిపోతుంది. చితితోపాటు అగ్నిలో భస్మమై బూడిదయిపోతుంది."

దేవదాసు వ్యాకులంగా చంద్రముఖి ముఖం వైపు చూసి "ఈ రోజు నీవు ఇదంతా ఏమిటి వాగుతున్నావు?" అన్నాడు.

చంద్రముఖి మధురమైన నవ్వు నవ్వి "ఇంతకన్న మించి మరేదీ మనస్సును ఉడికించే మాట వుండదు దేవదాస్_అదేమిటంటే ఎవరినయితే మనం ప్రేమించమో ఆమె బలవంతంగా ప్రేమ విషయాలు వినిపించడం. కాని నేను అది కేవలం పార్వతి కోసమే వకాల్తా తీసుకుంటున్నాను. నా కోసం మాత్రం కాదు" అన్నది.

దేవదాసు వెళ్ళడానికి సిద్ధపడి "ఇక నేను ఇక్కడ నుంచి వెళ్తాను" అన్నాడు.

"ఇంకొంచెం సేపు కూర్చో. ఎన్నడూ నిన్ను జ్ఞానంతో వుండగా నేను చూడలేదు. ఎన్నడూ ఈ విధంగా రెండు చేతులు పట్టుకొని మాట్లాడగలిగేదాన్ని కాలేకపోయాను" ఈ మాట అని ఆమె హఠాత్తుగా నవ్వింది.

"నవ్వావు ఎందుకూ?" అడిగాడు దేవదాసు ఆశ్చర్యంగా.

"ఏమీలేదు. కేవలం పూర్వపు సంగతి ఒకటి జ్ఞాపకం వచ్చింది. ఇప్పటికి పది సంవత్సరాలనాటి సంగతి. అప్పుడు నేను ప్రేమావేశంలో ఇల్లు వదిలిపెట్టి వచ్చేశాను. అప్పుడు ఎంతో ప్రేమించాలని మనసులో వుండేది. బహుశా అప్పుడు ప్రాణాలు గూడా ఇవ్వటానికి సిద్ధంగా వుండేదాన్ని. తరువాత ఒకరోజు ఒక తుచ్ఛమయిన ఆభరణం కోసం పోట్లాట వచ్చింది. ఇక ఎవరి ముఖమూ చూడలేదు. ఈయన నన్ను బాగా ప్రేమించడం లేదనీ లేకపోతే ఒక్క ఆభరణం ఇచ్చేవాడు కాదా అని మనస్సును సంతృప్తిపరచుకున్నాను."

చంద్రముఖి మళ్ళీ ఓసారి తన మనస్సులో నవ్వుకుంది. మరుక్షణమే శాంతంగా, గాంభీర్యంగా, నెమ్మదిగా అన్నది_"ఆభరణం ఊడ్చుకుపోను. అప్పుడు

ఒక మామూలు తలనొప్పిని నయం చేసుకొనడానికి ప్రాణాలే పోగొట్టుకోవలసి వస్తుందని ఏం తెలుసు? అప్పుడు నేను సీత బాధనుగానీ, దమయంతి వ్యథనుగానీ అర్థం చేసుకొనేదాన్ని కాదు. మాధవుని కథను విశ్వసించేదాన్ని కాదు. సరేగాని దేవదాస్, ఈ ప్రపంచంలో ఏదయినా సంభవమే కదూ?"

దేవదాసు ఏమీ జవాబు చెప్పలేకపోయాడు. నిశ్చేష్టుడై కొంచెం సేపు చూసి "నేను వెళుతున్నాను" అన్నాడు.

"భయమేముంది, ఇంకొంచెం సేపు కూర్చో. నేను నిన్ను ఇంకా భ్రమలో వుండదలచుకోలేదు. నా ఆ రోజులన్నీ గడిచిపోయాయి. ఇప్పుడు నీవు నన్ను ఎంతగా ఏవగించుకుంటున్నావో అంతగా నన్ను నేనే ఏవగించుకుంటున్నాను. కాని దేవదాస్, నీవు పెళ్ళి యెందుకు చేసుకోవు?"

కొంచెం నవ్వి "ఉచితమైన పనే, కాని ఇష్టం లేదు" అన్నాడు.

"ఇష్టం లేకపోయినా చేసుకో. స్త్రీ ముఖం చూసి చాలా శాంతిని పొందగలవు. ఇది నాకు కూడా ఒక దారి ఏర్పడుతుంది. నీ సంసారంలో దాసిగా పడివుండి స్వచ్ఛంద భావంతో జీవితం గడుపుతాను."

దేవదాసు నవ్వి "అప్పుడు నేను నిన్ను పిలిపించుకుంటాను" అన్నాడు.

చంద్రముఖి అతడి నవ్వును గమనించక "దేవదాస్, మరో విషయం అడగాలని అభిలాష కలుగుతున్నది" అన్నది.

"ఏమిటీ?"

"నీవు ఇంత సేపటివరకూ నాతో ఎందుకు మాట్లాడావు?"

"అనుచితమా?"

"ఆ విషయం నాకు తెలియదు. కాని కొత్త సంగతి. మద్యం త్రాగి చైతన్యాన్ని కోల్పోక పూర్వం నీవు ఎప్పుడూ నాతో మాట్లాడేవాడివి కాదు."

దేవదాసు ఆ ప్రశ్నకు ఏమీ జవాబు ఇవ్వకుండా విషణ్ణ వదనంతో "ఇప్పుడు నేను మద్యాన్ని తాగడం లేదు. మా నాన్నగారు చనిపోయారు."

చంద్రముఖి చాలాసేపటి వరకు అతడి ముఖంవైపు జాలిగా చూస్తూ "ఇక ముందు మళ్ళీ త్రాగుతావా?" అన్నది.

"చెప్పలేను."

చంద్రముఖి అతడి రెండు చేతులను కొంచెం లాగుకొని అశ్రుపూరిత

నేత్రాలతో వ్యాకులంగా "ఒకవేళ సాధ్యమయితే వదిలేసెయ్! అటువంటి అమూల్యమయిన జీవిత రత్నాన్ని నష్టపరచవద్దు" అన్నది.

దేవదాసు హటాత్తుగా లేచి నిలబడ్డాడు. "నేను వెళుతున్నాను. నీవు ఎక్కడికి వెళతావో అక్కడనుంచి తెలియజేస్తావుకదూ? మరేదయినా పని వుంటే వ్రాయి. నా ముందు సిగ్గు పడవద్దు" అన్నాడు.

చంద్రముఖి నమస్కారం చేసి పాదధూళి అందుకొని "నేను సుఖంగా వుండాలని ఆశీర్వదించు. మరో భిక్ష కోరుతున్నాను. భగవంతుడు అలా చేయకూడదు. కాని ఒకవేళ ఎప్పుడయినా దాసీ అవసరమయితే నన్ను జ్ఞాపకం వుంచుకోండి" అన్నది.

"సరే మంచిది" అని చెప్పి దేవదాసు వెళ్ళిపోయాడు. చంద్రముఖి రెండు చేతులతో ముఖం కప్పుకొని రోధిస్తూ "మరోసారి దర్శనం లభించేటట్లు చేయి భగవంతుడా!" అన్నది.

## 14

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. పార్వతి, మహేంద్రుడి వివాహం చేసి నిశ్చింతగా వుంది. జలదబాల చాలా తెలివిగలది, కార్య కౌశలం గలది. ఇప్పుడు పార్వతికి బదులు సంసారంలోని కార్యకలాపాలన్నీ చాలావరకు ఆమె చేస్తున్నది. పార్వతి ఇప్పుడు తన మనస్సును మరోవైపుకు మరల్చింది. ఆమె పెళ్ళయి ఇప్పటికి అయిదు సంవత్సరాలు అయింది. కాని ఇంతవరకు ఆమెకు సంతాపం కలగలేదు. తనకు బిడ్డా పాపా లేని కారణంగా ఆమె ఇతరుల పిల్లలను ఎక్కువగా ప్రేమిస్తున్నది. బీద సాదలను చూడడమే కాకుండా కొద్దిగా డబ్బుగల వాళ్ళ పిల్లల భారాన్ని కూడా ఎక్కువగా ఆమె మోస్తున్నది. ఇంతేగాకుండా దేవాలయ కార్యకలాపాలూ, సాధువుల, సన్యాసుల సేవలు, కుంటి, గ్రుడ్డివాళ్ళ శుశ్రూష మొదలయిన వాటితో రోజంతా గడుపుతూ వుంటున్నది. భర్తకు కూడా ఇటువంటి ఆసక్తిని కలిగించి పార్వతి మరో అతిథిశాల కూడా కట్టించింది. అందులో నిస్సహాయులు, నిరాశ్రితులు స్వేచ్ఛగా ఉండవచ్చు. జమీందారు ఇంటి నుంచే వాళ్ళందరికీ భోజనం లభిస్తుంది. ఒక పని మాత్రం పార్వతి చాలా రహస్యంగా చేస్తున్నది. భర్తకు కూడా తెలియనిచ్చేది కాదు. ఉన్నంత వంశానికి చెందిన దరిద్రులకు రహస్యంగా ధన సహాయం చేస్తుంది. ఇదే ఆమె రహస్యంగా చేస్తున్న పని. ఇదే ఆమె సొంత ఖర్చు. భర్త దగ్గరనుంచే ప్రతినెలా తనకు లభించే సొమ్ము అంతా ఇందులోనే ఖర్చు చేస్తుంది. ఏ విధంగా ఖర్చు చేసినా, ఎంత ఖర్చు చేసినా కచేరీ ఉద్యోగులకు తెలియకుండా ఉండేదికాదు. ఈ విషయాన్ని గురించి వాళ్ళు పరస్పరం చర్చలు జరుపుకునేవాళ్ళు. కుటుంబం ఖర్చు పూర్వంకన్నా రెట్టింపు అయిందన్న సంగతిని దాసీలు చాటుగా వుండి విని వచ్చేవాళ్ళు.

బొక్కసం ఖాళీగా పడివుందనీ, ఏమీ మిగలలేదనీ వినేవాళ్ళు. కుటుంబం ఖర్చు అనుచితంగా పెరిగినందువలన దాసదాసీలకు అమితమైన వేదన కలుగుతుంది. వాళ్ళు ఆ మాటలన్నీ జలదబాలకు తెలియజేసి వచ్చేవాళ్ళు. ఒకరోజు రాత్రి ఆమె భర్తతో "నీవు ఈ యింటికి ఏమీ కావా?" అన్నది.

"ఎందుకు? ఏమిటి సంగతి?" అన్నాడు మహేంద్రుడు.

"దాసదాసీలందరికీ తెలుసు. నీకే తెలియదన్నమాట? మామయ్య గారికి మీ కొత్త అమ్మ అంటే ప్రాణం. ఆయన ఆమెనేమీ అనడు. నీవయినా ఆమెతో చెప్పడం బాగుంటుందికదా?"

మహేంద్రునికి విషయం అర్థంకాలేదు. "ఎవరి సంగతి నీవు చెప్పేదీ?" అని ఉత్కంఠంతో అడిగాడు.

జలదబాల గాంభీర్యంగా భర్తకు సలహా యిస్తూ వుంది_"నీ కొత్తమ్మకు పిల్లా జల్లా ఎవరూ లేరు. ఆమెకు కుటుంబం మీద ప్రేమ ఎందుకు వుంటుంది? చూడటంలేదా, అంతా ఎగరగొడుతూ వుంది."

మహేంద్రుడు భ్రుకుటి ముడిచి "ఎందుకు, ఎట్లా?" అన్నాడు.

"నీకు కళ్ళుంటే చూసేవాడివి. ఇప్పుడు ఇంటి ఖర్చు రెట్టింపు అయింది. నిత్యం వ్రతాలూ, పూజలూ, దాన-ధర్మాలూ, అతిథులూ, అభ్యాగతులూ ఖర్చు అపరిమితంగా పెరిగిపోతూ వుంది. బాగుంది, ఆమె గారేమో తన పరలోకాన్నిబాగుచేసుకుంటూ వుంది. నీకూ అబ్బాయిలూ, అమ్మాయిలూ వుంటారుగదా? అప్పుడు వాళ్ళు ఏమి తింటారు? తమ పెట్టుబడి కాస్తా ఊడగొట్టుకొని చివరకు బిచ్చం అడుక్కుంటారా యేం?"

మంచం మీద కూర్చుని మహేంద్రుడు "నీవు చెప్పేది ఎవరి సంగతీ? అమ్మ సంగతా?" అన్నాడు.

"నా రాత ఇలా తగలడింది. ఈ విషయాలన్నీ నేను నీకు చెప్పవలసి వస్తున్నది" అన్నది జలదబాల.

"అందుకే నీవు అమ్మ మీద దావా వేయడానికి వచ్చావా?"

"నాకు దావాలతో, వ్యాజ్యాలతో పనిలేదు. కేవలం లోపల జరుగుతున్న విషయాలు చెప్పాను. లేకపోతే రేపు నామీదే దోషం ఆరోపిస్తారు గదా?" అన్నది జలదబాల క్రోధంతో.

మహేంద్రుడు చాలా సేపటివరకూ మౌనంగా కూర్చొని వున్నాడు. తరువాత అన్నాడు_"మీ తండ్రిగారింట్లో ఒక్కోరోజు పొయ్యిలో పిల్లి కూడా

లేవదుగాని నీకు జమీందారు ఇంట్లోని పని ఏమి తెలుస్తుంది?"

ఈసారి జలదబాలకు కూడా కోపం వచ్చింది. "మీ తల్లి దండ్రుల ఇంట్లో ఎన్ని అతిథిశాలలు ఉన్నాయో కొంచెం చెప్పండి వింటాను?" అన్నది.

మహేంద్రుడు మళ్ళీ ఆమెతో వాదనకు దిగలేదు. మెదలకుండా నిద్రపోయాడు. ఉదయం లేచి పార్వతి దగ్గరకు వెళ్ళి-"ఎటువంటి పెళ్ళి చేశావమ్మా! దీన్ని పెట్టుకొని సంసారం చేయడం చాలా కష్టం. నేను కలకత్తాకు వెళ్ళిపోతాను."

పార్వతి అవాక్కయిపోయి, "ఎందుకూ?" అన్నది.

"మిమ్మల్ని కటువైన మాటలు అంటున్నది. ఇందువలన నేను ఆమెను వదిలేశాను."

పార్వతి కొన్ని రోజుల నుంచి పెద్ద కోడలు ఆచరణ చూస్తూ వస్తున్నది. అయితే ఆమె ఆ విషయాన్ని దాచి నవ్వుతూ "ఛీ! ఆమె చాలా మంచి అమ్మాయి. అలా అనకు!" అన్నది. ఆ తరువాత జలదబాలను ఏకాతంగా పిలిచి "కోడలూ! పోట్లాడుకున్నారా ఏం?" అన్నది.

ఉదయం నుంచి భర్త కలకత్తాకు వెళ్ళబోతున్న ఏర్పాటంతా చూసి జలదబాల భయపడుతూ వుంది. అత్తమాట విని ఏడుస్తూ "నా దోషం ఏమీ లేదమ్మా! కాని యీ దాసీయే "ఖర్చు-గిర్చు" అంటూ అన్ని మాటలూ చెపుతూ వుంటుంది" అన్నది.

అప్పుడు పార్వతి అన్ని మాటలూ విన్నది. తానే సిగ్గుపడుతూ కోడలు కళ్ళు తుడిచి, "కోడలూ, నీవు నిజం చెపుతున్నావమ్మా. నేనూ అనుభవం కలిగిన గృహిణిని కాదు. అందువల్ల ఖర్చులవైపు దృష్టి వుంచలేకపోయాను" అన్నది.

తరువాత మహేంద్రుణ్ణి పిలిచి "మహేంద్రా, అపరాధం ఏమీ లేకుండా కోప్పడకూడదు. నీవు భర్తవు, యజమానివి. నీ శుభం భార్యకు సర్వస్వం. కోడలు లక్ష్మి" అన్నది. అయితే ఆ రోజు నుంచే పార్వతి చేయి మలుపుకుంది. అనాథలు, అంధులు, ఫకీరులు మొదలైన వాళ్ళు  ఎంతోమంది వచ్చి తిరిగిపోతున్నారు. యజమాని ఇదంతా విని పార్వతిని పిలిచి "ఏం లక్ష్మీదేవి, కోశాగారం ఖాళీ అయిపోయిందా?" అన్నాడు.

పార్వతి సాహసంతో సమాధానమిచ్చింది_"కేవలం ఇస్తూ వున్నందువల్లనే సంసారం సాగదు. కొన్నాళ్ళు కూడబెట్టాలి కూడా. ఖర్చు ఎంత పెరిగిపోయిందో కనిపించడం లేదా?"

"ఖర్చయితే ఏమిటి? నేనింకా ఎన్నాళ్ళు వుండబోతున్నాను. పుణ్య

కార్యాలు చేసే ;పరలోకాన్ని సృష్టించుకోవాలి!"

పార్వతి నవ్వుతూ "ఇది పూర్తిగా స్వార్థానికి సంబంధించిన విషయం. స్వవిషయమే చూసుకొని అబ్బాయిలనూ, అమ్మాయిలనూ గాలికి వదిలేస్తావా? కొన్నాళ్ళుపాటు మౌనంగా వుండండి. మళ్ళీ అంతా పూర్వం లాగే నడుస్తుంది. మనిషి చేసే పనులకు ఎప్పుడూ అంతం వుండదు" అన్నది.

అంచేత చౌదరిగారు మౌనం వహించారు.

పార్వతికి ఏమీ పని లేకుండా పోయింది. అంచేత చేకూ, చింతా కొంచెం పెరిగిపోయింది. దేని ఆశ వుంటుందో ఒక రకమైన దాని చింత కూడా వుంటుంది. దేని ఆశ వుండదో దానిని గురించిన చింత కూడా మరోరకంగా వుంటుంది. ముందు చెప్పిన చింతలో సజీవత్వం వుంది, సౌఖ్యం వుంది, తృప్తి వుంది, దుఃఖం వుంది. ఇంకా ఉత్కంఠ వుంది. అంచేతనే మనుష్యులు అలసిపోయి వుంటారు. ఎక్కువ కాలం చింతించలేరు. అయితే నైరాశ్యంలో సుఖం లేదు, దుఃఖం లేదు, ఉత్కంఠ లేదు.కేవలం తృప్తి వుంది. నయనాలు వర్షిస్తుంటాయి, గాంభీర్యం కూడా వుంటుంది. కాని నిత్యం నూతనమైన మార్మిక వేదన వుండదు. తేలికైన మేఘంలాగా ఇటూ,అటూ తిరుగుతూ వుంటుంది. గాలి తగలనంతవరకూ స్థిరత్వం వుంటుంది. గాలి తగలగానే అదృశ్యమైపోతుంది. నిమగ్నమై ఉన్న మనస్సు ఉద్వేగ రహితమైన చింతలో ఒక సార్థకతను పొందుతుంది. పార్వతి స్థితి కూడా సరీగా ఇలాగే వుంది. పూజా పురస్కారాల సమయంలో మనస్సు అస్థిరంగానూ, ఉద్దేశ్యరహితంగానూ, నిరాశతోనూ వుంటున్నది. మనస్సు వెంటనే సోనాపూర్ వెదురు పొదలు, మామిడి తోటలు, పాఠశాల, ఇల్లు, ఆనకట్ట ఒడ్డు మొదలైన స్థానాలలో తిరిగి వస్తుంది. ఆ తరువాత అటువంటి రహస్య ప్రదేశంలో దాగి వుంటుంది. స్వయంగా పార్వతి కూడా తనను తాను వెతుక్కొని బయటికి తీసుకురాలేదు....మొదట పెదవులు మీద హాస్యరేఖ తొణికిసలాడుతుంది. మరల వెంటనే కంటి నుంచి ఓ కన్నీటి బిందువు రాలి పంచపాత్రలోని జలంతో కలిసిపోతుంది. అప్పుడు కూడా రోజు గడచిపోతూనే వుంటుంది. పని పాటలతో, మధురమైన సంభాషణలో, పరోపకారంలో, సేవా శుశ్రూషలలో రోజు గడచిపోతూనే వుంటుంది. ఇప్పుడు వాటి నన్నిటినీ వదిలేసి ధ్యానమగ్నమైయున్న యోగిని లాగా కూడా గడచిపోతూనే వుంది. ఒకడు లక్ష్మి స్వరూపిణి అన్నపూర్ణ అంటాడు. ఒకడు అన్యమనస్కురాలై ఉన్మాదిని అంటాడు. అయితే నిన్న ఉదయము నుంచి మరో విధమైన మార్పు కొంచెం కనిపిస్తూ వుంది. ఆమె కొంచెం తీవ్రంగానూ, కఠోరంగానూ మారిపోయింది. ఆరోహణలో వున్న గంగలో అకస్మాత్తుగా అవరోహణ ఆరంభమయిందా అన్నట్లు వుంది. ఇంట్లోని వాళ్ళకెవరికి దాని కారణం తెలియదు. మాకు మాత్రమే తెలుసు. మనోరమ గ్రామం నుంచి ఒక ఉత్తరము వ్రాసింది. అది యిలా వుంది__

"పార్వతీ, చాలా రోజులయ్యింది, మన ఇరువురిలో ఎవరూ ఎవరికీ ఉత్తరం వ్రాయలేదు. అంచేత దోషం ఇరువురిదీ వుంది. దీన్ని తొలగించాలని నా అభిలాష. మనం ఇరువురమూ దోషాన్ని స్వీకరించి, అభిమానం తగ్గించుకోవాలి. కాని నేను పెద్ద దాన్ని. అంచేత నేనే మన్నించమని అర్థిస్తున్నాను. త్వరలో సమాధాన మిస్తావని ఆశిస్తున్నాను. నేను ఇక్కడకు వచ్చి దాదాపు ఒక నెల అయ్యింది. మనం గృహస్థులైన వారి ఇంటి పిల్లలం. శారీరక సుఖదుఃఖాల మీద అంత శ్రద్ధచూపము. మరణించునప్పుడు కీర్తి శేషులయ్యారు అంటాము. జీవించి ఉన్నప్పుడు బాగున్నారు అంటాము. నేనూ ఆ విధంగానే బాగున్నాను. కాని ఇది నా విషయం. ఇక ఇతరుల విషయం వుంది. అదేమంత పనికి వచ్చే విషయము కాకపోయినప్పటికీ ఒక సంవాదం వినిపించాలని చాలా కోరికగా వుంది. నీకు వినిపించుదామా  లేక వద్దా అని నిన్నటినుంచి ఆలోచిస్తున్నాను. వినిపిస్తే నీకు దుఃఖం కలుగుతుంది. వినిపించకుండా నేను వుండలేను.సరీగా మారీచుని స్థితి అయ్యింది. దేవదాసు స్థితి వింటే నీకు దుఃఖమే కలుగుతుంది. కాని నేను కూడా నీ మాటలను జ్ఞాపకానికి తెచ్చుకొని ఏడవకుండా వుండలేను. భగవంతుడు చాలా మేలుచేసి రక్షించాడు. లేకపోతే నీలాంటి అభిమానం గల యువతీ ఆయన చేతిలోబడి ఈపాటికి ఏ గంగలోనైనా మునిగి చచ్చేదానివి. లేక ఏ విషమైనా పుచ్చుకునేదానివి. ఆయన విషయం ఈ రోజు వింటావా! ఇంకా నాలుగు రోజులు తరవాతైనా వినవలసిందే, ఎప్పుడైనా వినవలసిందే! దానిని అణచి పెట్టినందువల్ల లేక దాచిపెట్టినందువల్ల ప్రయోజనమేముంది?

అయిదారు రోజుల క్రితం ఆయన ఇక్కడకు వచ్చాడు. ద్విజదాసు తల్లీ కాశీలో వుంటుందనీ, దేవదాసు కలకత్తాలో వుంటున్నాడని నీకు తెలుసు గదా! కేవలం అన్నతో కలహించడానికీ, డబ్బు తీసుకొనడానికీ ఇంటికి వస్తున్నాడు. ఇలాగే మధ్య మధ్యలో వస్తూ వుంటాడని వింటున్నాను. ఎన్ని రోజుల వరకు డబ్బు ప్రోగుగాదో అన్ని రోజులవరకు ఉండి డబ్బు అందగానే వెళ్ళిపోతూ వుంటాడు.

ఆయన తండ్రి చనిపోయి ఇప్పటికి రెండున్నర సంవత్సరాలయింది. ఈ కొద్ది కాలంలోనే తన వాటాను వచ్చిన సంపదలో సగం ఊడ్చి పారేశాడని వింటే ఆశ్చర్యం కలుగుతుంది. ద్విజదాసు అంతా లెక్క వ్రాసుకుంటూ వుండటం చేత ఏదో విధంగా తన తండ్రి ఆస్తిని తనవద్దే మిగుల్చుకుని వుంచాడు. లేకపోతే ఈనాడు ఇతరులు వచ్చి దోచుకుని తినేవాళ్ళు. మద్యం కోసం, వేశ్య కోసం, ధనమంతా స్వాహా అయిపోతున్నది. అతణ్ని ఎవరు రక్షించగలరు? ఒక్క యముడే ఆ పని చేయగలడు. అది కూడా త్వరలోనే జరగవచ్చు. ఆలస్యమేమీ వుండదు. అతడితో నీ వివాహం జరగనందువల్ల నీవు ఒడ్డున పడ్డావు. భగవంతుడు నిన్ను రక్షించాడు అనుకో.

ఆహా! ఆహా! దుఃఖం కూడా కలుగుతుంది. ఇప్పుడు బంగారం లాంటి ఆ వర్ణం లేదు, ఆ రూపం లేదు, ఆ కళ లేదు. ఆ దేవదాసు కాడా, మరొకరా అన్నట్లు వుంటాడు. కళ్ళు లోపలికి పీక్కు పోయాయి. రేగిన తలమీద కేశాలు గాలికి ఎగురుతూ వుంటాయి. ముక్కు ఖడ్గంలాగా బయటికి పొడుచుకు వచ్చింది. రూపం పూర్తిగా చెడిపోయింది. నీతో ఎంతని చెప్పేది? చూస్తే అసహ్యం కలుగుతుంది. భయం వేస్తుంది. రోజంతా నది ఒడ్డున ఆనకట్టపైన తుపాకి చేత బట్టుకొని పక్షులను చంపుతూ వుంటాడు. ఎండలో తల తిరిగి ఆనకట్టపైనే వున్న రేగుచెట్టు నీడలో తలవాల్చుకుని చతికిల బడతాడు. సాయంకాలం అయిన తరువాత ఇంటివద్దకు వచ్చి మద్యం తాగుతాడు. రాత్రులందు నిద్రపోతాడో లేక తిరుగుతూ వుంటాడో ఆ భగవంతుడికే తెలియాలి.

ఆ రోజు సాయంకాలంపూట నీళ్ళు తెద్దామని నదికి వెళ్ళాను. చూశాను, దేవదాసు ముఖం వాడిపోయి వుంది. చేతిలో తుపాకి పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ వున్నాడు. నన్ను గుర్తుపట్టి దగ్గరకొచ్చి నిల్చున్నాడు. నేను భయంతో చచ్చిపోయాననుకో! రేవు దగ్గర ఎవరూ లేరు. నా ప్రాణం పోయినంత పనయిందనుకో. అతడు నన్ను కదిలించలేదు. చెడుగా ప్రవర్తించలేదు. కేవలం సజ్జనుడిలాగా, శాంత స్వభావంతో "మనో, బాగున్నావా?" అన్నాడు.

ఇక నేను ఏం చేసేది? భయపడుతూ తల వంచుకుని "ఆఁ" అన్నాను.

అప్పుడు ఆయన దీర్ఘమైన నిట్టూర్పు విడిచి "సుఖంగా వుండు చెల్లీ, నిన్ను చూడగానే చాలా సంతోషం కలిగింది" అని నెమ్మదిగా వెళ్ళిపోయాడు. అక్కడనుంచి నేను పడుతూ, లేస్తూ పరుగెత్తాను. అమ్మో! బాబో! అదృష్టం బాగుంది. ఆయన చెయ్యిగానీ, మరొకటిగానీ ఏమీ పట్టుకోలేదు. ఈ విషయాలను అలా వుండనివ్వు. ఈ చెడు వృత్తిని సంబంధించిన విషయాలు వ్రాయడానికి యీ ఉత్తరంలో చోటు గూడా లేదు.

నీకు చాలా శ్రమ కలిగించాను. ఏం చెల్లీ? ఇప్పటికీ ఒకవేళ ఆయనను మరచిపోయి వుండకపోతే తప్పకుండా నీకు చాలా కష్టం కలిగి ఉంటుంది. అయినా తప్పదు. ఒకవేళ అజాగ్రత్త వలన ఏదైనా అపరాధం జరిగివుంటే, నీ సహజగుణంతో నీ స్నేహాన్ని కాంక్షించే యీ మనో అక్కను క్షమించు."

నిన్న ఉత్తరం వచ్చింది. ఈ రోజు ఆమె మహేంద్రుణ్ణి పిలిచి "రెండు పల్లకీలనూ, ముప్పై రెండు మంది బోయిలనూ ఏర్పాటు చెయ్యి. నేను ఇప్పుడే తాల్ సోనాపుర్ వెళతాను" అన్నది.

మహేంద్రుడు ఆశ్చర్యంగా "పల్లకీని, బోయిలనూ నేను ఏర్పాటు చేస్తాను. కాని రెండు పల్లకీలు ఎందుకమ్మా?" అని అడిగాడు.

"నీవు కూడా తోడుగా వస్తావు! ఒకవేళ నేను మరణిస్తే నోటిలో నిప్పు పెట్టడానికి పెద్దకొడుకు అవసరమవుతాడు."

మహేంద్రుడు మరేమీ మాట్లాడలేదు. పల్లకీలు వచ్చిన తరువాత ఇరువురూ బయలుదేరి వెళ్ళిపోయారు.

చౌదరిగారు ఇది విని గాభరాపడ్డాడు. దాస దాసీలను అడిగాడు. కాని ఎవరూ సరైన కారణం చెప్పలేకపోయారు. అప్పుడు ఆయన తన బుద్ధిని ఉపయోగించి అయిదుగురు కాపలా జవానులనూ, దాసదాసీలనూ పంపించాడు.

"దారిలో కలుసుకుంటే పల్లకీని వెనక్కు తిప్పుకొచ్చేమా వద్దా?" అని ఒక కాపలా జవాను అడిగాడు.

ఆయన కొంచెం ఆలోచించి "వద్దు, వెనక్కు తిప్పుకొచ్చే పనేమీ లేదు. మీరంతా తోడుగా వెళ్ళండి. అందువల్ల వాళ్ళకేమీ ఇబ్బంది వుండదు" అన్నాడు.

అదే సాయంకాలం దాటిన తరువాత రెండు పల్లకీలూ తాల్ సోనాపుర్ చేరాయి. కాని దేవదాసు గ్రామంలోలేడు. అదేరోజు మధ్యాహ్నం కలకత్తాకు వెళ్ళిపోయాడు.

పార్వతి తల బాదుకున్నది_"దురదృష్టం!" అన్నది. తరువాత మనోరమను కలుసుకున్నది.

"దేవదాసును చూడటానికి వచ్చావా?" అడిగింది మనోరమ.

"కాదు, వెంటతీసుకొని వెళ్ళడానికి వచ్చాను. ఆయనకు ఇక్కడ తనవాళ్ళనేవాళ్ళు ఎవరూ లేరు" అన్నది పార్వతి.

మనోరమ అవాక్కయిపోయింది. "ఏమంటున్నావు? కొంచెమైనా సిగ్గుపడవేమిటే" అన్నది.

"సిగ్గా, ఇంకా ఎవరికి సిగ్గుపడాలి? నా వస్తువును నా వెంట తీసికొని వెళ్తాను. ఇందులో సిగ్గేముంది?"

"ఛీ! ఛీ! ఏమంటున్నావు? అతనితో కొంచెమైనా సంబంధం లేదు_అటువంటి మాట నీ నోటితో అనకు."

పార్వతి మలినపు నవ్వు నవ్వి "మనో అక్కా! జ్ఞానం కలిగిన తరువాత నుంచి ఏ మాటయితే నా హృదయంలో ఉంటూ వచ్చిందో అదే అప్పుడప్పుడు నా నోటినుంచి బయటికి వచ్చేస్తుంది. నీవు అక్కవు, అందుచేతనే ఈ మాటలను వింటున్నావు" అన్నది.

మరుసటిరోజు పార్వతి తల్లిదండ్రుల పాదాలకు నమస్కారం చేసి మళ్ళీ పల్లకీ యెక్కి వెళ్ళిపోయింది.

## 15

ఇప్పటికి రెండు సంవత్సరాల క్రితం చంద్రముఖి తాను నివసించడం కోసం ఆశథ్ ఝూరీ గ్రామంలో ఛోట్ నదీతీరాన ఒక ఎత్తయిన ప్రదేశంలో మట్టిగోడలతో రెండు చిన్న చిన్న పూరిళ్ళు కట్టించుకొన్నది. దగ్గరలో ఒక కళ్ళం వున్నది. అక్కడే ఆమెదే నల్ల గానూ, బలంగానూ ఉన్న ఆవు ఒకటి కట్టేసి వుంటుంది. రెండిళ్ళల్లో, ఒకటి వంటిల్లుగానూ స్టోరు గదిగానూ వుంటుంది. రెండో ఇంట్లో ఆమె నిద్రిస్తుంది. ఆమె నిద్రలేచేముందే రామ్ బాగ్దీ భార్య ఇళ్లూ, వాకిళ్లూ ఊడ్చి శుభ్రం చేస్తుంది. కళ్ళాపి చల్లుతుంది. ఇంటికి నలువైపులా తడికలు కట్టి వున్నాయి. ఆవరణ మధ్యలో రేగుచెట్టు ఒకటి వుంది. ఒకవైపు తులసికోట వుంది. ఎదురుగా నదీ ప్రవాహం వుంది. దాని చుట్టుప్రక్కల జనం ఖర్జూర చెట్లు, అరటి చెట్లు పెంచారు. చంద్రముఖి తప్ప ఆ రేవును మరెవ్వరూ ఉపయోగించరు. వర్షాకాలంలో నది నిండుగా తొణికిసలాడుతూ ప్రవహిస్తున్నప్పుడు చంద్రముఖి ఇంటి దిగువకు కూడా నీళ్ళు వచ్చేస్తాయి. ఆ సమయంలో ప్రజలు కొంచెం గాభరా పడుతుంటారు. పారతో మట్టిత్రవ్వి పైకి వేసి స్థలంమీద మెరక వేయడానికి పరుగులు తీస్తారు. గ్రామంలో ఉన్నత వర్ణాల ప్రజలు వుండరు. రైతులు, గొల్లలు, బోయీలు, కుర్మీలూ, బాగ్దీలూ, రెండిళ్ళవాళ్ళు గౌడలూ, రెండిళ్ళవాళ్ళు మాదిగలూ మొదలైన వాళ్ళు వుంటారు. చంద్రముఖి ఈ గ్రామానికి వచ్చి దేవదాసుకు ఉత్తరం ద్వారా తెలియచేసింది. జవాబుగా ఆయన కొంత డబ్బు పంపించాడు. ఈ డబ్బులో నుంచి చంద్రముఖి గ్రామంలో వాళ్ళకు అప్పులిస్తుంది. ఆపదలు వచ్చినప్పుడూ కష్ట కాలంలోనూ అందరూ వెళ్ళి ఆమె దగ్గర డబ్బు అప్పుగా తీసుకొని వెళతారు. చంద్రముఖి వడ్డీ తీసుకోదు. అందుకు బదులు కందమూల ఫలాలూ, కాయగూరలూ, ఆకుకూరలూ ఎవరి యిష్టం వచ్చినవి వాళ్ళు ఇచ్చిపోతారు. అసలు కోసం కూడా ఎవరినీ బలవంత పెట్టదు, ఒత్తిడిచేయదు. ఇవ్వలేనివాళ్ళు యివ్వరు.

చంద్రముఖి నవ్వుతూ "ఇక నీకు ఎప్పుడూ ఇవ్వను" అంటుంది.

అతడు నమ్రతతో "ఈసారి పంట బాగా పండాలని ఆశీర్వదించు తల్లీ" అనేవాడు.

చంద్రముఖి ఆశీర్వదించేది. ఒకవేళ మళ్ళీ పైరు బాగాకాక పంట బాగా పండకపోతే, వాళ్ళు మళ్ళీ రోదిస్తూ వచ్చి చేయి చాచేవాళ్ళు. చంద్రముఖి మళ్ళీ యిచ్చేది. లోలోపల నవ్వుకుంటూ ఆమె "మీరు బాగా వుండండి. నాకు డబ్బుకు కొరతేమిటి?" అనేది.

కాని ఆయన ఆ దేవదాసు ఎక్కడ వున్నాడు? ఆరుమాసాల నుంచి ఆయన కబురేమీ అందలేదు. ఉత్తరం వ్రాసింది. కాని జవాబు రాలేదు. లెటరు రిజిస్టర్ చేసింది. అది కూడా తిరిగి వచ్చింది. చంద్రముఖి ఒక గొల్లవానిని తన ఇంటి దగ్గర పనిలో అట్టిపెట్టింది, అతడి కొడుకు పెళ్ళికి కావలసినంత ధనసహాయం చేసింది. ఒక జత మురుగులు కొనిపెట్టింది. అతని కుటుంబమంతా చంద్రముఖి ఆశ్రయంలో వుంటున్నది. అతని పరివారంలోని వాళ్ళు అందరూ ఆమెకు విధేయులై వుంటారు. ఒకరోజు ఉదయం చంద్రముఖి తన ఆశ్రితుడైన ఆ గొల్ల భైరవుణ్ణి పిలిచి "భైరవ్, ఇక్కడకు తాల్ సోనాపుర్ ఎంత దూరముంటుందో తెలుసా?" అని అడిగింది.

భైరవుడు ఆలోచించి "ఇక్కడ నుంచి దాదాపు రెండు మైళ్ళ దూరంలో కచేరీ వుంటుంది."

"అక్కడ జమీందారు ఉంటారా?" అడిగింది చంద్రముఖి.

"అవును, ఆయన చాలా గొప్ప జమీందారు. ఈ గ్రామం కూడా ఆయనదే. ఆయన స్వర్గస్తుడై ఇప్పటికి మూడు సంవత్సరాలయ్యింది. ఆయన శ్రాద్ధ కర్మలప్పుడు జనమంతా ఒక నెలదాకా భోజనాలు చేస్తూనే వున్నారు, ఇప్పుడాయన కొడుకులు ఇద్దరున్నారు. ఆయన చాలా గొప్ప మనిషి_రాజా అనుకో."

"భైరవ్! నీవు నన్ను అక్కడకు చేర్చగలవా?" అడిగింది చంద్రముఖి.

"ఎందుకు చేర్చలేను? ఏ రోజు కావాలనుకుంటే ఆ రోజే బయలుదేరుదాం" అన్నాడు భైరవుడు.

చంద్రముఖి ఉత్సాహపడుతూ "అయితే భైరవ్, బయలు దేరరాదూ! ఈ రోజే వస్తాను." అన్నది.

భైరవుడు ఆశ్చర్యపోయి "ఈ రోజే?" అన్నాడు. తరువాత చంద్రముఖి ముఖంవైపు చూస్తూ "అయితే నీవు త్వరగా వంట కానివ్వు. ఇంతలో నేను కొన్ని మొర్మొరాలు మూటగట్టుకొని వస్తాను." అన్నాడు.

"ఈ రోజు నేను వంట చేయను. భైరవ్! నీవు మొర్మొరాలు తీసుకొనిరా" అన్నది చంద్రముఖి.

భైరవుడు ఇంటివద్ద కెళ్ళాడు. దుప్పటి చివర కొన్ని మొర్మొరాలు కట్టుకొని, చేతిలో ఒక లాఠీ తీసుకొని వెంటనే తిరిగి వచ్చాడు. "అయితే పదండి. కాని మీరు తిండి కూడా తినరా?" అన్నాడు.

"లేడు భైరవ్! ఇంకా నా పూజా పునస్కారాలు కాలేదు. సమయం దొరికితే అక్కడే అన్నీ పూర్తి చేస్తాను." అన్నది చంద్రముఖి.

భైరవుడు దారి చూపుతూ ముందు ముందు పోతున్నాడు. అతడి వెనకే చంద్రముఖి చాలా ఇబ్బందిపడుతూ కాలిబాట మీదే నడుస్తూ వుంది. నడిచే అలవాటు లేని కారణంగా కోమలమైన ఆమె పాదాలు రెండూ బాగా గాయపడ్డాయి. ఎండకు ముఖమంతా మాడిపోయింది. తిండీ తిప్పలు లేక పోయినా కూడా చంద్రముఖి ఒకదాని తరువాత మరొకటి పొలాలన్నీ దాటుకుంటూ వెళ్తూ వుంది. దారిలో పొలం పనులు చేసుకుంటున్న రైతులు ఆశ్చర్యపోయి ఆమె ముఖం వైపు చూస్తూ వున్నారు.

చంద్రముఖి ఒక ఎర్రంచు చీర ధరించి వుంది. చేతిలో రెండు బంగారపు మురుగులున్నాయి. తల మీద లలాటం దాకా ముసుగు వున్నది. శరీరమంతా ఒక ముతక దుప్పటిలో కప్పబడి వుంది. సూర్యుడు అస్తమించబోతూ వున్నాడు. అప్పటికి ఇరువురూ గ్రామంలోకి చేరుకున్నారు. చంద్రముఖి కొంచెం నవ్వి "భైరవ్! ఈ రెండు మైళ్ళు ఇంత త్వరగా ఎలా దాటి వచ్చాం?" అన్నది చంద్రముఖి.

భైరవుడు ఈ పరిహాసాన్ని గ్రహించలేక సరళ భావంతో_"ఈ సారికైతే వచ్చేశావు. కాని నీ యీ శుష్కించిన దేహం ఈ రోజే మళ్ళీ తిరిగి వెళ్ళగలదా?"

'ఈ రోజేమిటి? రేపు కూడా ఇలా ఇంత దూరం నడవలేను.' అనుకున్నది లోలోపల. "భైరవ్! ఇక్కడ బండి దొరకదా?" అన్నది పైకి.

"ఎందుకు దొరకదు? ఎద్దులబండి దొరుకుతుంది. మాట్లాడి తీసికొని రమ్మంటావా?" అన్నాడు భైరవుడు. బండి మాట్లాడుకు రమ్మని ఆదేశించి చంద్రముఖి జమీందారు ఇంట్లోకి ప్రవేశించింది.

భైరవుడు బండి మాట్లాడటానికి మరోవైపుకు వెళ్ళిపోయాడు. లోపల పై అంతస్తులోని వరండాలో పెద్ద కోడలు (ప్రస్తుత జమీందారు గృహిణి) కూర్చొని వుంది. ఒక దాసీ చంద్రముఖిని అక్కడికే తీసికొని వచ్చింది. ఇరువురూ ఒకరినొకరు ఒకసారి పరిశీలనగా చూసుకొన్నారు.

చంద్రముఖి నమస్కారం చేసింది. పెద్దకోడలు ఒంటి మీద నగలు ఎక్కువగా ధరించదు. కాని ముఖంలో అహంకారం మాత్రం కొట్టవచ్చినట్లే కన్పిస్తూ వుంది. రెండు పెదవులు, పళ్ళు పళ్ళకప్పు, తాంబూలం కారణంగా నల్లబడిపోయాయి. బుగ్గలు కొంచెం పైకి ఉబ్బి వున్నాయి. ముఖం అంతా నిండుగా వుంది. కేశాలంకరణ చాలా అందంగా వుంది. రెండు చెవులకూ కలుపుకొని చిన్నవీ, పెద్దవీ ఇరవై ముప్పై కమ్మలదాకా వుంటాయి. ముక్కు క్రింద ఒక బులాకీ వ్రేలాడుతూ వుంది. రెండు ముక్కులకు వున్న బెజ్జాలకు లవంగాలు

పెట్టుకొని వుంది. అవి ముక్కు పుడకలు పెట్టుకొనేవి.

చంద్రముఖి చూసింది. పెద్దకోడలు చాలా లావుగా వుంది. రంగు నలుపు. కళ్ళు చాలా పెద్దవి. గుండ్రటి ముఖము, నల్లంచు చీర ధరించి వుంది. నారింజ రంగు చోళీ ధరించి వుంది. ఇదంతా చూడగానే చంద్రముఖి మనసులో కొంచెం ద్వేషం లాంటిది ఉత్పన్నమయింది. పెద్ద కోడలు చూసింది. చంద్రముఖి కొంచెం వయస్కురాలైనప్పటికీ ఆమె సౌదర్యం ఏమీ తగ్గిపోలేదు. ఇరువురూ దాదాపు సమవయస్కులు. కాని పెద్ద కోడలు మనసులో దీనిని అంగీకరించలేదు. ఆ గ్రామంలో పార్వతి తప్ప ఇంత సౌదర్యం మరెవ్వరి దగ్గరా కన్పించలేదు. ఆశ్చర్యపోయి "నీవు ఎవరివీ?" అని అడిగింది.

"నేను మీ జమీలో వుండే ప్రజలలో ఒక దానిని. ఖజానాకు శిస్తు కొంత బకాయిపడి వుంది. అది చెల్లించడం కోసం వచ్చాను."

పెద్ద కోడలు లోలోపల సంతోషించి "మరి ఇక్కడికి వచ్చావేం? కచేరికి వెళ్ళు" అన్నది.

చంద్రముఖి తియ్యని నవ్వు నవ్వి_"అమ్మా! నేను చాలా కష్టాలలో వున్న స్త్రీని. డబ్బంతా చెల్లించలేను. మీరు చాలా దయగలవారని విన్నాను. అందుచేతనే మీ దగ్గరకు వచ్చాను, కొంత మాఫీ చేస్తారని."

ఈ రకమైన మాట పెద్దకోడలు తన జీవితంలో మొదటిసారే విన్నది. ఆమెలో దయ వుందనీ, శిస్తు మాఫీ చేయగలదనీ చెప్పిన కారణంగా చంద్రముఖి వెంటనే ఆమె ప్రేమకు పాత్రురాలైనది. "రోజుకు ఎన్నో రూపాయలు నేను వాదులుకోవలసి వస్తూ వుంటుంది. ఎంతోమంది వచ్చి నన్ను ప్రాధేయపడుతుంటారు. నేను మాఫీ చేయలేను. అంచేత అందరూ నా మీద క్రోధంగా కూడా వుంటాను. అయితే నీవు ఎన్ని రూపాయలు బకాయిపడి వుంటావు?" అన్నది.

"ఎక్కువ లేదమ్మా మొత్తం రెండు రూపాయలు. కాని నాకు ఈ రెండు రూపాయలే గగనం అనుకోండి. ఈ రోజంతా నడిచి ఇక్కడకు వచ్చాను."

"ఆహా! నీవు కష్టాలలో వున్న స్త్రీవి. నీ మీద దయ చూపడం ఉచితమైనది కూడా. ఓ బిందూ, ఈమెను అటు తీసికొని వెళ్ళు. రెండు రూపాయలు నేను మాఫీ చేయమన్నానని దీవాను గారితో చెప్పు. సరే, నీ యిల్లు ఎక్కడా? అన్నది పెద్దకోడలు.

మీ జమీందారులోనే నమ్మా__అశథ్ ఝూరీ గ్రామంలో. సరే మంచి దమ్మా. అమ్మా! చినదొరగారు లేరా?" అన్నది చంద్రముఖి.

"అభాగ్యురాలా! ఇంకా చిన దొరగారెవరు? ఇంకా నాలుగు రోజులు పోయిన తరువాత అంతా నాదే అవుతుంది." అన్నది పెద్దకోడలు.

"ఎందుకమ్మా! చినబాబుగారికి బాగా అప్పు వున్నదా?" అని అడిగింది చంద్రముఖి ఉద్విగ్నురాలై.

పెద్ద కోడలు కొంచెం నవ్వి "నా దగ్గరే అనేక గ్రామాలు తాకట్టు పెట్టి వున్నాయి. లేకపోతే ఇప్పటికే అంతా అమ్ముడుపోయేది. కలకత్తాలో మద్యానికీ, ఒక వేశ్యకూ ధనమంతా దోచి పెడుతున్నాడు. ఆ డబ్బుకు అంతమే లేదు, ఇంతని లెక్కే లేదు.

చంద్రముఖి ముఖం వాడిపోయింది. కొంచెం ఆగి "అయితే అమ్మా! అంచేతనే చినబాబుగారు ఇంటికి కూడా రారా?" అని అడిగింది.

"ఎందుకురారు? డబ్బు అవసరమయినప్పుడు వస్తారు. భూమి తాకట్టు పెడతారు. మళ్ళీ వెళ్ళిపోతారు. ఈ మధ్య రెండు మాసాల క్రితమే వచ్చారు. పన్నెండు వేల రూపాయలు తీసికొని వెళ్ళారు. బ్రతుకుతారనే ఆశ కూడా లేదు. శరీరంలో అనేక చెడురోగాలు! ఛీ! ఛీ!"

చంద్రముఖి వణికిపోయింది. ఆమె చిన్నబోయి "ఆయన కలకత్తాలో ఎక్కడ వుంటున్నాడు?" అని అడిగింది.

"చాలా దుస్థితిలో వుంటున్నాడు. ఎక్కడ వుంటున్నాడో ఎవరికైనా తెలుస్తుందా? ఏ హోటల్లో వుంటున్నాడో, ఏ స్నేహితుడి ఇంట్లో వుంటున్నాడో_అతనికే తెలియాలి." అన్నది పెద్ద కోడలు.

చంద్రముఖి హఠాత్తుగా లేచి నిలబడి "ఇహ నేను వెళ్తున్నాను" అన్నది.

పెద్ద కోడలు కొంచెం ఆశ్చర్యపోయి_"వెళ్తావా? ఓ బిందూ...." అన్నది.

చంద్రముఖి మధ్యలోనే అందుకున్నది_"ఆగండి అమ్మగారూ, నేను స్వయంగానే కచ్చేరీకి వెళతాను" అని చెప్పి ఆమె నెమ్మదిగా వెళ్ళిపోయింది. ఇంటి బయటికి వెళ్ళి చూసింది. భైరవుడు ఎదురు చూస్తూ వున్నాడు. యెద్దుల బండి ఒక ప్రక్కన నిలబడి వుంది. ఆ రాత్రికే చంద్రముఖి ఇంటికి తిరిగి వచ్చింది. ప్రొద్దున్నే మళ్ళీ భైరవుణ్ని పిలిచి "భైరవ్! నేను ఈ రోజు కలకత్తాకు వెళతాను. నీవు నాకు తోడుగా రాలేవు. అంచేత మీ అబ్బాయిని తోడు తీసికొని వెళతాను. ఏమంటావు చెప్పు?" అన్నది.

భైరవుడు_నీ యిష్టం అమ్మా. కాని కలకత్తాలో ఎక్కడికి వెళ్తావమ్మా? ఏదయినా ముఖ్యమయిన పని వుందా?"

చంద్రముఖి_"అవును భైరవ్! ముఖ్యమయిన పని వుంది."

భైరవుడు_"ఎప్పుడొస్తావు?"

చంద్రముఖి_"అది చెప్పలేను భైరవ్. ఒకవేళ వీలైతే త్వరగానే వస్తాను. లేకపోతే ఆలస్యమవుతుంది. ఒకవేళ అసలు రాలేకపోతే ఈ యిల్లూ, వాకిలీ అంతా నీవే తీసుకో."

మొదట భైరవుడు అవాక్కయిపోయాడు. అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏమిటమ్మా ఇలా చెపుతున్నారు! నీవు రాకపోతే ఈ గ్రామములోని వారందరూ యెలా వుండగలరు?"

చంద్రముఖి కూడా కళ్ళు చెమర్చాయి. కొంచెం తియ్యగానే నవ్వి "ఇదేమిటి భైరవ్? నేను రెండు సంవత్సరాల క్రితమేగదా వచ్చింది. ఇంతకు పూర్వం మీరందరూ ఎలా వుండేవాళ్ళు?"

మొరటువాడైన భైరవుడు దీనికి సమాధానం చెప్పలేడు. కాని చంద్రముఖి మనసులో అంతా తెలిసే వుంది. భైరవుడి కొడుకు కేవలం ఆమెకు తోడుగా వస్తున్నాడు. బండిమీద అవసరమైన సామాగ్రి వేసికొని వెళ్ళేటప్పుడు ఆడవాళ్ళు మగవాళ్ళు, అందరూ చూడటానికి వచ్చారు. చూసి రోదిస్తూ వున్నారు. చంద్రముఖి కూడా కన్నీళ్ళను ఆపుకోలేక పోయింది. ఆ కలకత్తా నాశనంగానూ, దేవదాసే అక్కడ లేకపోతే కలకత్తాలో రాణీ పదవి లభించినా కూడా దానిని తృణంతో సమానంగా వదిలేసి కలకత్తాకు ఎన్నడూ వెళ్ళేదే గాదు.

రెండో రోజు ఆమె క్షేత్రమణి ఇంటికి వచ్చింది. ఆమె పూర్వం వున్న ఇంట్లో ఇప్పుడు వేరే వాళ్ళు వుంటున్నారు. క్షేత్రామణి అవాక్కయిపోయింది. "అక్కా! ఇంతవరకూ ఎక్కడున్నావు?" అని అడిగింది.

చంద్రముఖి వాస్తవాన్ని దాచి "అలహాబాదులో వున్నాను" అన్నది.

క్షేత్రమణి ఒక్కసారి ఆమెను ఆపాద మస్తకం తేరిపార జూసి "నీ సొమ్ములన్నీ ఏమైపోయాయి అక్కా?" అన్నది.

చంద్రముఖి నవ్వి క్లుప్తంగా "అన్నీ వున్నాయి" అన్నది.

అదే రోజు చిల్లర దుకాణాదారుణ్ణి కూడా కలిసి "దయాల్, నాకు ఇంకా ఎంత డబ్బు వస్తుందీ?" అని అడిగింది.

దయాల్ చాలా ఇబ్బందిలో పడ్డాడు. "అదే అరవయ్యో, డెబ్భైయ్యో ఇవ్వవలసి వుంటుంది. ఈ రోజు లేవు. రెండు  రోజుల తరువాత ఇచ్చేస్తాను." అన్నాడు.

"నీవు ఏమీ ఇవ్వనవసరం లేదు, నాకు ఒక పని చేసి పెడితే."

"ఏం పని?"

"రెండు మూడు రోజుల లోపలే మన పేటలో ఒక అద్దె ఇల్లు చూసిపెట్టు_తెలిసిందా?"

దయాల్ నవ్వి "తెలిసింది" అన్నాడు.

"ఇల్లు బాగుండాలి. మంచి మంచి పరుపులూ, దుప్పట్లూ, మంచమూ, లాంప్, రెండు కుర్చీలూ, ఒక టేబుల్ వుండాలి_తెలిసిందా?"

దయాల్ తల వంచుకున్నాడు.

"చీర, జాకెట్, టాయిలెట్ బాక్స్, మంచి గిల్టు ఆభరణాలు మొదలయినవి ఎక్కడ దొరుకుతాయి?"

దయాల్ అవి లభించే చోటు చెప్పాడు.

"అవన్నీ కూడా మంచివి చూసి ఒక సెట్ కొనవలసి ఉంటుంది. నేను వచ్చి నచ్చినవి తీసుకుంటాను" అని నవ్వి మళ్ళీ "నాకు ఇంకా ఏమేమి కావాలో అవన్నీ నీకు తెలుసుకదా? ఒక దాసీని కూడా మాట్లాడాలి."

"ఎప్పుడు కావాలి?" అన్నాడు దయాల్.

"ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా కావాలి. రెండు మూడు రోజులలో చూసిపెడితే బాగుంటుంది" అని చెప్పి అతడి చేతికి వంద రూపాయల నోటు యిచ్చి "మంచి మంచి వస్తువులు చూసి తీసుకొనాలి. చౌకబారువి తీసుకోవద్దు" అని చెప్పింది.

మూడవరోజు ఆమె కొత్తగా తీసికొన్న ఇంట్లోకి వెళ్ళిపోయింది. రోజంతా కేవల్ రామ్ ను తీసికొని తనకు నచ్చిన విధంగా ఇంటిని అలంకరించింది. సాయంత్రం కాబోయేముందు ఇహ తనను అలంకరించుకుంటూ వుంది. సబ్బుతో మొహం కడుక్కొంది. తరువాత పౌడర్ అద్దుకుంది. ఎర్ర రంగుతో పాదాలకు రంగు వేసుకుంది. తాంబూలం నమిలి పెదవులకు రంగు వేసుకుంది. తరువాత కొత్తచీర, జాకెట్ ధరించింది. ఒంటినిండా ఆభరణాలు ధరించింది. చాలా రోజుల తరువాత ఈ రోజు తల దువ్వుకొని కేశాలను అలంకరించుకొని నుదుట బొట్టు పెట్టుకుంది. అద్దంలో ముఖం చూసుకొని మనసులో 'ఇంకా నా నుదుట ఏమేమి వ్రాసి వుందో?' అని అనుకొన్నది.

పల్లెటూరి పిల్లవాడు కేవల్ రామ్ యీా అలంకరణ, ఈ దుస్తులు చూసి

గాభరాగా "ఇదేమిటక్కా?" అని అడిగాడు.

చంద్రముఖి నవ్వి "ఈ రోజు నా భర్త వస్తాడు కేవల్!" అన్నది.

కేవల్ రామ్ విస్మయంతో చూస్తూ వున్నాడు.

సాయంకాలం తరువాత క్షేత్రమణి వచ్చింది. "అక్కా! ఇదంతా ఏమిటే?" అని అడిగింది.

చంద్రముఖి తల వుంచుకుని నవ్వుతూ "ఏం-ఇవన్నీ ఇప్పుడు అవసరం లేదా?" అన్నది.

క్షేత్రమణి కొంచెం సేపు మౌనంగా చూస్తూ వుంది. తరువాత "వయసు ఎంతగా పెరుగుతూ పోతుందో, సౌదర్యం కూడా అంతగా పెరుగుతూ పోతుంది" అన్నది.

ఆమె వెళ్ళిపోయింది. చంద్రముఖి ఈ రోజు చాలా రోజుల తరువాత మళ్ళీ కిటికీ వద్దకు వచ్చి కూర్చున్నది. ఇదే ఆమె పని. అది చేయడానికే ఆమె వచ్చింది. ఎన్ని రోజులు ఆమె ఇక్కడ వుంటుందో అన్ని రోజులు ఇదే చేస్తుంది. కొందరు కొత్త వ్యక్తులు రాదలచుకొని వున్నారు. వాళ్ళు తలుపు నెట్టేవాళ్ళు. కాని అదే సమయంలో "ఇక్కడకు రావద్దు" అని కేవల్ రామ్ అంటూ వుండేవాడు.

పూర్వ పరిచితులు ఎవరయినా వస్తే చంద్రముఖి కూర్చొని, నవ్వుతూ మాట్లాడేది. మాటల సందర్భంలో దేవదాసు విషయం అడిగేది. వాళ్ళు చెప్పలేకపోతే నిర్లిప్తంగా వాళ్ళకు వీడ్కోలిచ్చేది. రాత్రి ప్రొద్దుపోయిన తరువాత స్వయంగా బయటికి వెళ్ళిపోయేది. ప్రతి పేటా, ప్రతి ద్వారమూ తిరిగేది. చాటునుండి జనం చెప్పుకునే మాటలు జాగ్రత్తగా వినేది. కొందరు వ్యక్తులు అనేక రకాల మాటలు మాట్లాడుకుంటూ వుండేవారు. కాని ఆమె వినదలచుకున్నది. వినలేకపోతున్నది. వచ్చేపోయే వాళ్ళల్లో చాలామందిని దేవదాసని భ్రమపడి దగ్గరకు వెళ్ళేది. కాని అతడు మరొక వ్యక్తి కాగానే నెమ్మదిగా తిరిగి వచ్చేది. మధ్యాహ్నం పూట ఆమె తన పూర్వపు పరిచితురాండ్ర ఇండ్లకూ, స్నేహితురాండ్ర ఇళ్ళకూ వెళ్ళేది. మాటల సందర్భంలో "ఏం? దేవదాసు విషయం మీకేమైనా తెలుసా?" అని అడిగేది.

"దేవదాసు ఎవరూ?" అని వాళ్ళు మళ్ళీ అడిగేవాళ్ళు.

చంద్రముఖి ఆసక్తితో పరిచయం చేస్తూ వుండేది-ఎర్రటివాడు, తల మీద ఉంగరాలు తిరిగిన జుట్టు, ముఖంమీద ఒకవైపు గాయపడిన మచ్చ వుండేది. ధనవంతుడయిన మనిషి, చాలా డబ్బు ఖర్చు చేస్తాడు. ఏం-మీకు ఎవరికయినా తగిలాడా?"

ఎవరూ జాడ చెప్పలేకపోయే వాళ్ళు. నిరాశతో - నిర్లిప్తంగా వున్న మనస్సుతో చంద్రముఖి ఇంటికి తిరిగి వచ్చేది. చాలా రాత్రివరకు దారివైపు చూస్తూ వుండేది. నిద్రవస్తే ఉదాసీన భావంతో లోలోపల....అనుకునేది_"ఇది నీవు నిద్రపోయే సమయమా?"

ఇదే విధంగా ఒక నెలరోజులు గడిచిపోయాయి. కేవల్ రామ్ కూడా విసిగిపోయాడు, ఆయన ఒకవేళ ఇక్కడ లేడేమోనని, స్వయంగా చంద్రముఖికి కూడా సందేహం కలుగుతూ వుంది. అయినా ఆశతోనూ, విశ్వాసంతోనూ రోజులుకు రోజులు గడిచిపోతున్నాయి.

కలకత్తా వచ్చి ఒకటిన్నర మాసాల కాలం దాటిపోయింది. ఈ రోజు ఆమెకి బ్రహ్మ ప్రసన్నుడయ్యాడు. రాత్రి పదకొండు గంటలైంది. నిరాశతో ఆమె ఇంటికి తిరిగివస్తూ వుంది. ఇంతలో చూసింది, దారిలో ఒక వైపు ఒక ద్వారం ఎదురుగా ఒక మనిషి తనలో తాను ఏదో గొణుగుతూ వున్నాడు. ఈ కంఠస్వరం ఆమెకు బాగా పరిచితమైనదే కోట్లాదిమంది మధ్యలో గూడా ఆమె ఆ స్వరాన్ని గుర్తించగలదు. ఆ ప్రదేశం కొంచెం చీకటిగా వుంది. అక్కడే ఒక వ్యక్తి మత్తులోపడి వున్నాడు. చంద్రముఖి దగ్గరకు వెళ్ళి ఒంటిమీద చేయివేసి అడిగింది_"నీవు ఎవరివీ? ఎందుకు ఇక్కడ ఇలా పడి వున్నావు?"

ఆ వ్యక్తి బిగ్గరగా అన్నాడు_ "నా మనసులోని మాటలు విను, ఒకవేళ పొందితే నేను నీ భర్తను."

చంద్రముఖికి ఇప్పుడు మరేమీ సందేహం లేదు. "దేవదాస్!" అని ఆమె పిలిచింది.

దేవదాసు ఆ మాదిరిగానే "ఊఃః!" అన్నాడు.

"ఇక్కడ పడున్నావు ఎందుకు? ఇంటికి వస్తావా?"

"రాను, బాగానే వున్నాను."

"కొంచెం మద్యం త్రాగుతావా?"

"అవును, త్రాగుతాను" అని చెప్పి అమాంతంగా చంద్రముఖి కంఠం పట్టుకున్నాడు. "ఇటువంటి మేలు చేసేవాడివి నీవు ఎవరివి సోదరా?"

చంద్రముఖి నయనాలనుంచి అశ్రువులు రాలుతున్నాయి. చాలా శ్రమపడుతూ, పడుతూలేస్తూ చంద్రముఖి భుజం ఆధారంగా చేసుకొని లేచాడు. కొంచెం సేపు ముఖం వైపు చూసిన తరువాత_"ఇది చాలా మంచి వస్తువు సోదరా?" అన్నాడు.

చంద్రముఖి నీరసంగా నవ్వి "అవును చాలా మంచి వస్తువు.కొంచెం నా భుజం ఆధారం చేసుకొని ఇంకొంచెం ముందుకు పద. ఒక బండి మాట్లాడుకోవలసి వుంటుంది" అన్నది.

"బండి ఏమి వుంటుంది?" దారిలో వస్తూ వస్తూ అలసిపోయిన కంఠంతో అన్నాడు దేవదాసు__ "సుందరీ! నీవు నన్ను గుర్తించుతున్నావా?"

"అవును, గుర్తుపడుతున్నాను" అన్నది చంద్రముఖి.

దేవదాసు నత్తిగా పలుకుతున్నాడు_ "ఇతరులందరూ నన్ను మరచిపోయారు. నీవు నన్ను గుర్తుపడుతున్నావంటే అదృష్టమే!" తరువాత బండిమీద ఎక్కి, చంద్రముఖి శరీరం మీద తన బరువును వేసే ఇంటి వద్దకు వచ్చాడు. ద్వారం వద్ద నిలబడి జేబులో ఏమీ లేదు" అన్నాడు.

చంద్రముఖి ఏమీ జవాబు చెప్పలేదు. మౌనంగా చేయి పట్టుకొని పైకి తీసికొని వచ్చి పడుకోబెట్టి "నిద్రపో" అని అన్నది.

దేవదాసు అలాగే అలసిపోయిన కంఠంతో_"ఏమీ అక్కరలేదా? జేబు ఖాళీగా వుందని ఏమీ దొరికే ఆశ లేదనీ నేను చెప్పానే" అర్ధమయిందా సుందరీ?" అన్నాడు.

సుందరి దానిని అర్థం చేసుకున్నది. "రేపు ఇవ్వు" అన్నది.

"ఇంత విశ్వాసం మంచిదికాదు. ఏం కావాలి, విప్పి చెప్పు?" అన్నాడు దేవదాసు.

"రేపు విను" అని చెప్పి ఆమె ప్రక్కనున్న మరో గదిలోకి వెళ్ళిపోయింది.

దేవదాసు నిద్ర లేచేసరికి ప్రొద్దెక్కిపోయింది. ఇంట్లో ఎవరూ లేరు. చంద్రముఖి స్నానంచేసి వంటచేసే ప్రయత్నంలో వుంది. దేవదాసు నలువైపులా ఆశ్చర్యంగా చూశాడు. ఈ చోటుకు ఆయన ఎప్పుడూ రాలేదు. ఒక్క వస్తువు కూడా గుర్తించలేకపోయాడు. గత రాత్రికి సంబంధించిన ఒక్క మాట కూడా గుర్తుకురావడంలేదు. కేవలం ఎవరిదో హృదయ పూర్వకమైన సేవ కొంచెం స్మరణకు వస్తూ వుంది. ఎవరో చాలా స్నేహంతో తీసికొని వచ్చి నిద్రపుచ్చినట్లుగా వుంది. ఇదే సమయంలో చంద్రముఖి ఇంట్లోకి ప్రవేశించింది. రాత్రి అలంకరణకూ ఇప్పటికీ చాలా మార్పు వచ్చేసింది. ఒంటిమీద ఆభరణాలు ఇప్పటికీ అవే వున్నాయి. కాని రంగు వేసిన అందమైన చీర, నుదురుమీద తిలకం, నోట్లో తాంబూలపు మరక మొదలైనవి ఏమీ లేవు. కేవలం ఉతికిన ఒక తెల్లటి చీర ధరించి ఇంట్లోకి వచ్చింది. దేవదాసు చంద్రముఖిని చూసి నవ్వాడు. "నిన్న నన్ను ఎక్కడనుంచి ఇక్కడకు పిలుచుకొని తీసుకొచ్చావు?" అన్నాడు.

"పిలుచుకు రాలేదు. దారిలో పడివుండటం చూసి ఎత్తుకొచ్చాను" అన్నది చంద్రముఖి.

"సరే, ఇదంతా అయ్యిందేదో అయ్యింది. కాని నిన్ను ఇక్కడ ఎట్లా చూడగలుగుతున్నాను? నీవు ఎప్పుడు వచ్చావు? నీవు ఆభరణాలు ధరించేదానివి కాదుగదా, మళ్ళీ ఎలా ధరిస్తున్నావు?" అన్నాడు దేవదాసు గాంభీర్యంగా.

చంద్రముఖి దేవదాసు ముఖంవైపు తీవ్రంగా చూస్తూ "మళ్ళీ....!" అన్నది.

కాదు, కాదు, ఇది సంభవం కాదు. ఇలా పరిహసించడంలో కూడా దోషం వుంది. ఎప్పుడొచ్చావు?" అన్నాడు దేవదాసు నవ్వుతూ.

"ఒకటిన్నర నెల అయింది" అన్నది చంద్రముఖి.

దేవదాసు మనస్సులోనే ఏదో లెక్క వేసుకున్నాడు. తరువాత-"నా యింటినుంచి తిరిగి వచ్చిన తరువాతనే ఇక్కడకు వచ్చావా?" అన్నాడు.

చంద్రముఖి ఆశ్చర్యపోయింది. మీ యింటికి నేను వెళ్ళిన సంగతి మీకెలా తెలిసింది?" అన్నది.

దేవదాసు అన్నాడు-"నీవు తిరిగి వచ్చిన తరువాతే నేను ఇంటికి వెళ్ళాను. నిన్ను పెద్ద కోడలు దగ్గరకు తీసికొని వెళ్ళిన దాసీ ద్వారా, నిన్న అశథ్ ఝూరీ గ్రామం నుంచి చాలా అందంగా వున్న ఒక స్త్రీ వచ్చిందీ అని విన్నాను. కాని తెలుసుకోవడం ఎంత కష్టం? కాని ఇన్ని ఆభరణాలు ఎక్కడ చేయించావు?"

"చేయించడంలేదు. ఇవన్నీ గిల్టు ఆభరణాలు. కలకత్తా వచ్చి వీటిని కొన్నాను. నిన్ను చూడటం కోసం నేను అనవసరంగా ఎంత ఖర్చు చేశాననుకున్నావు? పైగా నిన్న నీవు అసలు నన్ను గుర్తుపట్టలేకపోయావు."

హఠాత్తుగా గుర్తుపట్టలేకపోయాను. ప్రయత్నించిన మీదట గుర్తుపట్టాను. చంద్రముఖి తప్ప నాకు ఇటువంటి సేవ ఎవరుచేస్తారని అనేక సార్లు మనసులో అనిపించింది" అన్నాడు దేవదాసు నవ్వుతూ.

ఆనందం కారణంగా చంద్రముఖికి రోదించాలనే అభిలాష కలిగింది. కొంచెంసేపు మౌనంగా వుండి సేవదాస్! ఇప్పుడు నన్ను అలాగే ఏవగించుకొంటున్నావా లేదా?" అని అడిగింది.

"లేదు, పైగా ప్రమిస్తున్నాను" అన్నాడు దేవదాసు.

మధ్యాహ్నం స్నానం చేసేటప్పుడు చంద్రముఖి చూసింది. దేవదాసు

రొమ్ముమీద ఫ్లానల్ గుడ్డ కట్టి వుంది. గాభరాపడి "ఇదేమిటి? ఫ్లానల్ ఎందుకు కట్టుకున్నావు?" అని అడిగింది.

"గుండెలో ఓ విధమైన నొప్పి కలుగుతుంది. నీవు సుఖంగా వున్నావా?" అన్నాడు దేవదాసు.

చంద్రముఖి తల బాదుకుంటూ "సర్వనాశనం చేయదలచుకున్నావా ఏం? ఊపిరితిత్తుల్లో నొప్పిగా వుందా?" అన్నది.

దేవదాసు నవ్వుతూ అన్నాడు_"చంద్రముఖి! అటువంటిదే ఏదో వుంది" అదే రోజు డాక్టరు వచ్చి చాలాసేపటివరకు పరీక్ష చేసిన తర్వాత ఇదే సందేహాన్ని సిద్ధపరచాడు. మందు వ్రాసిచ్చాడు. ప్రత్యేకమైన జాగ్రత్తలో ఉంచకపోతే గొప్ప అనిష్టం జరగవచ్చు" అన్నాడు. ఇరువురూ దీని తాత్పర్యం తెలుసుకున్నారు. ఉత్తరం వ్రాసి ఇంటివద్దనుంచి ధర్మదాసును పిలిపించారు. చికిత్సకోసం బ్యాంకు నుంచి డబ్బు వచ్చింది. రెండు రోజులు ఈ విధంగానే గడిచిపోయాయి. కాని మూడో రోజు జ్వరం ప్రారంభమయింది.

దేవదాసు చంద్రముఖిని పిలిచి "చాలా మంచి సమయానికి వచ్చావు. లేకపోతే నన్ను ఇక్కడ ఎవరు చూస్తారు? కన్నీళ్ళు తుడుచుకొని చంద్రముఖి తన శక్తికొలదిగా సేవ చేయడానికి కూర్చున్నది. రెండు చేతులు జోడించి ప్రార్థించింది. భగవంతుడా! ఇటువంటి ఆకాలంలో ఇంతపని వచ్చిపడుతుందని కలలో గూడా ఆశించలేదు. దేవదాసును శీఘ్రంగా, ఆరోగ్యవంతునిగా చేయమని నా ప్రార్ధన."

దాదాపు ఒక మాసం కన్న పైగానే దేవదాసు మంచంమీద పడివున్నాడు. మరల క్రమంగా ఆరోగ్యవంతుడవుతున్నాడు. రోగం ఎక్కువగా పెరగలేకపోయింది.

ఇదే సమయంలో ఒక రోజు దేవదాసు "చంద్రముఖీ! నీ పేరు చాలా పెద్దది. పిలవడానికి కొంచెం అసౌకర్యంగా ఉన్నట్లుంది. దీనిని కొంచెం చిన్నదిగా చేయదలచుకున్నాను" అన్నాడు.

"మంచిది అలాగే" అన్నది చంద్రముఖి.

"ఈ రోజు నుంచి నిన్ను "కోడలూ" అని పిలుస్తాను."

చంద్రముఖి ఫక్కున నవ్వింది_"ఇలా పిలవడానికి ఒక ఉద్దేశ్యము కూడా వుండాలి" అన్నది.

"ఏం, అన్ని విషయాలకు ఉద్దేశ్యం ఉంటుందా? నా ఇష్టం."

"ఇష్టమే అయితే పిలువు. కాని ఆ ఇష్టం ఎటువంటిదో, అదైనా చెప్పు?"

"వద్దు, కారణమేదీ అడగవద్దు."

చంద్రముఖి తల వాల్చుకొని "మంచిది. అయితే అలాగే పిలువు" అన్నది.

దేవదాసు చాలాసేపు మౌనంగా ఉన్న తరువాత హఠాత్తుగా గంభీరభావంతో అడిగాడు-"సరే కోడలూ! నీవు నాకు ఎవరివి? ప్రాణాన్ని సైతం లక్ష్యపెట్టకుండా నాకు ఇంత సేవ చేస్తున్నావు?"

చంద్రముఖి సిగ్గుపడుతూ వుండే వధువూ కాదు, సంభాషణలో అలవాటులేని బాలికా కాదూ, దేవదాసు ముఖంవైపు దృష్టి వుంచి, స్నేహపూరితమైన కంఠంతో "నీవు నా సర్వస్వానివి. ఏం, ఇది ఇప్పటికీ గూడా తెలుసుకోలేకపోయావా?"

దేవదాసు గోడవైపు చూస్తూ ఉన్నాడు. అటువైపే చూస్తూ నెమ్మదిగా అన్నాడు_"ఇదంతా నాకు తెలుసు. కాని దీని వలన ఆనందం లభించడం లేదు. పార్వతిని నేను ఎంతగా ప్రేమించేవాణ్ణి, ఆమె కూడా నన్ను ఎంతగా ప్రేమించేది. కాని దీనివలన చివరకు కష్టమే లభించింది. చాలా దుఃఖాన్ని పొందిన మీదట ఇక ఎప్పుడూ ప్రేమ అనే ఉచ్చులో పడగూడదనుకున్నాను. తెలిసి ఉండి పడలేదు కూడా. కాని నీవు ఏమిటి ఇలా చేశావు? బలవంతం పెట్టి నన్ను మళ్ళీ అందులో ఎందుకు బంధించావు?" అని చెప్పి కొన్ని క్షణాలు మౌనంగా ఉన్న తరువాత మళ్ళీ_"కోడలూ, నీవు కూడా పార్వతిలాగే దుఃఖం అనుభవిస్తావనే అనిపిస్తున్నది."

దేవదాసు పమిట చెంగుతో కప్పుకొని మంచంమీద ఒకవైపు మౌనంగా కూర్చొని ఉంది.

చంద్రముఖి మళ్ళీ తన మృదువైన కంఠంతో చెప్పడం ప్రారంభించాడు_"మీ ఇరువురిలో ఎంతో వైషమ్యం ఉంది. ఒకామె ఎంతో అభిమానం గలది. ప్రబలమైనది. మరొకామె ఎంతో శాంతం గలది, సంయమనం గలది. ఆమె ఏమీ సహించలేదు. నీవు ఎంతో సహించగలవు. ఆమెకు ఎంతో కీర్తి ఉన్నది. ఎంతో పేరు ఉన్నది. నీవు ఎంతో కళంకం పొందినదానవు.అందరూ ఆమెను ప్రేమిస్తారు. కాని నిన్నెవ్వరూ ప్రేమించరు. అయినా నేను ప్రేమిస్తాను- ఎలా ప్రేమిస్తాను?" అని చెప్పి దీర్ఘమైన నిట్టూర్పు ఒకటి విడిచి మళ్ళీ చెప్పాడు- "పాప పుణ్యాలను విచారించేవాడు నిన్ను ఎలా విచారిస్తాడో చెప్పలేను. కాని మృత్యువు తరువాత, ఒకవేళ కలయిక అంటూ వుంటే నేను ఎన్నటికీ నీకు దూరంగా ఉండను."

చంద్రముఖి లోలోపల రోదించింది. మనస్సు చాలా చిన్నబోయింది. మనసులో ప్రార్థించసాగింది__ "ఓ భగవంతుడా_! ఏ కాలంలో గానీ, ఏ జన్మలోగానీ

ఒకవేళ యీ పాపిష్టి దానికి ప్రాయశ్చిత్తమైపోతే నాకు ఈయననే బహుమతిగా ప్రసాదించవలసిందిగా కోరుతున్నాను.

* * * *

రెండు మాసాలు గడిచిపోయాయి. దేవదాసు ఆరోగ్యవంతుడు అయ్యాడు. కాని ఇంకా శరీరం దృఢంగాలేదు. గాలి మార్పు అవసరంగా వుంది. రేపు పడమటి ప్రాంతానికి వెళ్ళిపోతాడు. తోడుగా కేవలము ధర్మదాసుమాత్రమే వుంటాడు.

చంద్రముఖి దేవదాసు చేయి పట్టుకొని "నీకు ఒక దాసీ కూడా కావాలి. నన్ను వెంట తీసికొని వెళ్ళు" అన్నది.

"ఛీ! ఇది సాధ్యమవుతుందా? ఇంకేమైనా చేస్తాను గాని ఇంత సిగ్గులేని పని చేయలేను" అన్నాడు దేవదాసు.

చంద్రముఖి మౌనం వహించింది. ఆమె తెలియనిదేమీ కాదు. అన్ని విషయాలూ సహజంగానే తెలుసుకున్నది. ఇంకేమైనా కానివ్వు, కాని ఈ ప్రపంచంలో ఆమెకు గౌరవం లేదు. ఆమె వుండటం వలన దేవదాసుకు సేవ బాగా జరుగుతుంది. సుఖం దొరుకుతుంది. కాని ఎక్కడా గౌరవం లభించదు. కళ్ళు తుడుచుకుని "ఇక మళ్ళీ ఎప్పుడు చూడగలను?" అన్నది.

"ఇది చెప్పలేను. ఎక్కడవున్నా సరే, కాని నిన్ను మాత్రం మరచిపోను. నిన్ను చూడాలనే తృష్ణ ఎప్పుడూ వుంటుంది. అది మాసిపోదు" అన్నాడు దేవదాసు.

నమస్కారం చేసి చంద్రముఖి వేరుగా నిలబడిపోయింది. మనసులో అనుకున్నది__"ఇదే చాలు నాకు. ఇంతకన్నా ఎక్కువ ఆశించడం వ్యర్థం."

వెళ్ళేటప్పుడు దేవదాసు చంద్రముఖి చేతిలో మరో రెండు వేల రూపాయలు పెట్టి "వీటిని వుంచు, మనిషి శరీరాన్ని విశ్వసించలేము. తరువాత నీవు కష్ట సుఖాలలో ఎవరి ముందు చేయి చాపుతావు?" అన్నాడు.

చంద్రముఖి దీన్నికూడా అర్థం చేసుకున్నది. అందుచేతనే డబ్బు తీసుకున్నది. కన్నీరు తుడుచుకొని "నీవు ఒక్క సంగతి నాతో చెప్పిపో" అని అడిగింది.

"ఏమిటి?" అన్నాడు దేవదాసు ఆమె ముఖంవైపు చూస్తూ.

"పెద్ద కోడలు_మీ వదినె_నీ శరీరంలో చెడు రోగం పుట్టిందని చెప్పింది, ఇది నిజమేనా?" అన్నది చంద్రముఖి.

ప్రశ్న వినగానే దేవదాసుకు చాలా దుఃఖం కలిగింది_"పెద్ద కోడలు అన్నీ చెప్పగలదు. అయితే నీకు తెలియదా ఏమిటి? నీకు తెలియని రహస్యం ఏమి వుంది నా దగ్గర? ఒక విషయంలో నీవు పార్వతి కన్న పెరిగిపోయావు" అన్నాడు.

చంద్రముఖి ఒక్కసారి కళ్ళు తుడుచుకొని 'అంతా అర్ధమయింది. అయినా చాలా జాగ్రత్తగా వుండు. నీ శరీరం దుర్బలంగా వుంది. చూడు, ఏ రకమైన లోపమూ జరగకూడదు" అన్నది. ప్రత్యుత్తరంగా కేవలం నవ్వాడు దేవదాసు.

"మరో భిక్ష, కొంచెం ఆరోగ్యం చెడిపోయినా తప్పకుండా నాకు కబురు చేయాలి" అన్నది చంద్రముఖి.

దేవదాసు ఆమె ముఖంవైపు చూసి తల వంచుకొని "కబురు చేస్తాను_తప్పకుండా కబురు చేస్తాను కోడలూ!" అన్నాడు. మరొక సారి నమస్కారం చేసి చంద్రముఖి రోదిస్తూ రెండోగదిలోకి వెళ్ళిపోయింది.

## 16

కలకత్తా నుంచి వచ్చి దేవదాసు కొన్ని రోజులు అలహాబాదులో ఉన్నాడు. ఆ మధ్యలో ఆయన చంద్రముఖికి ఒక ఉత్తరం వ్రాశాడు....కోడలూ, ఇప్పుడు ఎవరినీ ప్రేమించకూడదనే అనుకున్నాను. ఒకటేమో ప్రేమించి రిక్తహస్తాలతో తిరిగివస్తే చాలా యాతన అనుభవించవలసి వస్తున్నది. రెండోది ఈ ప్రపంచంలోని ప్రేమ మార్గమే దుఃఖంతోనూ, దైన్యంతోను నిండి వున్నది.

దీనికి జవాబుగా చంద్రముఖి ఏమి వ్రాసిందో దానిని ఇక్కడ వ్రాయవలసిన అవసరం లేదు. అయితే ఈ సమయంలో దేవదాసు మనస్సులో కేవలం ఇదే ఆలోచిస్తూ వున్నాడు. ఒకసారి ఆమె ఇక్కడకు రావడం బాగుంటుందా వుండదా?

మరుక్షణమే ఆలోచించేవాడు....లేదు-లేదు, ఏం పని లేదు. ఒకవేళ ఏ రోజు అయినా పార్వతి వింటే ఏమంటుంది? ఈ రకంగా ఒకప్పుడు పార్వతి, మరొకప్పుడు చంద్రముఖి ఆయన హృదయంలో వుంటుండేవాళ్ళు. మరొకప్పుడు ఇద్దరి ముఖాలు ఆయన హృదయపు తెరమీద ముద్రింపబడుతూ ఉండేవి. ఇద్దరిమీదా గాఢమైన ప్రేమవున్నట్లుగా హృదయములో ఇద్దరూ ప్రక్క ప్రక్కనే నివసిస్తూ వుండేవాళ్ళు. ఒక్కో రోజు అమాంతంగా వాళ్ళిద్దరూ నిద్రపోయారా అన్నట్లుగా ఆలోచించేవాడు. ఈ సమయంలో ఆయన హృదయం శూన్యంగా వుండిపోయేది. కేవలం ఒక నిర్జీవమైన అసంతృప్తి ఆయన హృదయంలో మిథ్యయైన ప్రతిధ్వనిలాగా ధ్వనించేది. ఆ తరువాత దేవదాసు లాహోరు వెళ్ళిపోయాడు. అక్కడ చున్నీలాల్ ఉద్యోగం చేస్తూ వున్నాడు. కబురు అందగానే కలుసుకొనడానికి వచ్చాడు. చాలా రోజుల తర్వాత ఈ రోజు మిత్రులిద్దరూ ఒకరి

నౌకరు చూసి సిగ్గు పడ్డారు. దానితో పాటు సుఖపడ్డారు కూడా. మళ్ళీ దేవదాసు మద్యం తాగడం ప్రారంభించాడు. చంద్రముఖి నీడ ఆయన మనసులో నిలిచే వుంది. ఆమె మద్యాన్ని నిషేధించింది. ఆలోచించేవాడు, ఆమె ఎంత తెలివిగలది! ఎంత ధైర్యం గలది! ఎంత శాంతం గలది! ఆమె ఎంతో స్నేహంగా వుండేది. పార్వతి ఈ సమయంలో స్వప్నం మాదిరిగా మరపున బడివుండేది. కేవలం ఆరిపోతున్న దీపంలాగా అప్పుడప్పుడు ఆమె స్మృతి గుప్పుమని వెలిగేది. అక్కడి వాతావరణం ఆయనకు అనుకూలపడలేదు. మధ్య మధ్యలో జబ్బు పడుతూ వున్నాడు. గుండెలో మళ్ళీ పోటుగా వున్నట్లనిపించేది. ధర్మదాసు ఒకరోజు ఏడుస్తూ అన్నాడు....దేవా, నీ శరీరం మళ్ళీ పడిపోతున్నది. మరోచోటుకు పోదాం పద."

దేవదాసు పరధ్యానంగా "సరే, వెళదాంలే" అంటూ సమాధానమిచ్చాడు.

దేవదాసు సాధారణంగా ఇంటివద్ద మద్యం త్రాగాడు. ఎప్పుడైనా చున్నీలాల్ వస్తే త్రాగుతాడు. మరెప్పుడైనా నా బయటికి వెళ్ళిపోతాడు. రాత్రి మూడవజామునో, లేక నాలుగవ జామునో ఇంటికి తిరిగి వచ్చేసాడు. ఒక్కోరోజు అసలు వచ్చేవాడు కూడా కాదు. ఇప్పటికి రెండు రోజుల నుంచి ఆయన జాడలేదు. శోకం కారణంగా ధర్మదాసు ఇప్పటివరకు అన్నం తినలేదు. ఆఖరుకు మంచినీళ్ళు కూడా త్రాగలేదు. మూడవరోజు జ్వరంతో ఇంటికి తిరిగి వచ్చాడు. మంచం ఎక్కాడు. ముగ్గురు డాక్టర్లు వచ్చి చికిత్స ప్రారంభించారు.

"దేవదా, కాశీలో వున్న అమ్మకు కబురు పంపించనా?" అడిగాడు ధర్మదాసు.

"ఛీ!ఛీ! అమ్మకు ఈ ముఖం ఎలా చూపించేది? ఇది ఆమెకు చూపించదగినదా?" అన్నాడు, దేవదాసు కబురు పంపించ వద్దంటూ.

"రోగాలనేవి అందరికీ వస్తుంటాయి. అందుకని ఇంత పెద్ద దుఃఖాన్ని తల్లికి తెలియకుండా దాచిపెట్టవచ్చునా? నీవు ఏమీ సిగ్గుపడవలసిన పనిలేదు. దేవదా, కాశీకి వెళదాం పద" అన్నాడు ధర్మదాసు.

దేవదాసు ముఖం మలుపుకున్నాడు. "వద్దు ధర్మదాస్! ఈ సమయములో ఆమె వద్దకు వెళ్ళలేను. నయం అయిన తరువాత చూద్దాం!" అన్నాడు.

ధర్మదాసు మనస్సులో ఆలోచించాడు. చంద్రముఖిని ఎంతగానో ద్వేషిస్తున్నాడు. అంచేత ఆమెను గురించి ఆలోచన వచ్చినప్పటికీ అతడు మౌనంగానే వుండిపోయాడు.

స్వయంగా దేవదాసుకు కూడా చంద్రముఖిని పిలిపించాలనే కోర్కెకలుగుతూ వుంది. కానీ ఏమీ చెప్పలేక పోతున్నాడు. అందువల్ల ఎవరూ

రాలేదు. కొన్ని రోజుల తరువాత ఆయన నెమ్మదిగా కోలుకుంటూ ఉన్నాడు. ఒకరోజు ఆయన ధర్మదాసుతో "నీకు ఇష్టమైతే పద, ఈ సారి మరెక్కడికయినా వెళ్ళిపోదాం" అన్నాడు.

"ఇప్పుడు మరెక్కడికీ వెళ్ళవలసిన అవసరంలేదు. వీలైతే ఇంటికి వెళదాం పద. లేకపోతే అమ్మ దగ్గరకి వెళదాం పద."

సామానంతా కట్టగట్టుకుని, చున్నీలాల్ దగ్గర వీడ్కోలందుకొని దేవదాసు మళ్ళీ అలహాబాదుకు వచ్చేశాడు. శరీరం ఇప్పుడు చక్కగా బాగుపడింది. కొన్ని రోజుల తరువాత ఒకరోజు ధర్మదాసుతో "ధర్మా, ఏదైనా కొత్త చోటుకు రావా? ఇంతవరకు బొంబాయి చూడలేదు. అక్కడికి వెళదామా?" అన్నాడు.

ఆయనకు ఆ కోర్కె బలంగా వుండటంతో, తనకు ఇష్టం లేకపోయినా కూడా ధర్మదాసు బొంబాయి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. అది జ్యేష్ఠమాసం. బొంబాయి పట్టణం ఇతర పట్టణాలకన్న అంత పెద్ద వేడిగా లేదు. ఇక్కడకు వచ్చిన తరువాత దేవదాసుకు చాలా విశ్రాంతి లభించింది.

"ఇక్కడ చాలా రోజులు వున్నాం. ఇప్పుడు ఇంటికి వెళ్ళటం బాగుంటుంది" అన్నాడు ఒకరోజు ధర్మదాసు.

"వద్దు, ఇక్కడ బాగున్నాను. ఇంకా కొన్ని రోజులు ఒక్కడే వుంటాను" అన్నాడు.

* * * *

ఓ సంవత్సరం గడిచిపోయింది. అది భాద్రపద మాసం. ఒకరోజు ఉదయం దేవదాసు, ధర్మదాసు భుజానికి ఆనుకొని బొంబాయి ఆసుపత్రి బయటకు వచ్చి బండిమీద కూర్చున్నాడు. "దేవదా! నా సలహా విని ఇప్పుడు అమ్మ దగ్గరకు వెళ్ళడం బాగుంటుంది" అన్నాడు ధర్మదాసు.

దేవదాసు బొటబొటా కన్నీళ్ళు కార్చాడు. అనేక రోజులనుంచి ఆయన కూడా అమ్మను తలుచుకుంటూ వున్నాడు. ఆసుపత్రిలో పడి వుండి అప్పుడప్పుడూ ఆయన అదే ఆలోచిస్తూ వుండేవాడు. ఈ ప్రపంచంలో ఆయనకు అందరూ వున్నారు, ఎవ్వరూ లేరు కూడా. ఆయనకు తల్లి వుంది, అన్న వున్నాడు, సోదరికన్నా మించిన పార్వతి వున్నది, చంద్రముఖి కూడా వున్నది. ఆయనకు అందరూ వున్నారు. కాని అయన ఎవ్వరికీ లేడు. "ఇంతకన్నా అమ్మ దగ్గరకు వెళ్ళడం మంచిది" అన్నాడు ధర్మదాసు ఏడుస్తూ.

దేవదాసు ముఖం మలుపుకొని, కన్నీళ్ళు తుడుచుకొని "కాదు ధర్మదాస్! అమ్మకు నా ముఖం చూపించలేకుండా వున్నాను. ఇంకా నాకు సమయం రానట్లే

వుంది" అన్నాడు.

వృద్ధుడయిన ధర్మదాసు వెక్కి వెక్కి ఏడుస్తూ వున్నాడు. "అమ్మ ఇంకా బ్రతికే వుందయ్యా!" అన్నాడు.

ఈ మాటలో ఎంత భావం ఇమిడి వుందో దాన్ని ఆ ఇద్దరి అంతరాత్మలే అనుభవం చేసుకోగలవు. దేవదాసు పరిస్థితి ఇప్పుడు చాలా శోచనీయంగా వుంది. పొట్టనంతటినీ ప్లీహమూ, ఊపిరితిత్తీ కమ్మివేశాయి. ఆ పైన జ్వరము, దగ్గు ప్రబలంగా ప్రకోపించింది.శరీరం నల్లబడిపోయింది. కేవలం కంకాళం మాత్రమే మిగిలి వుంది. కళ్ళు లోపలికి పీక్కుపోయాయి. వాటిలో ఒక రకపు అస్వాభావికమైన కాంతి మెరుస్తూ వుంటున్నది. తల మీది కేశాలు ఎండి బిరుసెక్కిపోయాయి. ప్రయత్నిస్తే వాటిని లెక్క పెట్టవచ్చు కూడా. చేతివ్రేళ్ళను చూస్తుంటే రోత బడుతున్నది. అవి దుర్బలంగా, సన్నగా, ఇతర నికృష్టమైన రోగాల మచ్చలతో చెడిపోయాయి. స్టేషను దగ్గరకు వెళ్ళిన తరువాత ధర్మదాసు "దేవదా, టికెట్ ఎక్కడికి తీసుకుందాం?" అని అడిగాడు.

దేవదాసు కొంచెం ఆలోచించి "పద, ముందు ఇంటికి పోదాం, తరువాత చూద్దాం" అన్నాడు.

బండి ప్లాట్ ఫారం మీదికి వచ్చింది. వాళ్ళు హుగ్లీకి టికెట్ కొనుక్కొని బండెక్కారు. ధర్మదాసు దేవదాసు దగ్గరే వున్నాడు. సాయంకాలానికి కొంచెం ముందే దేవదాసు కళ్ళ నుంచి అగ్నికణాలు రాలుతున్నవా అన్నట్లు అవి ఎరుపెక్కాయి. క్రమంగా తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆయన ధర్మదాసును పిలిచి "ధర్మదాస్! ఈరోజు ఇంటికి చేరడం కూడా కష్టమే ననిపిస్తుంది" అన్నాడు.

ధర్మదాసు భయపడుతూ "ఎందుకయ్యా?" అన్నాడు.

దేవదాసు నవ్వడానికి ప్రయత్నిస్తూ "మళ్ళీ తీవ్రమయిన జ్వరం వచ్చింది ధర్మదాస్!" అన్నాడు.

బండి కాశీ దాటిపోయింది. అప్పటివరకు దేవదాసు చైతన్యరహితంగా వున్నాడు. పటనా దగ్గరకు వచ్చేసరికి ఆయన స్పృహలోకి వచ్చాడు. "అయితే ధర్మదాస్, నిజంగానే అమ్మ దగ్గరకు వెళ్ళలేకపోయాం" అన్నాడు ధర్మదాసు.

ప్రత్యుత్తరంగా దేవదాసు_"పోనివ్వు, ఇప్పుడు మనం ఇంటి దగ్గరకే వెళ్ళే దిగుదాం" అన్నాడు.

బండి పండువా స్టేషను దగ్గరకు వచ్చి నిలబడింది. అప్పుడు తెల్లవారుతూ వుంది. రాత్రంతా బాగా వర్షం కురిసింది. ఇప్పుడే కొంచెం సేపటినుంచి ఆగి వుంది. దేవదాసు లేచి నిలబడ్డాడు. క్రింద ధర్మదాసు

నిద్రపోతున్నాడు. నెమ్మదిగా అతడి తలమీద చేయి వుంచాడు. కాని సిగ్గువల్ల అతణ్ణి మేల్కొల్పలేకపోయాడు. తర్వాత తలుపు తీసుకొని నెమ్మదిగా క్రింది ప్లాట్ ఫారం మీదికి దిగిపోయాడు. బండి నిద్రపోతున్న ధర్మదాసును తీసుకొని వెళ్ళిపోయింది. వణుకుతూ వణుకుతూ దేవదాసు స్టేషనుబయటికి వచ్చాడు. ఒక బండివాణ్ణి పిలిచి "'హాథీపోతా' గ్రామం వస్తావా?" అని అడిగాడు.

అతడు ఒకసారి ముఖంవైపూ, మరోసారి అటూ ఇటూ చూసి "రాదు బాబూ! దారి బాగోలేదు. గుర్రబ్బండి నీళ్ళ బురదన పడి అటుపోలేదు" అన్నాడు.

దేవదాసు ఉద్విగ్నుడై "పల్లకీ ఏమయినా దొరుకుతుందా?" అని అడిగాడు.

TOne Home TVNewsMovie NewsVideosRadioTelugu MoviesKidsoneComedyShoppingBhaktiGreetingsNRI CornerRomanceCharityMore...

HOMENOVELSPUBLICATIONS

Share|

దేవదాసు

Prev

బ్రాహ్మణుని మృతదేహం అయినా కూడా గ్రామంలో యెవ్వరూ తాకడానికి అంగీకరించలేదు. అంచేత చండాలురు వచ్చి కట్టుకొని తీసుకుపోయారు. తర్వాత ఎండిపోయిన ఏ చెరువు ఒడ్డునో సగం కాలిన శరీరాన్ని పారేశారు. కాకులూ-గ్రద్దలూ దాని మీదికి వచ్చి వాలిపోయాయి. కుక్కలూ, నక్కలూ పరస్పరం కలహించుకుంటున్నాయి. అప్పుడు కూడా విన్నవాడల్లా అన్నాడు....'ఆహా!' అని దాస దాసీలు కూడా అక్కడక్కడ దీనిని గురించి చెప్పుకుంటున్నారు-

ఎవరో గొప్ప వ్యక్తి! రెండు వందల రూపాయల శాలువ, వందన్నర రూపాయల ఉంగరం, అన్నీ ఇన్స్ పెక్టర్ గారి దగ్గర ఉన్నాయి. రెండు

ఉత్తరాలున్నాయి. అవికూడా వాళ్ళే ఉంచుకున్నారు.

ఈ సమాచారమంతా పార్వతి చెవిన పడింది. కాని ఆమె ప్రస్తుతం పరధ్యానంగా వుంటున్నది. ఏ విషయంలోనూ ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం లేదు. అందువలన ఈ విషయంలో కూడా కొంచెం సరీగా అర్థం చేసుకోలేదు. కాని అందరూ ఈ విషయం చర్చించుకోవడం చూసి ఈ విషయంలో కొంచెం ప్రత్యేకంగా తెలుసుకొనవలెననే అభిలాషతో ఒక దాసీని అడిగింది_"ఏం జరిగిందీ? ఎవరు చనిపోయారు?"

"ఆహా! అది ఎవరికీ తెలియదమ్మా! గత జన్మలోని వాడెవరో యీ మట్టికి చెందినవాడై వుంటాడు. అతడు కేవలం చనిపోవడానికే వచ్చాడు. నిన్నరాత్రి అంతా ఇక్కడే పడి వున్నాడు. ఈ రోజు ఉదయమే చనిపోయాడు."

పార్వతి దీర్ఘంగా నిట్టూర్చి "అతణ్ని గురించి ఎవరికీ ఏమీ తెలియదా?" అన్నది.

"మహేంద్రబాబుకు తెలిసి వుండవచ్చు. నాకేమీ తెలియదు" అన్నది దాసీ.

మహేంద్రుడికి పిలుపు వచ్చింది. "మీ ప్రాంతానికి చెందిన దేవదాస్ ముఖోపాధ్యాయ" అని ఆయన చెప్పాడు.

పార్వతి మహేంద్రునికి చాలా దగ్గరగా జరిగి తీవ్రంగా చూస్తూ "ఏమిటీ! దేవదాదా? ఎట్లా తెలుసుకున్నావు?" అని అడిగింది.

"జేబులో రెండు ఉత్తరాలు ఉన్నాయి. ఒకటి ద్విజ్ దాస్ ది...."

"అవును, ఆయన అన్నగారిది" అన్నది పార్వతి.

"మరొకటి కాశీనుంచి హరిమతీ దేవి వ్రాసినది...."

"అవును, ఆమె తల్లి."

"చేతిమీద పేరు పచ్చ పొడిచి వుంది...."

"అవును, మొట్టమొదట కలకత్తా వెళ్ళినప్పుడు పచ్చ పొడిపించుకున్నాడు."

"ఇక నీలంరాయి వున్న ఉంగరం వుంది."

"తండ్రిగారి కాలంలో దానిని పెదనాన్న యిచ్చాడు....నేను వెళతాను...."

అంటూనే పార్వతి పరుగు తీసింది. మహేంద్రుడు నిశ్చేష్టుడై "ఓ అమ్మ! ఎక్కడికెళతావు?" అన్నాడు.

"దేవదాసు దగ్గరికి."

"ఆయన ఇప్పుడు లేడు. చండాలురు తీసుకెళ్ళారు."

"ఆమ్మో, అమ్మో!" అంటూ రోదిస్తూ పార్వతి పరుగుతీసింది.

మహేంద్రుడు పరుగెత్తుకుంటూ పోయి అడ్డం నిల్చున్నాడు. "అమ్మా

పిచ్చెక్కిందా ఏం? ఎక్కడికెళతావు?"

పార్వతి మహేంద్రుని వైపు తీవ్రంగా చూస్తూ "మహేంద్రా! నిజంగా నీవు నన్ను పిచ్చిదాన్ని అనుకున్నావా? దారికి అడ్డం రాకు....!" అన్నది.

ఆమె వైపు చూచి మహేంద్రుడు దారిలో నుంచి తప్పుకున్నాడు. మౌనంగా ఆమె వెనకే వెళుతూ వున్నాడు. బయట అప్పుడు కూడా మేనేజరు, గుమస్తా మొదలయిన వాళ్ళు పనులు చేస్తూ వున్నారు. వాళ్ళు చూస్తూ ఉన్నారు. చౌదరిగారు కళ్ళజోడు పెట్టుకుని "ఎవరు వెళుతున్నారు?" అని అడిగాడు.

"చిన్నమ్మ" అన్నాడు మహేంద్రుడు.

"ఈమె ఎందుకు? ఎక్కడికి వెళుతున్నది?"

"దేవదాసును చూడటానికి" అన్నాడు మహేంద్రుడు.

భువన్ చౌదరి అరుస్తూ "మీ అందరి బుద్ధి యేమయిపోయింది? పట్టుకోండి, పట్టుకోండి! ఆమెను పట్టుకొని తీసుకురండి. అందరూ పిచ్చి వాళ్ళయిపోయారు! ఓ మహేంద్రా, త్వరగా పరుగెత్తు!" అన్నాడు.

ఆ తర్వాత దాసీలందరూ పరుగెత్తారు.దాసీలందరూ కలిసి పార్వతిని పట్టుకొన్నారు.స్పృహ తప్పిపోయిన ఆమె దేహాన్ని లోపలికి తీసికొని వెళ్ళారు. రెండవరోజు ఆమెకు స్పృహ వచ్చింది. కాని ఆమె ఏ విషయమూ చెప్పలేదు. కేవలం ఒక దాసీని పిలిచి అడిగింది__రాత్రి ఆయన వచ్చారా లేదా? రాత్రంతా....!"

ఆ తర్వాత పార్వతి మౌనం వహించింది.

ఇప్పుడు ఇన్ని రోజుల తర్వాత పార్వతి సంగతి యేమయిందో, ఆమె ఎట్లున్నదీ, ఆ విషయం మాకు తెలియదు. తెలుసుకోవాలనే కోరిక కూడా కలగటం లేదు. కేవలం దేవదాసు కోసమే హృదయం క్షోభిస్తూ ఉంది. మీలో గూడా యీ కథ చదివిన వాళ్ళు బహుశా నా మాదిరిగానే క్షోభిస్తారు. అయినప్పటికీ దేవదాసు వంటి దురదృష్టవంతుడు, సంయమనం లేనివాడు, పాపిష్టుడూ అయిన వ్యక్తితో ఎవరికైనా పరిచయం వుంటే వాళ్ళు అతని కోసం పరమేశ్వరుని ప్రార్థించండి. ఇంకేమైనా కానివ్వండి. కాని దేవదాసు మృత్యువు లాంటిది ఎవరికీ సంభవించకూడదని ప్రార్థించండి. మృత్యువు సంభవించడంలో హానీ ఏమీలేదు. కాని ఆ సమయంలో స్నేహ హస్తపు స్పర్శ తలమీద తప్పకుండా వుండాలి. కరుణార్ద్ర మైన ఉన్న ఒక వదనాన్ని చూస్తూ చూస్తూ యీ జీవితం అంతం కావాలి. అందువల్ల మరణించే సమయంలో ఎవరి నయనాల నుండి అయినా రాలిన రెండు అశ్రు బిందువులు చూసి అతడు శాంతితో మరణించ గలగాలి.

# * సమాప్తం *